శుక్రవారం
19-12-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 88
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

విశాలాంధ్ర

స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

56 వేల మంది పాక్ బిచ్చగాళ్ల బహిష్కరణ

దుబాయ్: వ్యవస్థీకృత భిక్షాటన, నేర కార్యకలాపాలకు పాల్పడుతున్న వేలాది మంది పాకిస్థాన్ పౌరులపై సౌదీ అరేబియా, యూఏఈలు కొరడా ఝుళిపిస్తున్నాయి. దాదాపు 56వేల మందిని వెనక్కి పంపాయి. ఈ మేరకు పాక్ చట్టసభకు అక్కడి జాతీయ దర్యాప్తు సంస్థ ఇటీవల నివేదిక అందించింది. 2025లో 66,154 మంది పాక్ పౌరులను వెనక్కి పంపించినట్లు పాకిస్థాన్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ వెల్లడించింది. గతేడాది ఈ సంఖ్య 35 వేలుగా ఉందని పాక్ జాతీయ అసెంబ్లీ స్టాండింగ్ కమిటీకి నివేదిక అందించింది.వర్క్, పర్యటక, ఉమ్రా వీసాలపై వెళ్లిన వాళ్లే 51 వేల మంది ఉన్నారని పేర్కొంది.

నేడు తెలుగు రాష్ట్రాలకు సీఈసీ

విశాలాంధ్ర-హైదరాబాద్: భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ శుక్రవారం తెలుగు రాష్ట్రాలకు రానున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో హైదరాబాద్ విమానాశ్రయానికి వస్తారు. సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలానికి బయలుదేరి వెళతారు. డిసెంబర్ 20న ఉదయం శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో మహా ఆరతి కార్యక్రమంలో పాల్గొని... స్వామివారిని దర్శించుకుంటారు. తన పర్యటనలో హైదరాబాద్‌లోని చారిత్రక ప్రదేశాలైన గోల్కొండ కోట,

- మిగతా 2 లో

బార్ కౌన్సిల్ ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్

న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికలకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ ఎన్నికల్లో 30 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. బార్ కౌన్సిల్ ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని న్యాయవాది గుడిమళ్ల సుభాషిణి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు... బార్ కౌన్సిల్ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ కల్పిస్తూ నోటిఫికేషన్ ఇవ్వాలని పేర్కొంది. ఈ నెల 20వ తేదీన బార్ కౌన్సిల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండగా... జనవరి 30వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి. ఫిబ్రవరి 10వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది.

నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపు

విశాలాంధ్ర-హైదరాబాద్: హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టుకు గుర్తుతెలియని వ్యక్తి పంపిన బాంబు బెదిరింపు మెయిల్ తీవ్ర కలకలం రేపింది. మధ్యాహ్నం 2 గంటలకు కోర్టులో బాంబు పేలుతుందని మెయిల్‌లో పేర్కొనడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, భద్రతా సిబ్బంది అప్రమత్తమై... కోర్టు ప్రాంగణానికి చేరుకున్నారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని బాంబ్ స్క్వాడ్‌ను హుటాహుటిన కోర్టుకు పంపించారు. న్యాయస్థానం చుట్టుపక్కల ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. భద్రతా చర్యలలో భాగంగా కోర్టు పరిసరాల్లో ఉన్న న్యాయవాదులు, సిబ్బంది,

- మిగతా 2 లో

ఇదీ లోకం!

కలెక్టర్ల పాలన బాలేదంటే
మన పాలన బాలేనట్టేకదా!?

బీసీ కోటాపై
చర్చిస్తాం

- గోదావరి-కృష్ణా జలాలపై ఎప్పుడైనా చర్చకు సిద్ధం
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం
- 2029లోనూ ప్రజా ప్రభుత్వానికే పట్టం
- కేటీఆర్‌ను తప్పించేలా హరీశ్ వర్గం ప్రచారం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై శాసనసభ సమావేశాల్లో చర్చిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అన్ని పార్టీల అభిప్రాయం మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయిస్తామని తెలిపారు. తన నివాసంలో గురువారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సహచర మంత్రులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించిన ఎన్నికల అధికారులను సీఎం అభినందించారు. 12,728కుగాను 12,702 పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయన్నారు. తమకు 7,527 పంచాయతీలు (66 శాతం) దక్కాయని, ఈ గెలుపు తమ బాధ్యతను మరింత ఎంచిందని రేవంత్ చెప్పారు. 8335 గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్, కాంగ్రెస్ రెబల్స్ గెలిచారు. బీఆరెస్, బీజేపీ కూటమిగా 33 శాతం, కమ్యూనిస్టులు ఒక శాతం ఫలితాలు సాధించాయన్నారు. కొత్తగా రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ చెల్లింపు, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ. 500 లకే సిలిండర్, రూ.27 వేల కోట్ల మేరకు సున్నా వడ్డీకే మహిళా సమాఖ్యలకు రుణాలు, 4.5 లక్షల మంది

- మిగతా 2 లో

ప్రజా సేవకుడిగా
గుర్తింపు పొందండి

- మానవత్వం... నాయకత్వంతో ముందుకు సాగాలి
- నిజాయతీగా సేవచేస్తూ... ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవాలి
- ప్రజా విశ్వాసంతో కూడిన కొత్త అధ్యాయం ఆరంభం
- ఐఏఎస్‌ల శిక్షణ ముగింపు సభలో భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: అధికారిగా మాత్రమే కాకుండా ప్రజాసేవకుడిగా ప్రజల్లో గుర్తింపు పొందితేనే సివిల్ సర్వీసెస్ హోదాకు న్యాయం చేయగలిగిన వారుగా నిలిచిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో గురువారం ఆల్ ఇండియా సర్వీసెస్, సెంట్రల్ సర్వీసెస్ అధికారులు 10 వారాల శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన భట్టి మాట్లాడుతూ నిజాయితీతో సేవ చేయండి.. ధైర్యంగా నిర్ణయాలు తీసుకోండి.. మానవత్వంతో వ్యవహరించండి.. నాయకత్వంతో ముందుకు సాగండి అని సూచించారు. శిక్షణ ముగిసి... బాధ్యత, వివేకం, విచక్షణ, ప్రజా విశ్వాసంతో కూడిన కొత్త అధ్యాయం ఆరంభమైందన్నారు. మీలో ఇంజినీర్లు, వైద్యులు, ఆర్థిక నిపుణులు, న్యాయవాదులు, సాంకేతిక నిపుణులు ఉన్నారు... ప్రతిభతో సరైన సమయంలో స్పందించాల్సి

- మిగతా 2 లో

రూ.15 వేల కోట్ల భూమి తెలంగాణ ప్రభుత్వానిదే: సుప్రీం

న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. రూ.15 వేల కోట్ల విలువ చేసే భూములకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు ఇచ్చింది. హైదరాబాద్ వనస్థలిపురం సమీపంలోని సాహెబ్‌నగర్ వద్ద ఉన్న 102 ఎకరాల భూమి తెలంగాణ అటవీ శాఖదేనని తేల్చింది. దాదాపు 20 ఏళ్లుగా ఈ భూ వివాదం కొనసాగుతోంది. ఈ భూమిపై యాజమాన్య హక్కులు కోరుతూ నిజాం, సాలార్ జంగ్, మీరాలం వారసులమంటూ కొంతమంది న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేశారు. గతంలో పిటిషన్లు వేసిన 260 మందికి అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి ధర్మాసనం... ఇది పూర్తిగా అటవీ భూమి అని చెబుతూ రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి హక్కులు కల్పిస్తూ తీర్పు ఇచ్చింది. తీర్పు వెలువడిన 8 వారాల్లో రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించింది. నోటిఫికేషన్ ప్రతిని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి పంపాలని ధర్మాసనం ఆదేశించింది.

పాల ఉత్పత్తిలో దేశానికే ఆదర్శం

మహిళల ఆర్థికవృద్ధికి ఇందిరా మహిళా డెయిరీ

లబ్ధిదారులకు పాడిపశువుల పంపిణీ వేగవంతం: భట్టి

2 లో

ఉపాధికి పాతర

- 'వీబీ జీ రామ్ జీ' బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- ప్రతిపక్ష ఎంపీల నుంచి తీవ్ర నిరసన... సభలో గందరగోళం
- కొత్త బిల్లు ప్రతులను చించేసిన సభ్యులు
- స్పీకర్ వెల్ వద్ద బైఠాయింపు
- మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందిందని స్పీకర్ ప్రకటన

న్యూఢిల్లీ: ప్రతిపక్షాలు ముక్త కంఠంతో వ్యతిరేకించినప్పటికీ కేంద్రంలోని మోదీసర్కారు ఉపాధిహామీ చట్టానికి పాతరేసింది. ప్రతిపక్షాల భారీ నిరసనలు, నినాదాల మధ్య గ్రామీణ పేదలకు ఆసరాగా నిలిచిన 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' స్థానంలో తీసుకొచ్చిన 'వికసిత్ భారత్ - జీ రామ్ జీ' బిల్లు-2025ను లోక్‌సభలో ఆమోదింపచేసుకుంది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాలు పెద్దఎత్తున నిరసన వ్యక్తంచేశాయి. వారి ఆందోళన నడుమ స్పీకర్ మూజువాణి ఓటింగ్ నిర్వహించి... బిల్లుకు ఆమోదం లభించిందని ప్రకటించారు. ఈ సమయంలో ప్రతిపక్ష ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన చేపట్టాయి. కొందరు ప్రతిపక్ష నేతలు 'వీబీ జీ రామ్ జీ' బిల్లు ప్రతులను చించి గాల్లోకి విసిరేశారు. ఈ గందరగోళం నేపథ్యంలో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది. ఈ బిల్లును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అయితే ఇప్పటికే దీనిపై సుదీర్ఘ చర్చ జరిగిందని స్పీకర్ ఓం బిర్లా పేర్కొనడంతో ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే వెల్‌లోకి దూసుకెళ్లి.. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేస్తూ బిల్లు కాపీలను చింపి గాలిలోకి విసిరారు. దీనిపై స్పందించిన స్పీకర్ ఓం బిర్లా.. కాగితాలు చింపడానికి ప్రజలు ఓట్లు వేసి గెలిపించి ఇక్కడికి పంపించలేదని ఎంపీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో ఏం

- మిగతా 2 లో

రూ.2.25 కోట్లతో అభివృద్ధి పనులు

- గంజాయి నియంత్రణకు ప్రజల సహకారం అవశ్యం
- జనాభాకు అనుగుణంగా మౌలికవసతులు: మంత్రి తుమ్మల

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: ప్రజల అవసరాలకు అనుగుణంగా ఖమ్మం నగర పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. 14వ డివిజన్ గోపాలపురంలో రూ.2.25 కోట్లతో చేపట్టిన బీటీ, సీసీ రోడ్లు, డ్రెయినల అభివృద్ధి పనులకు మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి గురువారం శంకుస్థాపన

- మిగతా 2 లో

ఎస్ఐఆర్ గణన ఫారాల సమర్పణ
గడువు పొడిగించండి

ఈసీఐకి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: ఎస్ఐఆర్ గణన ఫారాల సమర్పణ తేదీని పొడిగించాలని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)ని సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. ఉత్తరప్రదేశ్, కేరళ సహా వివిధ రాష్ట్రాల్లోని వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని... ఎస్ఐఆర్ 2026 ఓటర్ల జాబితా కింద గణన ఫారాల సమర్పణ తేదీ పొడిగించాలన్న అభ్యర్థనలపై సానుభూతి దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలని ఈసీఐని సుప్రీంకోర్టు కోరింది. ఎస్ఐఆర్ రాజ్యాంగబద్ధతపై విచారణను 2026 జనవరి 6కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం పేర్కొంది. కేరళ షెడ్యూల్‌ను ముందుగా సవరించారు. గణన గడువును డిసెంబర్ 18కి వాయిదా వేశారు. అలాగే ముసాయిదా ఓటరు జాబితాను డిసెంబర్ 23న ఈసీఐ ప్రచురించనుంది. అయితే ఉత్తరప్రదేశ్

- మిగతా 2 లో

నూరుశాతం రైతు రుణమాఫీ చేయాలి

40 శాతం సర్పంచ్ స్థానాల గెలుపు

పల్లె ప్రజల తిరుగుబాటుకు నిదర్శనం: హరీశ్‌రావు

విశాలాంధ్ర బ్యూరో- మెదక్: తక్షణమే రైతుల రుణమాఫీ పూర్తిచేసి, బోనస్ బకాయిలు చెల్లించాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. షరతులు లేకుండా రైతుబంధు విడుదల చేయాలని, గణపురం ఆయకట్టు రైతులకు సాగునీటి విడుదలపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలని అన్నారు. గురువారం మీడియా సమావేశంలో

- మిగతా 2 లో

నోబెల్ ఫౌండేషన్‌పై అసాంజె క్రిమినల్ ఫిర్యాదు



స్టాక్‌హోమ్: నోబెల్ శాంతి పురస్కారాన్ని వెనిజులాకు చెందిన మారియా కొరీనా మచాడోకు ఇవ్వడంపై వికీలీక్స్ వ్యవస్థాపకుడు జులియన్ అసాంజె తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. నోబెల్ ఫౌండేషన్‌పై స్వీడెన్‌లో క్రిమినల్ ఫిర్యాదు దాఖలు చేశారు. ఆర్థిక నేరాలకు, యుద్ధ నేరాలకు లబ్ధి చేకూరుస్తున్నట్లు నోబెల్ ఫౌండేషన్‌ను నిందించారు. మచాడోకు అవార్డు రూపేణ ఇవ్వాల్సిన నగదు చెల్లింపులు ఆపేయాలని ఆయన డిమాండ్ చేశారు. వెనిజులాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైనిక చర్యలను మచాడు బహిరంగంగానే సమర్థించారని పేర్కొన్నారు. తద్వారా శాంతి పురస్కారం మూల సిద్ధాంతాలను ఆమె అతిక్రమించారని అసాంజె వాదించారు. ఈ మేరకు ప్రకటనను ఎక్స్‌లో వికీలీక్స్ పెట్టింది. అవార్డు రూపేణ నోబెల్ ఫౌండేషన్ 1.18 మిలియన్ డాలర్ల నగదును మచాడోకు ఇవ్వకుండా ఆపేందుకు అసాంజె యత్నిస్తున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ ఉద్దేశాలకు విరుద్ధంగా మచాడో గత-ప్రస్తుత ప్రవర్తన ఉన్నట్లు అసాంజె ఆరోపించినట్లు పేర్కొంది. కాగా, స్వీడిష్ ఎకనమిక్ క్రైమ్ అథారిటీతో పాటు స్వీడిష్ వార్ క్రైమ్స్ యూనిట్‌కు అసాంజె ఫిర్యాదు చేశారు. శాంతి సాధనను యుద్ధ సాధనగా మార్చారంటూ నోబెల్ ఫౌండేషన్ చైర్మన్ ఆస్ట్రిడ్ సోడెర్బర్గ్ విడ్డింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హన్నా స్జార్నేను ఆరోపించారు. ఇది నమ్మకద్రోహం, యుద్ధ నేరాలకు వసతులు కల్పించడం, అధికారాన్ని దుర్వినియోగించడం అంటూ ఆరోపణలు చేశారు. నోబెల్ శాంతి పురస్కార గ్రహీతగా మచాడో తన హోదాను యుద్ధానికి అనుకూలంగా దుర్వినియోగించేందుకు అవకాశం లేకపోలేదని అసాంజె హెచ్చరించారు.

బంగ్లాదేశ్ సంక్షోభం భారత్‌కు ముప్పు

షేక్ హసీనా కుమారుడి హెచ్చరిక

ఢాకా: బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభం భారత్‌కు ముప్పుగా మారుతుందని మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజిబ్ వజాద్ హెచ్చరించారు. దేశంలో ఇప్పటికే ఉగ్రవాద శిక్షణ శిబిరాలు న్నాయని ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలు ఫిబ్రవరిలో జరగనున్న నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య అణచివేసేలా ఆపద్ధర్మ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆరోపించారు. అల్‌ఖైదా, లష్కరే తయ్యిబా కమాండర్లు బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. జమాతే ఇస్లామీ వంటి ఇతర ఇస్లామిక్ పార్టీలకు ఆపద్ధర్మ ప్రభుత్వం అనుకూలంగా ఉందన్నారు. ఈ పరిణామాలు బంగ్లాదేశ్‌లో అస్థిరత నెలకొల్పుతుందని, తద్వారా భారత్‌కు ముప్పు ఏర్పడుతుందని ఆయనన్నారు. సగం మంది ఓటర్లను తొలగించే ప్రయత్నాల్లో ఆపదద్ధర్మ ప్రభుత్వమున్నద న్నారు. ఇస్లామిక్ సంస్థలపై అవామీ లీగ్ గతంలో విధించిన ఆంక్షలను యూనస్ సర్కారు సడలించిందని, ఇది ప్రతికూల పరిస్థితులకు దారితీస్తుందని హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం పునరుద్ధరణ, పాదర్శకంగా, స్వేచ్ఛగా ఎన్నికల నిర్వహణను ఆకాంక్షిస్తున్నట్లు సాజిబ్ వజాద్ వెల్లడించారు.

షేక్ హసీనాను అప్పగించాలి

భారత్ హై కమిషన్ వరకు మార్చ్-భారత్ వ్యతిరేక నినాదాల హోరు

ఢాకా: బంగ్లాదేశ్ రాజధానిలో భారత్ వ్యతిరేక నినాదాలు మార్మోగాయి. ఢాకాలోని భారతదేశ హై కమిషన్ వరకు భారీ మార్చ్ జరిగింది. అనేక మంది బంగ్లాదేశీలు వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. జులై ఓయిక్యా (జులై ఐక్యత) బ్యానర్ కింద ఈ ఆందోళన జరిగింది. మాజీ ప్రధాని షేక్ హసీనాతో పాటు గతేడాది జులైలో పలయానం సాగించిన వారిని అప్పగించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఉత్తర బద్దా, హుస్సేన్ మార్కెట్ వద్ద రామ్‌పురా వంతెన వద్ద నుంచి మార్చ్ మొదలు కాగా మార్గం మధ్యలో పోలీసులు అడ్డుకున్నారు. హై కమిషన్ వరకు వెళ్లకుండా భారీ బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే ఆందోళనకారులు వాటిని దాటుకొని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఇదే క్రమంలో ఆందోళనకారులు భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. 'హై కమిషన్‌పై దాడి చేసేందుకు భయపడం. బంగ్లాదేశ్‌పై పెత్తనం చేయాలని చూస్తే ఊరుకోం' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా భారత్‌కు చెందిన రాజకీయ పార్టీలు, మీడియా, ప్రభుత్వ అధికారులు కుట్రలు చేసున్నాయని ఆరోపించారు. ఢాకా యూనివర్సిటీ సెంట్రల్ స్టూడెంట్స్ యూనియన్ (డీయూసీఎస్‌యూ) సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ ఏబీ జుబేర్ నాయకత్వంలో ఈ మార్చ్ జరిగింది. పోలీసులు అడ్డుకోవడంతో ఆందోళనకారులు రోడ్డుపైనే బైఠాయించారు. 'దిల్లీ లేదా ఢాకా, ఢాకా... ఢాకానే, నా సోదరుడు హదీ- హదీ ఎందుకు చనిపోవాలి' అంటూ నినాదాలు ఇచ్చారు.

అమెరికా దళాలకు

ట్రంప్ క్రిస్మస్ బోనస్

వాషింగ్టన్: అమెరికా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇదే క్రమంలో శ్వేతసౌధంలో ప్రసంగిస్తూ అమెరికా దళాలకు 1,776 డాలర్ల కిస్మిస్ బోసన్ ప్రకటించారు. తద్వారా సుంకాల వల్ల తమ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని ఆయన చెప్పకనే చెప్పారు. క్రిస్మస్ పండుగకు ముందు 'వారియర్ డివిడెంట్'గా 1,45 మిలియన్ మంది సైనికులకు బోనస్ అందుతుందని ట్రంప్ ప్రకటించారు. 11 నెలల కిందట ఓ అస్థవ్యస్థ వ్యవస్థ నా చేతికి వచ్చింది... దానిని సరిదిద్దుతూ తిరిగి గాడిలో పెడుతున్నా అని ఆయన అన్నారు.

త్వరలో మియామీలో రష్యా-అమెరికా చర్చలు

ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపడంపై రష్యాతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈవారంతంలో మియామీలో కొత్తగా చర్చలు జరపనున్నారు. ఈ మేరకు శ్వేతసౌధం వెల్లడించింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో రెండు రోజుల పాటు బెర్లిన్‌లో జరిపిన చర్చల పురోగతి నేపథ్యంలో తాజా చర్చలకు ప్రాధాన్యత ఏర్పడింది. యుద్ధం మరో సంవత్సరంలోకి అడుగు పెట్టబోతుండటంపై ఇప్పటికే రష్యాను రాయబారులు హెచ్చరించినట్లు తెలుస్తోంది. చర్చల్లో ట్రంప్ రాయబారి స్టీవ్ విట్కాఫ్, అల్లుడు జారెడ్ కుష్నర్ అమెరికా తరపున పాల్గొంటారు. అలాగే రష్యా బృందానికి ఆ దేశాధ్యక్షుడి ఆర్థిక రాయబారి కిరిల్ దిమిత్రీవ్ నాయకత్వం వహిస్తారు. ప్రతినిధి బృందాల్లో ఎవరెవరు ఉంటారో శ్వేతసౌధం వెల్లడించలేదు. నాలుగేళ్లుగా ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం కొనసాగుతున్న విషయం విదితమే. ఈ యుద్ధం ఉద్దేశం తప్పక నెరవేరుతుందని, రష్యా తన సొంత భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకుంటుందని ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు.

ఉక్రెయిన్‌కు మద్దతివ్వండి: జెలెన్‌స్కీ

కీవ్: తమ దేశానికి మద్దతివ్వాలంటూ మిత్రపక్షాలను ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ విజ్ఞప్తి చేశారు.

యుద్ధం కొనసాగించడంలో అర్థం లేదంటూ రష్యాకు తెలిసేలా చేయాలని కోరారు. మాస్కోకు చెందిన ఫ్రీజ్ చేసిన ఆస్తులపై కీలకమైన యూరోపియన్ యూనియన్ సదస్సు జరగాల్సి ఉండటంతో జెలెన్‌స్కీ ఈ మేరకు విన్నవించారు. తమకు అన్ని విధాలా అండగా నిలవడం ద్వారా వచ్చే ఏడాది యుద్ధం కొనసాగించడం అర్థరహితమని రష్యాకు తెలిసివచ్చేలా చేయాలని కోరారు. యూరప్ సమావేశాల పరిణామాలు ఉక్రెయిన్‌కు అనుకూలంగా ఉండాలని ఆయనన్నారు.

రైతు రుణమాఫీ చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ... రుణమాఫీ, రైతుబంధు, బోనస్ విషయంలో ప్రభుత్వం రైతులను దారుణంగా మోసం చేసింద న్నారు. కేవలం 40 శాతం మందికి మాత్రమే మాఫీ చేశారన్నారు. గత యాసంగి, ఈ వానాకాలం కలిపి రైతులకు రావాల్సిన సుమారు రూ.1,800 కోట్ల బోనస్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎరువుల సరఫరాను తగ్గించి రైతులను వేధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆడుతున్న నాటకమన్నారు. పత్తి రైతులకు కపాస్ యాప్ తెచ్చి బీజేపీ ముంచితే, ఎరువుల కోసం యాప్ తెచ్చి కాంగ్రెస్ ముంచుతోంద న్నారు. కౌలు రైతుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్ల మెదక్ జిల్లా రైతాంగం పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. సింగూరు ప్రాజెక్టు నుంచి ఘణపురం ఆనకట్టుకు సాగునీరు విడుదల చేస్తారా లేదా అన్న అంశంపై ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వకపోవడం దారుణమన్నారు. దీనిపైనే పాపన్నపేట, హవేలీఘన్పూర్, కొల్చారం, మెదక్ రూరల్ మండలాల్లోని వేలాది ఎకరాల సాగు ఆధారపడి ఉందన్నారు. నాట్లు సమయం ఆసన్నమైనా అధికారులు, పాలకులు స్పందించకపోవడంతో రైతులు గత్యంతరం లేక బోర్లు వేస్తూ రైతులు అప్పుల పాలవుతున్నార న్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ 40 శాతం సర్పంచ్ స్థానాలను గెలవడం రేవంత్ రెడ్డి పతనానికి, పల్లె ప్రజల తిరుగుబాటు నిదర్శనమని హరీశ్ రావు పేర్కొన్నారు. పెన్షన్లు, రుణమాఫీకి పైసలు లేవు కానీ.. మెస్సీ కోసం, అందాల పోటీల కోసం రేవంత్ రెడ్డి వందల కోట్లు ఖర్చు చేశాడని ధ్వజమెత్తారు. రెండేళ్లలో మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, పార్టీ ఇంచార్జి తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

బీసీ కోటాపై చర్చిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెళుతున్నట్లు రేవంత్ వెల్లడించారు. ఆదాయాన్ని పెంచుకుంటూ దుబారాను తగ్గిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులకు సంబంధించి పూర్తి వివరాలతో శాసనసభలో చర్చించడానికి సిద్ధమని సీఎం చెప్పారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, 94 అసెంబ్లీ నియోజవర్గాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే 87 స్థానాల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలు సాధించిందన్నారు. బీఆర్ఎస్ ఆరు, బీజేపీ ఒకటి చొప్పున నియోజకవరాల్లో ఆధిక్యత సాధించాయన్నారు. ఒకరి కడుపులో మూసీలో కాలుష్యం కంటే ఎక్కువ విషం ఉందని, ఈ ఫలితాలు అద్భుతమని కొందరు జబ్బలు చరుచుకుంటున్నారని రేవంత్ విమర్శించారు. 2029లో కూడా ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని, కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని దీమాగా చెప్పారు. తెలంగాణను దేశంలో నంబర్‌వన్‌గా నిలపుతామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో ఉండగానే ఆయన్ను ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చాం. గోదావరి, కృష్ణా జలాలపై ఎప్పుడంటే అప్పుడే చర్చకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తాం' అని రేవంత్ సవాల్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే గత పదేళ్లలో తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం చేసింది బీఆర్ఎస్, కేసీఆర్ అని రేవంత్ విమర్శించారు. కేటీఆర్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత జరిగిన ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గెలవలేదన్నారు. కేటీఆర్‌ను తప్పించాలని హరీశ్ వర్గం సామాజిక మాధ్యమంలో ప్రచారం మొదలు పెట్టిందని, ఆ విషయం చర్చకు రాకుండా జిల్లాల పర్యటనలను కేటీఆర్ చేపట్టారని రేవంత్ దుయ్యబట్టారు. సమావేశంలో మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, ధనసరి అనసూయ సీతక్క తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలుగు రాష్ట్రాలకు సీఈసీ

(మొదటిపేజీ తరువాయి)

చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం వంటివి కూడా సందర్శించే అవకాశం ఉంది. అనంతరం డిసెంబర్ 21న హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో తెలంగాణకు చెందిన బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్‌ఓ)తో జ్ఞానేశ్ కుమార్ సమావేశమై... ఎన్నికల ప్రక్రియపై మార్గదర్శకాలు, దిశానిర్దేశం చేయనున్నారు.

గడువు పొడిగించండి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రానికి వస్తే... సవరించిన తుది గడువు డిసెంబర్ 26తో ముగియనుంది. ఈ అంశాలను సీనియర్ న్యాయవాదులు సుప్రీంకోర్టులో లేవనెత్తారు. 2027లో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా... ఇంతముందుగా ఈ ప్రక్రియను ఎందుకు నిర్వహించారని బారాబంకి ఎంపీ తనుజ్ పూనియా సహా యూపీ ఎస్ఐఆర్‌ను సవాలు చేస్తున్న పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా ప్రశ్నించారు. ముసాయిదా జాబితా నుండి 25 లక్షల మంది ఓటర్లు తొలగించనున్నట్లు కేరళ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ పేర్కొన్నారు. రాష్ట్రంలో గణన దశకు చివరి తేదీ డిసెంబర్ 18 అని అన్నారు. జాబితాలో భర్తను మినహాయించారని, భార్యను చేర్చారని, అధికారులకు ఈ విషయం తెలిస్తే... వారు భార్యను కూడా తొలగిస్తారని అన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణను శీతాకాలపు సెలవుల తర్వాత జనవరి 6న చేపడతామని ఆదేశించింది.

నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలను బయటకు తరలించారు. కోర్టు ప్రాంగణమంతా ఖాళీ చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ ఘటనతో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అనుమానాస్పద వస్తువుల కోసం ప్రతి మూలను పరిశీలిస్తూ బాంబ్ స్క్వాడ్ తనిఖీలు కొనసాగించింది. పోలీసు అధికారులు మెయిల్ పంపిన వ్యక్తి వివరాలు గుర్తించేందుకు సైబర్ నిపుణులతో కలిసి దర్యాప్తు ప్రారంభించారు.

పాల ఉత్పత్తిలో దేశానికే ఆదర్శం

విశాలాంధ్ర బ్యూరో- ఖమ్మం: ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని, పాల ఉత్పత్తిలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ నుంచి ఇందిరా మహిళా డెయిరీపై సెర్ప్ సీఈఓ దివ్య, ఎన్.ఆర్.ఎల్.ఎం. బృందం, ఇతర ఉన్నతాధికారులతో ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం, వరంగల్, హన్మకొండ జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఖమ్మం జిల్లాలో పాల కొరతను తగ్గిస్తూ మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ఇందిరా మహిళా డెయిరీ పని చేస్తుందన్నారు. రాబోయే మూడేళ్లలో 20 వేల మంది మహిళలు భాగస్వామ్యం అయ్యేలా ప్రణాళికను తయారు చేశామన్నారు. డెయిరీ ప్రాజెక్టు కోసం రూ.27 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. పాల ఉత్పత్తి, సేకరణ, చిల్లింగ్, సేల్స్, మార్కెటింగ్ రంగాల్లో రాణించేలా నిర్దిష్ట ప్రణాళిక సిద్ధం చేసినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. మొదటి ఏడాది 80 గ్రామాలలో 3,200 మంది మహిళలను ఎంపిక చేసి 80 పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, రోజుకు 16 వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, ఐదు వేల లీటర్ల సామర్థ్యంతో చిల్లింగ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అన్నారు. నాలుగు రిటైల్ కేంద్రాలతో పాలు, పాల ఉత్పత్తుల విక్రయం ప్రారంభించి, క్రమ పద్ధతిలో ఆ సంఖ్యను 10 కు పెంచాలని సూచించారు. లబ్దిదారులకు పాడి పశువుల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. సెర్ప్ సీఈఓ దివ్య మాట్లాడుతూ నాణ్యమైన పశువుల కొనుగోలు, పాల ఉత్పత్తి వ్యాపారంలో నైపుణ్యత ఉన్న అధికారులను ఎంపిక చేసి ఇందిరా మహిళా డెయిరీలో నియమించనున్నట్లు తెలిపారు. రిటైల్ సెంటర్, బీఎంసీ సెంటర్, పాల సేకరణ కేంద్రాల నిర్వహణ అనుగుణంగా అవసరమైన సిబ్బంది నియామకంపై దృష్టి సారించాలని అన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 125 మంది లబ్ధిదారులకు రెండు పాడి పశువుల చొప్పున పంపిణీ చేశామని, రోజుకు ఒక పశువు సరాసరి ఆరు లీటర్ల మేర పాలు ఇస్తున్నట్టు చెప్పారు. మధిర ప్రాంతంలో ప్రతి మండలంలో బీఎంసీ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామని, ఎర్రుపాలెంలో పాల సేకరణ జరుగు తుందని, మిగిలిన నాలుగు మండలాల్లో బీఎంసీ ఏర్పాటులో చిన్న చిన్న పనులు చేయవలసి ఉందన్నారు. ఇందిరా మహిళా డెయిరీ పూర్తి స్థాయిలో చేపట్టేందుకు 40 వేల పాడి పశువులను కొనుగోలు చేయాల్సి ఉంటుందని, దీనికి సంబంధించి రాష్ట్రం నుంచి గైడెన్స్ కావాలని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్ బాబు, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు పొందండి

(మొదటిపేజీ తరువాయి)

ఉందన్నారు. నిబద్ధతతో విధి నిర్వహణ చేయాలని సూచించారు. పాలనలో ఒత్తిడి ఉంటుంది, ప్రశంసలు... విమర్శలూ ఉంటాయి... ఇవన్నీ ప్రజల కోసమే అన్నభావనతో వ్యవహరిం చాలని కోరారు. నిరంతర విద్యార్థిగా ఉంటూ మార్పులకు అనుగుణంగా రూపాంతరం చెందాలని అన్నారు. చరిత్ర, నమ్మకత్వం, కరుణ... ఒక అధికారి సంపాదించగలిగే అత్యంత కఠినమైన ఆస్తులు ఇవే అని పేర్కొన్నారు. పౌరుల సేవకు విలువ ఉంది, అదే మీ వ్యక్తిత్వాన్ని నిర్వచిస్తుందని అన్నారు. ప్రజలతో నిత్యం సంబంధం కొనసాగించాలని, ఓర్పుతో వారు చెప్పే సమస్యలను విని పరిష్కరించాలని అన్నారు. వివేచన, వినయం, నైతిక ధైర్యంతో వ్యవహరించాలన్నారు. నిజాయితీతో సేవ చేయండి. ధైర్యంతో నిర్ణయాలు తీసుకోండి. సానుభూతితో నాయకత్వం వహించండి అని హితబోధ చేశారు. కాగా, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 203 మంది అధికారులు శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు.

ప్రజలతో మమేకం కావాలి: మంత్రి శ్రీధర్ బాబు

'ఈ దేశం మీ నుంచి నీతి, నిజాయితీ, సమయపాలనను కోరుకుంటోంది' అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. జూబ్లీహిల్స్ లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన 'స్పెషల్ ఫౌండేషన్ కోర్స్ ఫర్ ఏఐఎస్... సీసీఎస్ ఆఫీసర్స్-2025' ముగింపు వేడుకలు నిర్వహించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ... గవర్నెన్స్ అంటే కేవలం ఫైళ్లు, నిబంధ నలు కాదని, అది ప్రజలతో మమేకమయ్యే ఒక మానవ సంబంధం అని అన్నారు. అధికారం, హోదా, ప్రొటోకాల్... అన్నీ తాత్కాలికమని.. ప్రజల జీవితాల్లో మీరు తీసుకొచ్చే సానుకూల మార్పు మాత్రమే శాశ్వతమన్నారు. నిర్ణయాలు తీసుకునే సమయంలో సమాజంలోని చిట్టచివరి వ్యక్తిని, నిరుపేదల ప్రయోజనాలనూ పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. అప్పుడే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందుతాయన్నారు. కార్యాలయాలకు మాత్రమే పరిమితం కాకుండా నిత్యం ప్రజలతో మమేకం కావాలని ఉద్బోధించారు. ప్రజా సేవలో బాహ్య ఒత్తిళ్ల కంటే అహంకారం, ఉదాసీనత, అవినీతి వంటి అంతర్గత బలహీనతలే ప్రమాదకరమని హెచ్చరించారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ స్వీయ నియంత్రణ పాటిస్తూనే... నిజాయితీ, వినమ్రత, ధైర్యం కోల్పోవద్దని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పౌర సేవలు ప్రజల ముంగిటకు చేరాలంటే టెక్నాలజీ వినియోగం అత్యవసరమన్నారు. అయితే... ఆ సాంకేతికత ప్రజలకు చేరువగా ఉండాలన్నారు. పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే 'గుడ్ గవర్నెన్స్' సాధ్యమవుతుందని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేయాలని యువ అధికారులకు సూచించారు. ఎంసీఆర్‌హెచ్ఆర్డీ వైస్ ఛైర్‌పర్సన్ శాంతకుమారి పాల్గొన్నారు.

రూ.2.25 కోట్లతో అభివృద్ధి పనులు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. తుమ్మల మాట్లాడుతూ ప్రజలకు మౌలికవసతులకు సీఎం సహకరిస్తున్నారని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు భూ కబ్జాదారులు, రౌడీలను నగరానికి దూరంగా పెట్టినట్టు తెలిపారు. గంజాయి నియంత్రించడానికి ప్రజలు సంపూర్ణంగా సహకారం అందించాలని మంత్రి కోరారు. ఖమ్మం నగర అభివృద్ధికి ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. అధికారులు పర్యవేక్షించి నాణ్యతతో, త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని మంత్రి ఆదేశించారు. ఖమ్మం నగర జనాభా ఐదు లక్షలకు చేరిందని, దానికి అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరు పని చేయాలని అన్నారు. అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ అంగన్వాడి భవనం, ఓపెన్ జిమ్ గోపాలపురం డివిజన్‌లో పూర్తి చేశామన్నారు.

అన్ని డివిజన్లలో ఫుట్ పాత్, పార్కుల నిర్మాణం, నగరానికి మణిహారంగా కేబుల్ బ్రిడ్జి, ఖమ్మం ఖిల్లాకు రోప్ వే, సింథటిక్ ట్రాక్ ప్రధాన రోడ్లు విస్తరణ వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేలా, పచ్చదనం పెరిగేలా పటిష్ట చర్యలు చేపట్టామని అన్నారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమంత రావు, ఆర్డీఓ నరసింహా రావు, ఇరిగేషన్ ఈఈ అనన్య, అర్బన్ తహసీల్దార్ సైదులు పాల్గొన్నారు.

ఉపాధికి పాతర

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతోందో దేశ ప్రజలు గమనిస్తున్నారని మండలించారు. అనంతరం గందరగోళం మధ్యే వికసిత్ భారత్ జీ రామ్ జీ బిల్లుకు ఆమోదం లభించింది.

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, డీఎంకే నేత టీఆర్ బాలు, ఎస్పీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ సహా విపక్ష నేతలు ఈ కొత్త బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. భారత జాతిపిత మహాత్మా గాంధీ పేరును చట్టం నుంచి తొలగించడం ఆయనను అవమానించడమేనని ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడ్డాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం అధిక శాతం నిధులు ఇచ్చేదని... కొత్త చట్టం ప్రకారం ఇప్పుడు 60:40 నిష్పత్తిలో నిధుల భారం పడటం వల్ల పేద రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేయలేవని... పేదలకు పనుల్లేక అవస్థలు పడతారని ప్రియాంక గాంధీ వాద్రా సభ దృష్టికి తెచ్చారు. ఈ చట్టం వల్ల ఉపాధి హామీ పథకం క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పని సాధించేందుకు పేదప్రజలు కష్టపడి సాధించిన హక్కుపై ప్రభుత్వం దాడి చేస్తోందని ప్రతిపక్షాలు విమర్శించాయి. రైతులు, వ్యవసాయ కార్మికుల మధ్య ఘర్షణ సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, భూమిపై నియంత్రణ హక్కులున్నవారిని మెప్పించడానికే కొన్ని నిబంధనలు తెచ్చారని నిరసించారు. వ్యవసాయ పనులకు కూలీలు అందుబాటులో ఉండేలా చేస్తామనేది పచ్చి మోసమన్నారు. ఇక ఈ కొత్త బిల్లును సమర్థిస్తూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేశారు. పాత చట్టం అవినీతికి నిలయంగా మారిందని.. కొత్త చట్టం పారదర్శకతను తీసుకువస్తుందని పేర్కొన్నారు. 100 రోజుల నుంచి 125 రోజులకు ఉపాధిని పెంచడం ద్వారా గ్రామీణ పేదలకు మరింత మేలు జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ గతంలో అన్ని పథకాలకు జవహర్ లాల్ నెహ్రూ పేరు పెట్టిందని, ఇప్పుడు పేర్లు మార్చడంపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం కేవలం పనిపైనే దృష్టి పెడుతుందన్నారు.

మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడతాం: ఖర్గే

అంతకు ముందు వీబీ జీ రామ్ జీ బిల్లును వ్యతిరేకిస్తూ పార్లమెంటు ప్రాంగణంలో ప్రతిపక్షాలు నిరసన తెలిపాయి. వెంటనే బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అని రాసి ఉన్న పెద్ద బ్యానర్‌తో గాంధీ విగ్రహం నుంచి మకర ద్వారం వరకు ప్రతిపక్ష ఎంపీలు ర్యాలీ చేశారు. ఇందులో కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, ఎంపీలు కేసీ వేణుగోపాల్, కనిమొళి, టీఆర్ బాలు, ఏ రాజా తదితరులు పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరును తొలగించడం ద్వారా కేంద్రం ప్రజాస్వామ్యాన్ని చంపేస్తోందని ఎంపీ కేసీ వేణుగోపాల్ విమర్శించారు. వీబీ జీ రామ్ జీ బిల్లును పార్లమెంటు స్థాయి సంఘానికి పంపాలని డిమాండ్ చేశారు. కాగా ఖర్గే 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ... మోదీ సర్కారు మహాత్మా గాంధీని అవమానించడమే కాకుండా, గ్రామాల్లో సామాజిక, ఆర్థిక పరివర్తన తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన పని హక్కును కూడా అణచివేసిందని ఆగ్రహించారు. ప్రభుత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడతామని స్పష్టం చేశారు.

2005లో 'ఉపాధి'కి బీజం

గ్రామీణ నిరుపేదలకు ఉపాధి కల్పించడం కోసం 2025లో అప్పటి యూపీఏ ప్రభుత్వం 'ఎన్ఆర్ఈజీఏ' చట్టాన్ని తీసుకొచ్చింది. 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా పేరు మార్చారు. ఇప్పుడు మోదీ సర్కారు తీసుకొచ్చిన కొత్త బిల్లు ప్రకారం, పేరు మార్చడంతోపాటు ఉపాధి హామీ పథకం అమలులో మార్పులు రానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి సంవత్సరంలో కనీసం 125 రోజుల పాటు వేతనంతో కూడిన ఉపాధి కల్పిస్తామని కేంద్రం చెబుతోంది. ఇక పథకం అమలును పర్యవేక్షించడమే తమ బాధ్యతని... నిర్వహణ, జవాబుదారీతనం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అవుతుందని బిల్లులో పేర్కొన్నారు. రైతులకు కూలీల లభ్యత పెరిగి కూలి రేట్లు నియంత్రణలో ఉండేందుకు వీలుగా వ్యవసాయ సీజన్లో 60 రోజులపాటు ఉపాధి హామీ పనులను నిలిపివేయాలని బిల్లులో ప్రతిపాదించారు. ఉపాధి కల్పించడంతోపాటు నాలుగు ప్రాధాన్య రంగాల్లో చిరకాలం మన్నే మౌలికవసతుల కల్పనకు కొత్త చట్టం వీలు కల్పిస్తుందని బిల్లులో పేర్కొనడం జరిగింది.

నేడు దేశవ్యాప్త నిరసనలకు వివిధ సంఘాల పిలుపు

ఎంజీ నరేగా చట్టం బదులు కేంద్రం తీసుకువచ్చిన జీ రామ్ జీ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని వివిధ సంఘాలు నిర్ణయించాయి. 'నరేగా సంఘర్ష్ మోర్చా' దిల్లీ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. గ్రామీణ ఉపాధి పథకం స్వరూపాన్నే మార్చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పనిదినాల సంఖ్య పెంచడం కంటితుడుపేనని, వ్యయభారం రాష్ట్రాలపై గణనీయంగా పెరగబోతోందని చెప్పారు. పని చేయడాన్ని హక్కుగా తొలిసారి మార్చిన ఎంజీ నరేగాను పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిందని, కొత్త బిల్లు విషయంలో అలా జరగలేదని ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ చెప్పారు. ఏకాభిప్రాయం లేకుండా కేవలం మెజారిటీ ఓటు సాయంతో ప్రధాన మార్పుల్ని చేయడం తగదన్నారు. రాష్ట్రాలు, కార్మిక సంఘాలతో ఎంతో లోతుగా చర్చించాకే గతంలో ఉపాధి హామీ చట్టాన్ని తెచ్చారని సీపీఐ జాతీయ కార్యదర్శి అనీ రాజా గుర్తుచేశారు. హక్కును కాస్తా ప్రభుత్వమిచ్చిన బహుమతిగా మార్చేస్తున్నారని మరో ఆర్థికవేత్త జయతీఘోష్ విమర్శించారు. శుక్రవారం మొదలయ్యే నిరసనలు ఇకపై దేశమంతటా కొనసాగుతాయని ఉద్యమకారుడు యోగేంద్ర యాదవ్ చెప్పారు.

ప్రేమ, కరుణకు క్రిస్మస్ ప్రతీక : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : క్రిస్టమస్ పండుగ శాంతి, ప్రేమ, కరుణ, త్యాగం వంటి మానవీయ విలువలకు ప్రతీక అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. గురువారం కలెక్టరేట్లో కార్యాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రిస్టమస్ వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి ఉద్యోగులు, సిబ్బందికి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు శాంతాక్లాజ్, వేషధారణలతో పాటు నృత్యాలు, పాటలు, సందేశాత్మక ప్రదర్శనలు చేసి అందరినీ అలరించారు. క్రిస్టమస్ పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక శోభను చేకూర్చాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్రీస్తు జీవితం, బోధలు సమస్తం శాంతి, ప్రేమ, కరుణ, త్యాగం వంటి విలువలు కలిగి ఉందన్నారు. క్రిస్టియన్ సోదరులు ప్రపంచవ్యాప్తంగా ఘనంగా చేసుకునే పండుగ ఇదే అన్నారు. యేసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆదర్శప్రాయమని వివరించారు. వాటిని ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు. పరస్పర సహకారం, సహనం, సోదరభావంతో జీవించడమే క్రిస్టమస్ పండుగ అసలైన సందేశమన్నారు. క్రిస్టమస్ పండుగను క్రైస్తవ సోదరులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో కలిసి ముందుకు సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీవో, మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణ లత లెనీనా, టేకులపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సులోచన రాణి, టీజీవోస్ జిల్లా అధ్యక్షులు సంఘం వెంకట పుల్లయ్య, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు అమరనేని రామారావు జిల్లా అధికారులు, పాస్టర్లు ప్రభుదాస్, తిమోతి,ఐడీఓసీ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొని క్రిస్టమస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని అన్ని కోర్ట్ లలో డిసెంబర్ 21న ఆదివారం జరిగే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలనీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురు వారం ఆయన ఒక ప్రకటనలో వివరించారు. తమ మీద కాని, మనకు తెలిసిన వాళ్లు, సమీప బంధువుల మీద కాని ఏమైనా కేసులు ఉన్నట్లైతే వాటిని (కాంప్రమైజ్) రాజీ చేసుకోవచ్చని అన్నారు. కక్షిదారులు తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవడం వలన సమయం, డబ్బు అదా అవుతుందన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారం కొసం ఈ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నామని తెలిపారు. అత్యధిక కేసులను పరిష్కరించడేమే లక్ష్యంగా పోలీసు అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. యాక్సిడెంట్ కేసులు, సివిల్, చీటింగ్, చిట్ ఫన్డ్ కేసులు, భూతగాదాలు, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, దొంగతనం, డ్రంక్ అండ్ డ్రైవ్, బ్యాంకు లావాదేవీల కేసులను ఈ లోకదారులతో పరిష్కరించుకునే వీలుందన్నారు. కేసును పూర్తిగా క్లోజ్ చేసుకునే అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రాజేందర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

విశాలాంధ్ర-తొర్రూరు: అమ్మాపురం శివారు జికే తండా గ్రామానికి చెందిన రైతు గుగులోతు కోట (45) విద్యుత్ షాక్ తో మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది.స్థానికుల కథనం ప్రకారం మృతుడు కోట తన వ్యవసాయ పొలం వద్ద స్టార్టర్ లో ఫీజులు ఎగిరిపోవడంతో ఫీజులను సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. చుట్టుపక్కల రైతులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడు కోటకు భార్య తోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన రైతు విద్యుత్ షాక్ తో మృతి చెందడం బాధాకరమని, ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జీకే తండ సర్పంచ్ భానోత్ శీను నాయక్ కోరారు.

ఫలించిన పోలీస్ త్రిముఖ వ్యూహం

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో: సూర్యాపేట జిల్లా గ్రామపంచాయతీ ఎన్నికలు అత్యంత ప్రశాంత వాతావరణంలో ముగియడంలో జిల్లా పోలీస్ శాఖ అమలు చేసిన త్రిముఖ వ్యూహం కీలక పాత్ర పోషించింది. పోలీసు ప్రజా భరోసా కార్యక్రమం ద్వారా గ్రామాల్లో చట్టాలు, శిక్షలపై విస్తృత అవగాహన కల్పించారు. బైండోవర్ కేసు కాదని, సత్ప్రవర్తనకు ఇచ్చే హామీ మాత్రమేనని ప్రజలకు వివరించారు. సమస్యలు సృష్టించే అవకాశం ఉన్నవారిపై ముందస్తుగా బైండోవర్ చర్యలు చేపట్టారు.అలాగే ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు, వారి మద్దతుదారులకు ఎన్నికల నియమావళి ఉల్లంఘనల పరిణామాలపై కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ ముందస్తు ప్రణాళికలు, నిరంతర ప్రజాసంపర్కంతో పోలీసులు ప్రజల్లో మార్పు తీసుకురావడంతో జిల్లాలో ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించగలిగినట్లు ఎస్పీ నరసింహ తెలిపారు.

అన్నదాన క్షేత్రం భవనానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయం బోడుప్పల్ ఆలయ విస్తీర్ణంలో భాగంగా గురువారం ఉదయం అన్నదాన క్షేత్రం భవనానికి శ్రీ శ్రీ శ్రీ జగద్గురు శంకరాచార్యులు, శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య సంస్థానాధీశ్వరులు, శ్రీ విద్యారణ్య భారతి స్వామీజి వారి కరకమలములచే 2 నూతన ద్వారాలు (చౌకోట్లు)కు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఏర్పాటు చేయడం జరిగింది. సనాతన ధర్మం కోసం అందరూ పాటుపడాలని స్వామివారు కోరారు.
ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శులు కె. అశోక్ కుమార్, ఎస్. శ్రీనివాస్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్ రావు, ట్రస్ట్ ధర్మకర్తలు0 బి. హేమచందర్, డి. నర్సింగ్ రావు, ఎమ్. సాయి బాబా (శ్యామ్), వై. చంద్రశేఖర్, ఎన్. శ్రీధర్ కె. ప్రవీణ్ కుమార్ ఆలయ అర్చకులు చంద్రశేఖర్ శర్మ, ఉమకాంత్ శర్మ భక్తులు, బంధుమిత్రులు, ఆలయ ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే పట్టం: మంత్రి

విశాలాంధ్ర-హుస్నాబాద్ : ప్రజా సంక్షేమానికి ప్రజలు పట్టం కట్టారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హుస్నాబాద్ నియోజక వర్గ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలపరచి గెలుపొందిన సర్పంచి, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో మొత్తం 173 సర్పంచులు ఉంటే సైదాపూర్ మండలంలో 2గ్రామాలకు ఎన్నికలు జరగలేదని, 171 పంచాయతీ లకు ఎన్నికలు జరగగా అందులో కాంగ్రెస్ పార్టీ సొంతగా 108మంది గెలిపొందగా 11మంది ఇండిపెండెంట్లు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని దీంతో 119మంది కాంగ్రెస్ పార్టీ సర్పంచులు అవుతున్నారని, అందులో బీఆర్ఎస్ 40, బీజేపీ 10, సీపీఐ 2 స్థానాలు గెలిచాయని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కృషితో విజయం సాధించామని అవి ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు ఆశీర్వదించారన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500కే గ్యాస్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఉద్యోగాల భర్తీ ఇలా ఎన్నో పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రజాస్వామ్యం మీద విశ్వాసంతో ఓటింగ్ పెద్ద ఎత్తున తరలించారని తెలిపారు. గ్రామాల్లో వృద్ధులు ఓటు వేస్తేనే ఉన్నట్టు లేకపోతే లేనట్టు అనే విధంగా వ్యవహరించారని అందుకే పెద్ద ఎత్తున ఓటింగ్ జరిగిందని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఉపాధి కల్పన, వ్యవసాయం, టూరిజం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం ప్రజలు ప్రజా సమస్యలపై వచ్చిన స్థానిక సర్పంచ్ లు మీ స్థాయిలో పరిష్కారం చేసే విధంగా ఉండాలి తెలిపారు. హుస్నాబాద్ మండలంలో 17 గ్రామపంచాయతీలకు కాంగ్రెస్ 13, ఇండిపెండెంట్ 2, బీఆర్ఎస్ 2, స్థానాలు గెలిచిందని చెప్పారు. అక్కన్నపేటలో 38 గ్రామపంచాయతీలకు కాంగ్రెస్ 27, ఇండిపెండెంట్ 2, బీఆర్ఎస్ 7, బీజేపీ 1 గెలిచిందన్నారు. కొహెడలో 27 గ్రామపంచాయతీలకు కాంగ్రెస్ పార్టీ 17, ఇండిపెండెంట్ 1, బీఆర్ఎస్ 5, బీజేపీ 4 గెలిచింది. చిగురుమామిడిలో 17 గ్రామపంచాయతీ లకు కాంగ్రెస్ 7, ఇండిపెండెంట్1, బీఆర్ఎస్ 8, బీజేపీ 1 గెలిచిందన్నారు. సైదాపూర్ మండలంలో 27 గ్రామపంచాయతీలకు కాంగ్రెస్ 19, బీఆర్ఎస్ 7, బీజేపీ 1 గెలిచిందని చెప్పారు. భీమదేవరపల్లిలో 25 సర్పంచులకు కాంగ్రెస్ 15, ఇండిపెండెంట్ 3, బీఆర్ఎస్ 4, బీజేపీ 3 గెలిచిందన్నారు. ఎలుకతుర్తిలో 20 గ్రామపంచాయతీలు ఉంటే కాంగ్రెస్ 10, ఇండిపెండెంట్ 2, బీఆర్ఎస్ 3, సీపీఐ1 గెలిచిందని ఆయన తెలిపారు. అనంతరం గెలిచిన సర్పంచి, ఉప సర్పంచి, వార్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపోకు
రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్: ఎమ్మెల్యే

విశాలాంధ్ర జిల్లా బ్యూరో-మహబూబాబాద్: జిల్లాలోని రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపో ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ అన్నారు. రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపో ఏర్పాటుకై అఖిల పక్ష ప్రజాసంఘాలు గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేతో సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత జూన్ నెల నుండి రైల్వే మెగా మెయింటెనెన్స్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం వివిధ రకాల ప్రయత్నాలను చేశారని, ఒక వైపున రాష్ట్ర ప్రభుత్వం మరోవైపున రైల్వే సంబంధిత ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు చర్చించి మాట్లాడి వారి సూచనలు సలహాలు తీసుకున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి సహకారంతో ఈ ప్రక్రియను ముందుకు కొనసాగించారని తెలిపారు. అనంతరం శివారులోని సుమారు 409 ఎకరాలలో ఏర్పాటుకు కోసం సర్వే చేపించారని, సర్వే వివరాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా సౌత్ సెంట్రల్ రైల్వేజనరల్ మేనేజర్‌కు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ ద్వారా పంపించారని తెలియజేశారు. గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డికి ప్రత్యేక శ్రద్ధ పెట్టిన ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్‌కు సహకారం అందించిన ఎంపీ పోరిక బలరాం నాయక్‌కు సహకరించిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుకు అఖిలపక్ష నాయకులు అభినందనలు తెలిపారు. ఈసమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి, సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్, కోఆర్డినేటర్ మైస శ్రీనివాస్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలన్న, కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు గణపురపు అంజయ్య, ప్రజాసంఘాల నాయకులు గుగ్గిళ్ల పీరయ్య, పిల్లి సుధాకర్, కొండ్ర ఎల్లయ్య, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకుడు కొత్తపెల్లి రవి, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు దార్ల శివరాజ్, టిడిపి నాయకుడు ప్రేమ్చంద్ వ్యాస్, పెరుగు కుమార్,ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర: ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో-మెదక్: పేదలకు ఉపాధి కల్పించాలనే మంచి ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో యూపిఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చి పని కల్పిస్తే దానిని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోదీ సర్కార్ కుట్ర చేస్తోందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మండిపడ్డారు. స్కీంను మార్చడమంటే పేదల పొట్టకొట్టడమేనని విమర్శించారు.పార్టీ పిలుపు మేరకు బుధవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరునే కాకుండా, దాని ఆత్మ, అమలు విధానాన్ని మార్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలనే మహాత్మా గాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్రం నిర్ణయాలు తీసుకుంటున్నదని, ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నదని అన్నారు. పేదలు, రాష్ట్రాలను శిక్షించేలా కేంద్రం విధానం ఉన్నదని అన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును 'వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్గర్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్)' (వీబీ-జీరామ్ జీ)గా మార్చే బిల్లును ఎమ్మెల్యే రోహిత్ రావు తప్పుబట్టారు. గ్రామీణ పేదలకు జీవనోపాధి భద్రత కల్పించడం, వలసలను తగ్గించడం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిని సాధించడంలాంటి గొప్ప లక్ష్యాలతో నాటి యూపీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ చారిత్రక పథకాన్ని నిర్వీర్యం చేయాలనే దురుద్దేశంతోనే కేంద్రం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నదని మండిపడ్డారు. గతంలో వందశాతం నిధులు వెచ్చిస్తూ పథకాన్ని అమలు చేసిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు తన వాటాను 60 శాతానికి తగ్గించి, మిగిలిన 40శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం అన్యాయమన్నారు. ఇది రాష్ట్రాల ఆర్థిక స్థితిపై తీవ్రప్రభావం చూపే నిర్ణయమని, కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నమేనని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూర్తి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలకు చెందిన 30 కోట్ల మందికిపైగా పేదలకు ఉపాధి కల్పిస్తున్న చట్టాన్ని నీరుగార్చటం తగదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ అతి జోక్యంతో ఇప్పటికే నిధుల లేమితో అల్లాడుతున్న చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాన్ని అమలు చేయకుండా ఎత్తేసే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, సీనియర్ నాయకులు సుప్రభాత్ రావు, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పబ్బతి ప్రభాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హాఫిజ్, రమేష్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పరుశరామ్ నియోజకవర్గ అధ్యక్షులు భరత్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ చౌదరి, ముత్యం గౌడ్, తొడుపునూరి శివరామ కృష్ణ, లక్ష్మీనారాయణ గౌడ్, లింగం, సరాఫ్ యాదగిరి, ప్రభాకర్, నాగరాజు హరిత, అశ్విని, గోదల జ్యోతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మందుగుల గంగాధర్, శంకర్,బెండె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేసే డాక్టర్లు సిబ్బంది స్థానికంగా ఉంటూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి తుకారం రాథోడ్ ఆదేశించారు. ప్రభుత్వ దవఖానాల్లో అందుబాటులో లేని వైద్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందనీ ఆయన హెచ్చరించారు. గురువారం జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అశ్వాపురం మండలంలోని గుడిపాడు, మణుగూరు లోని ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. వైద్యులకు సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. అందరు తమ తమ ఉపకేంద్రాలకు దగ్గర్లో ఉండి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. లేకుంటే శాఖ పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా కుష్టు వ్యాధుల నివారణ కోసం ప్రోగ్రాం జరుగుతుందని నిబంధనల ప్రకారం ఇంటింటికి వెళ్లి సర్వేలు నిర్వహించాలన్నారు. కుష్ఠు వ్యాధిగ్రాస్తుల "గుర్తింపు ఉద్యమం' నేపథ్యంలో ఆశ కార్యకర్తలు చేస్తున్న సర్వే ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలందు జరిగిన శ్రమదాన కార్యక్రమంలో సిబ్బందితో పాల్గొన్నారు. పరిసరాలను శుభ్రం చేశారు. ఈ శ్రమదాన కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది హుషారుగా పాల్గొన్నారు. మన కేంద్రాన్ని మనమే శుభ్రం చేసుకోవాలని స్ఫూర్తి అందరిలో రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీహో డాక్టర్ పుల్లారెడ్డి, డాక్టర్ నిశంత్, డాక్టర్ సంకీర్తన, డిపి ఎంఓ మోహన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణ పక్షోత్సవాల తనిఖీ

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: సింగరేణి సంస్థలో జరుగుతున్న 56వ రక్షణ పక్షోత్సవాలలో భాగంగా, మందమర్రి ఏరియా వర్క్‌షాప్‌ను తనిఖీ బృందం సందర్శించింది. ఈ బృందంలో సేఫ్టీ కమిటీ కన్వీనర్ ఎన్. దామోదర్ రావు, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సింగరేణిలో పనిచేసే ప్రతి ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలని రక్షణ కమిటీ కన్వీనర్ ఎన్. దామోదర్ రావు పిలుపునిచ్చారు. అధికారులు సూచించిన సేఫ్టీ ఆపరేషన్ ప్రొసీజర్స్ తప్పనిసరిగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆయన స్పష్టం చేశారు. ?ఏరియా జి.ఎం. ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రక్షణ పరికరాలను వాడాలని, "రక్షణతో కూడిన ఉత్పత్తి" సాధించడమే సంస్థ లక్ష్యమని అన్నారు. ?ప్రతి ఉద్యోగి మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యంగా ఉండాలని, వర్క్‌షాప్‌లో పనిచేసే వారు ఒక సైనికుడిలా అప్రమత్తంగా వ్యవహరించాలని జి.ఎం. సూచించారు. కొత్తగా చేరిన ఉద్యోగులు సీనియర్ల సలహాలు తీసుకుంటూ ముందుకు సాగాలని కోరారు. ?పని స్థలంలో అనుకోకుండా ప్రమాదం జరిగినప్పుడు అందించాల్సిన అత్యవసర చికిత్స గురించి ఫస్ట్ ఎయిడ్ మెంబెర్స్ ఉద్యోగులకు వివరించారు. కమ్యూనికేషన్ సెల్ మందమర్రి ఏరియా వారు రక్షణ జాగ్రత్తలపై ప్రదర్శించిన లఘు నాటిక అందరినీ ఆకర్షించింది రక్షణ సూత్రాలపై అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం జి.ఎల్ ప్రసాద్, ఏఐటీయూసీ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, రీజినల్ సేఫ్టీ జి.ఎం రఘు కుమార్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ భూ శంకరయ్య, సేఫ్టీ కమిటీ సభ్యులు కె. వెల్దారి, ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి జా, డీజీఎం దూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చట్ట నియమాలకు లోబడి స్కానింగ్ పరీక్షలు నిర్వహించాలి: రవి రాథోడ్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో-మహబూబాబాద్ : స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు చట్టం నియమాలకు లోబడి పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ లింగ నిరాధరణ, బాలికల పట్ల వివక్షత, ఎంటీపీ చట్టం గురించి ఇతర ప్రభుత్వ విభాగాలు మరియు స్వచ్చంధ సంస్థలతో కలసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు గర్భిణీ స్త్రీలు పరీక్షల నిమిత్తం, లింగ నిర్ధారణ కోసం, అబార్షన్ కోసం అర్హత లేని వైద్యుల వద్దకు వెళ్లి తమ ప్రాణాలకు ప్రమాదం కొని తెచ్చుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఎంటిపి చట్ట ప్రకారం ప్రత్యేక పరిస్థితులలో అర్హులైన వారికి అబార్షన్ కి గుర్తింపు పొందిన ఆసుపత్రులలో అవకాశం కల్పించిందన్నారు. అనంతరం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ గైనకాలజిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ శశి జ్యోత్స్న,అడ్వైసరీ కమిటీ సభ్యులు డాక్టర్ జగదీశ్వర్, రాజేంద్రప్రసాద్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి మాట్లాడుతూ జిల్లాలో గుర్తింపు లేని, అర్హత లేని వ్యక్తులు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, ఎం టి పీ కిట్స్ ద్వారా అబార్షన్ కు ప్రయత్నించడం వంటి విషయాలపైన ఆవేదన వ్యక్తం చేస్తూ అటువంటి వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో బాలికల నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాల లో ప్రత్యేక శ్రద్ధ వహించి క్షేత్ర స్థాయి సిబ్బందితో తరుచుగా సమీక్షా సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చట్టం ఉల్లంఘిస్తున్న వారి వివరాలు 104,1098 లేదా డయల్ 100 కి తెలియచేయాలన్నారు. ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ప్రతి నెల 5 తేదీ లోపల ఫామ్ ఎఫ్ ప్రతులను జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యలయంలో సమర్పించాలని తెలిపారు. జిల్లాలో రిజిస్టర్ కానీ సెంటర్లను గుర్తించి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ శశి జ్యోత్స్న, డాక్టర్ సారంగం డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్. సుధీర్ రెడ్డి, డాక్టర్ నాగేశ్వరరావు, సి డబల్యూ సి చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి, డిపిఆర్ఓ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్లు శ్రవణ్, ప్రత్యూష జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కె. ప్రసాద్, సి డి పి ఓ శిరీష యన్ జి ఓ వసుంధర, రాజు, లోక్య, మనోహర్ పాల్గొన్నారు.

సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు సన్మానం

విశాలాంధ్ర-గూడూరు : మండల కేంద్రం లోని కాంగ్రెస్ మండల కార్యకర్తల ముఖ్య సమావేశంలో ఇటీవల స్థానిక ఎన్నికలలో గెలుపొందిన సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు,ఉప సర్పంచ్ చంటి స్వామిలకు కాంగ్రెస్ జిల్లా నాయకులు మాధవ పెద్ది రమేష్ చందర్ రెడ్డి వారికి శాలువాతో సత్కరించారు. ఓటమిపాలైన అభ్యర్థులకు ధైర్యం నింపి అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రమేష్ చందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు ప్రజలు పెద్దపీట వేశారని ప్రజలు ప్రభుత్వంతోనే ఉండి మండలంలోని ఎక్కువ శాతం అభ్యర్థులను గెలిపించారని మాట్లాడారు ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి జిల్లా కార్యదర్శి వాంకుడోత్ కొమ్మాలు, నెక్కొండ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్ రెడ్డి, జిల్లా నాయకులు కోమండ్ల రమణారెడ్డి, జిల్లా మైనార్టీ కార్యదర్శి ఎండి రసూల్, బ్లాక్ అధికార ప్రతినిధి శివరాత్రి సంపత్, మండల నాయకులు బోయినపల్లి సతీష్, ఓర్సు రాజేందర్, జలంధర్ రెడ్డి, కట్ల నరేందర్ రెడ్డి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏసీబీ వలలో ఆర్ఐ

విశాలాంధ్ర-కారేపల్లి: మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్(ఆర్ఐ. 2)దౌలూరి శుభకామేశ్వరిదేవి గురువారం ఏసీబీ వలలో చిక్కారు. ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కారేపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర ఆర్ఐ శుభ కామేశ్వరిదేవి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ నివేదికను రాసేందుకు పదివేల రూపాయలు డిమాండ్ చేసింది. దీంతో బాధితుడి వద్దనుండి నగదు రూపంలో లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండ్‌గా దొరికిపోయింది. బాధితుని ఫిర్యాదుతో కారేపల్లిలోని ఆమె ఇంటి వద్ద ఎసిబి సిబ్బందితో వలవేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిఎస్పి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఏదైనా పని చేసేందుకు లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064 నెంబర్కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఫిర్యాదుదారుని వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

యువకుడిపై ఫోక్సో కేసు నమోదు

విశాలాంధ్ర- పినపాక: మండలంలో ఓక పాఠశాలలో చదువుతున్న 15 ఏళ్ల బాలికకు ఓ యువకుడు మాయ మాటలు చెప్పి లొంగదిసుకున్నాడు. బాలిక అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని గర్భవతి చేసిన ఉదంతం బయటపడింది. దింతో యువకుడిపై గురువారం పోలీసులు ఫోక్సోకేసు నమోదు చేశారు. ఈ - బయ్యారం ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... పినపాక మండలంలో ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మైనర్ బాలికను ఇదే మండలానికి చెందిన వ్యక్తి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ బాలిక ప్రస్తుతం గర్భవతి అయిందన్నారు. ఈ విషయం ఆలస్యంగా బాలిక తల్లికి తెలియడంతో స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిందన్నారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఫోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సమర్థంగా ఎన్నికల విధులు: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: జిల్లా పరిధిలో మూడు విడతల్లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లా పరిధిలో 566 గ్రామ పంచాయతీలకు 566 సర్పంచ్, 566 ఉప సర్పంచ్, 5168 వార్డు సభ్యులకు సంబంధించి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల విధులలో పాల్గొన్న ప్రతి ఒక్కరు పూర్తి స్థాయిలో చిత్తశుద్ధితో సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించారని, ఎక్కడ ఎటువంటి పొరపాట్లు రాకుండా కట్టుదిట్టంగా ఎన్నికలను నిర్వహించిన అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కలెక్టర్‌కు బిట్స్ పిలాని ప్రతిష్టాత్మక పురస్కారం

ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నీ అత్యంత ప్రతిష్టాత్మకమైన ఉన్నత విద్యాసంస్థ బిట్స్ పిలాని ప్రతిష్టాత్మకమైన యంగ్ ఎల్యుముని అచీవర్స్ అవార్డుకు ఎంపిక చేసింది. 2007 సివిల్స్ బ్యాచ్కు చెందిన అనుదీప్ వెరిసెట్టి ఆ పరీక్షల్లో ఆల్ ఇండియా నంబర్ వన్ ర్యాంకు సాధించారు. అదేవిధంగా గొప్ప ర్యాంకు సాధించిన గొప్ప ఆశయం కలిగిన అనుదీప్ దురిశెట్టి జిల్లా కలెక్టర్గా కూడా ఆయన పరిపాలన విధానాలు సామాజిక సేవా దృక్పథంతో ఉంటాయి. వీటన్నిటిని పరిగణలోకి తీసుకున్న బిట్స్ పిలాని సమస్త ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక చేయడం విశేషమని చెప్పవచ్చు. గొప్ప పురస్కారానికి ఎంపిక కావడం పట్ల జిల్లాకు చెందిన మంత్రులు ,ఉన్నత అధికారులు ప్రజా ప్రతినిధులు అనేకమంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల అధికారికి కృతజ్ఞతలు

విశాలాంధ్ర-కొమరం భీం: 2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు-2025 జిల్లాలో ప్రశాంతంగా జరగడంలో బాధ్యత వహించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్రీనివాస్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా లను జిల్లా అదనపు ఎన్నికల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, కార్యాలయ సిబ్బంది శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3 విడతలుగా జరిగిన గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర-నల్గొండబ్యూరో: నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.గురువారం పెద్ద ఊర మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. 17 శాతం తేమతో, తాలు%-%తరుగులు లేకుండా నాణ్యత ప్రమాణాలతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, ఆలస్యం చేయవద్దని సూచించారు. మంచు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం పై పట్టాలు కప్పి ఉంచాలని, తేమ శాతాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఇప్పటివరకు 107 లారీల ద్వారా 23,400 క్వింటాళ్ల సన్న ధాన్యం కొనుగోలు చేసినట్లు కేంద్ర నిర్వహకులు కలెక్టర్‌కు వివరించారు. మంచు కారణంగా తేమ వచ్చే వరకు ధాన్యాన్ని ఆరబోసి అనంతరం కొనుగోలు పూర్తి చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్, పిఎసిఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, తహసిల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో ఉషాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

నితీశ్ వికృత చేష్ట

నారీ శక్తిని కేవలం అందమైన నినాదంగా మార్చేసినట్టున్నారు. బీజేపీకి తోకగా మారిన బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సోమవారం ఒక ముస్లిం మహిళా డాక్టర్ ముఖం మీద కప్పుకున్న వస్త్రాన్ని (హిజాబ్) తొలగించడం సంస్కృతి విహీనతకు నిదర్శనం. ఆయన ఆరోగ్య, ముఖ్యంగా మానసిక స్థితి మీద అనుమానాలు వ్యక్తం చేస్తూ గత కొద్ది నెలలుగా వార్తలు వస్తూనే ఉన్నాయి. మహిళా డాక్టర్ హిజాబ్ తొలగించి ఆమె ముఖ్యం చూడడం చూస్తే నితీశ్ కుమార్ మానసిక సమతుల్యత కోల్పోయారని ఖాయంగా చెప్పొచ్చు. సోమవారం ఆయన ఆయుష్ డాక్టర్లకు నియామక పత్రాలు అందజేసినప్పుడు నితీశ్ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాలలో విస్తారంగా ప్రచారంలోకి వచ్చింది. ఆమె ముఖం మీది ముసుగు తొలగించాలని నితీశ్ కోరారు. ఆమె విచలితురాలై ఉండగానే ఆమె ముఖం మీద ఉన్న ఆచ్ఛాదన తొలగించేశారు. ఆ మహిళా డాక్టర్ వెనక ఉన్నవారు నితీశ్ వికృత చేష్ట చూసి నవ్వడం మొదలెట్టారు. ఇది మన నీచమైన హాస్య ధోరణికి ప్రతీక అనుకోవాలి. ఉప ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరి బీజేపీ వాడే అయినా నితీశ్‌ను ఆపడానికి ప్రయత్నించారు. ఉప ముఖ్యమంత్రిలో అంతోఇంతో సంస్కారం మిగిలి ఉన్నట్టుంది. విచిత్రం ఏమిటంటే కేంద్ర మంత్రి గిరిరాజ్ కిశోర్ నిస్సిగ్గుగా నితీశ్ కుమార్ అసహ్యకరమైన చేష్టలను సమర్థిస్తున్నారు. అది బీజేపీ సంస్కార హీనతకు నిదర్శనం అనుకోవాలి. గిరిరాజ్ కిశోర్ బుధవారం చేసిన వ్యాఖ్యలను గురువారం కూడా సమర్థించుకున్నారు. నియామకపత్రం తీసుకునే వారు తమ ముఖం చూపించాలి కదా అంటున్నారు. మొహం చూపించకపోవడానికి ఇదేమన్నా ఇస్లామిక్ రాజ్యమా అని ప్రశ్నిస్తున్నారు. నితీశ్ సంరక్షకుడిలా వ్యవహరించారు అని కూడా చెప్పారు. పాస్‌పోర్ట్ తీసుకోవడానికో, విమానాశ్రయంలోనో మొహం చూపించరా అని గిరిరాజ్ కిశోర్ రెట్టించి ప్రశ్నిస్తున్నారు. మీరు పాకిస్థాన్ లేదా ఇంగ్లీషిస్థాన్‌లోలా మాట్లాడుతున్నారు అని దెప్పి పొడిచారు. ఇక్కడ భారత చట్టాలు మాత్రమే పని చేస్తాయని, నితీశ్ ఏ తప్పూ చేయలేదని గిరిరాజ్ దబాయిస్తున్నారు. "ఆ అమ్మాయి ముఖం మీది వస్త్రాన్ని తొలగించడానికి నిరాకరిస్తేనో" అని పత్రికా విలేకరులు అడిగితే "ఆమె నిరాకరించవచ్చు లేకపోతే నరకానికి వెళ్లొచ్చు. నాకేంటి?" అన్నారు. గిరిరాజ్ నోటిని ఎవరైనా ఫినాయిల్‌లో, లైజాయిల్‌లో వేసి కడిగితే బాగుండేది. ముస్లిం తల్లుల, ముఖాచ్ఛాదను తొలగించడానికి నితీశ్‌కు ఎంత ధైర్యం? అని అనేక విమర్శలు వెల్లువెత్తాయి. కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మహబూబా ముఫ్తీ కూతురు ఇల్తిజా ముఫ్తీ అయితే మేం ఇలాంటి వారికి శాశ్వతంగా బుద్ధి చెప్తాం అని గర్జించారు. వివిధ రాజకీయ పార్టీలు కూడా నితీశ్ మీద విరుచుకుపడ్తున్నాయి. నితీశ్ పార్టీ అయిన జనతాదళ్ (యూ) నాయకులు ఆయనను సమర్థించలేక సతమతం అవుతున్నాయి. నితీశ్ కుమార్ ఇటీవలే పదోసారి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయనకు 74 ఏళ్లు వచ్చాయి. మతి స్థిమితం మాత్రం కోల్పోయినట్టున్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా కనీసం క్షమాపణ చెప్పాలన్న ఆలోచనైనా ఆయనకు వచ్చినట్టు లేదు. నితీశ్ ముస్లిం బిడ్డపై అపేక్ష ప్రదర్శించారు అని జనతాదళ్ (యు) నాయకుడు, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి జమాఖాన్ కష్టపడి సమర్థిస్తున్నారు. నితీశ్ అమ్మాయిలకు అత్యంత గౌరవం ఇస్తారని వెనకేస్తున్నారు. జనతా దళ్ (యు)తో పొత్తు పెట్టుకున్న నిషాద్ పార్టీ నాయకుడు సంజయ్ నిషాద్ మరింత దిగజారి "నితీశ్ ఆ అమ్మాయిని మరేదైనా చోట ముట్టుకుని ఉంటే" అని దీర్ఘాలు తీస్తున్నారు. "అరే ఆయన మగవాడేగా, ఆయన్ని వేటాడకూడదు. హిజాబ్ తొలగిస్తేనే ఇంత రభస చేస్తున్నారు, మరో చోట ముట్టుకుంటే మరెంత గొడవ చేసేవారో అని ఆశ్చర్యపోతున్నారు.

ఇక్కడ ముస్లిం మహిళ విషయంలో అసభ్యంగా ప్రవర్తించడం ప్రశ్న కాదు. ముస్లిం మహిళలు బురఖా వేసుకోవడం, హిజాబ్ ధరించడం తప్పా ఒప్పా అన్నది సమస్య కాదు. ముస్లింలు బురఖా వేసుకోవడం, హిజాబ్ ధరించడం నచ్చని ముస్లింలూ ఉన్నారు. షా మహమ్మద్ రెజా పెహ్లావీ ఇరాన్ రాజుగా ఉన్నప్పుడు, సద్దాం హుసెన్ ఇరాక్ పాలకుడిగా ఉన్నప్పుడు ఆ దేశాల్లో ముస్లిం అమ్మాయిలు ఆధునిక వస్త్రాలు ధరిస్తే అభ్యంతర పెట్టే వారు కాదు. బురఖా, హిజాబ్ ధరించక తప్పదని నిబంధన విధించే దేశాలు ఇప్పటికీ ఉండొచ్చు. అవి ధరించకూడదనడం ఇస్లాం వ్యవహారంలో తల దూర్చడమేనని వాదించే వారూ ఉండొచ్చు. ఎవరికి అనువైన, నచ్చిన దుస్తులు వారు వేసుకోవచ్చు. నితీశ్ కచ్చితంగా ఆ ముస్లిం డాక్టర్ పట్ల ప్రవర్తించిన తీరు సభ్య సమాజం మెచ్చే పనైతే కాదు. ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులు ఇలాంటి వికృత చేష్టలు చేయడం వారి సంస్కారరాహిత్యానికే కాదు, వారి మనోవైకల్యానికి నిదర్శనం. ఎంత ఉదారంగా ఆలోచించే వారైనా నితీశ్ చేష్టను సమర్థించలేరు. ప్రతిపక్ష పార్టీలు నితీశ్ ఆ మహిళకు క్షమాపణ చెప్పాలంటూ ఉంటే జనతా దళ్ (యు), బీజేపీ నాయకులు నితీశ్ దుశ్చేష్టను చిన్న విషయంగా కొట్టి పారేయడానికి తంటాలు పడ్తూ ఉన్నారు. మహిళాభివృద్ధికి నితీశ్ చేసిన పనులను గుర్తు చేస్తున్నారు. ఇది ప్రజా సంక్షేమం ప్రభుత్వ బాధ్యత అన్న అంశాన్ని మరుగు పరచడమే. జాతీయనేరాల జాబితాలో ఎటూ బీహార్ ది అగ్ర స్థానమే. హిజాబ్ తొలగించడంలో నితీశ్‌కు ఏ దురుద్దేశమూ లేకపోవచ్చు. కాని సభ్యత లేకపోవడాన్ని సమర్థించడం కుదరదు. అది ఆయన వ్యక్తిగత బలహీనత అని కూడా చెప్పలేం. ఇలాంటి దుశ్చేష్ట ఆయన మానసిక వైకల్యానికి కచ్చితంగా నికార్సైన ఉదాహరణ. ఎంత పెద్ద నాయకులకైనా బలహీనతలు ఉండొచ్చు. కానీ అవి బహిరంగా జరిగితే సభ్య సమాజం అంగీకరించలేదు. నితీశ్ దుశ్చేష్ట మహిళలలో భయం కల్పిస్తుంది. సమానత్వం, మత స్వేచ్ఛ లాంటి అంశాలను ప్రశ్నార్థకం చేస్తుంది. చిన్న చిన్న ఉద్యోగాల నియామకం జరిగేటప్పుడు కూడా అభ్యర్థుల శారీరక, మానసిక స్వస్థతను పరీక్షిస్తారు. ముఖ్యమంత్రికి కూడా ఈ సూత్రం వర్తించాలిగా! ఉద్యోగాలు చేసుకునే మహిళలకు అసలే భద్రత కరవు. గత రెండేళ్ల కాలంలో నితీశ్ బహిరంగా మోదీ కాళ్లు మొక్కి తనను తానే కుర్చబరచుకున్నారు. అమిత్ షాతో పాటు ఫొటో దిగుతున్న సందర్భంలో ఓ మహిళ బుజం మీద చేయి వేశారు. కేపీఎస్ గిల్ లాంటి ప్రసిద్ధ పోలీసు అధికారి సైతం ఒకప్పుడు ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడి అపఖ్యాతి పాలయ్యారు. నితీశ్ మానసిక స్థితి సవ్యంగా ఉందని తేలాలంటే ఆయన బేషరతుగా, బహిరంగంగా ఆ మహిళా డాక్టర్‌కు క్షమాపణ చెప్పాల్సిందే.

'ఇండియా' ఇల్లు చక్కదిద్దుకోవాలి

నిత్యా చక్రవర్తి

గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, ఆయన ఎన్డీయేను పెద్ద కుదుపు కుదిపిన ఇండియా ఐక్య సంఘటనకి ఇప్పుడు ఏమవుతోంది? నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ ఎన్నికలలో బీజేపీ తొలిసారిగా సొంతంగా మెజారిటీ సాధించలేకపోయింది. ఎన్డీయేలోని ఇతర భాగస్వాములు, ముఖ్యంగా జేడీయూ, తెలుగుదేశం పార్టీ మద్దతుతో మైనారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసి వచ్చింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత కాలంలో ఇండియా ఐక్య సంఘటన ఊపు మీద కనిపించింది. మోదీ పాలనలో బీజేపీ పతనం ప్రారంభమైందనే అభిప్రాయం ఏర్పడింది. 2024 జూన్‌లో లోక్‌సభ ఫలితాలు వెలువడి ఏడాదిన్నర దాటిన తర్వాత, దేశంలో రాజకీయ దృశ్యం ఇప్పుడు పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. ఈ మధ్య కాలంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే మహారాష్ట్ర, హర్యానా, దిల్లీ శాసనసభ ఎన్నికలలో గెలుపొందింది. తాజాగా ఈ ఏడాది నవంబర్ 14న వెలువడిన ఫలితాలలో బీహార్‌లో ఎన్డీయే కూటమి ఊహించని రీతిలో విజయం సాధించింది. ఇది ఇండియా ఐక్య సంఘటన పతనం, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు గొప్ప పురోగమనం అని చెప్పవచ్చు. గత పద్దెనిమిది నెలల్లో జరిగిన శాసనసభ ఎన్నికలలో వరుస విజయాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాతో పాటు, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్‌కు అత్యధిక ఘనత ఇవ్వబడింది. ప్రధానమంత్రితో విభేదాలు కొనసాగుతున్నప్పటికీ, 2024 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో భగవత్ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను మరింత వ్యవస్థీకృత పద్ధతిలో సమీకరించారు.

ప్రస్తుతం పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరుగుతున్నాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)ను హడావుడిగా అమలు చేయాలనే ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు సవాలు చేయడంతో ఉభయ సభలు గందరగోళంలో ఉన్నాయి. తదుపరి విడతలో అస్సోం, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి నాలుగు రాష్ట్రాలకు 2026 ఏప్రిల్/మే నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ రాష్ట్రాలలో అస్సోంలో ఎస్ఐఆర్ అమలు చేపట్టడం లేదు. అస్సోంను సవరణ ప్రక్రియ నుంచి మినహాయించగా, ఇతర రాష్ట్రాలలో ఎస్ఐఆర్ ప్రక్రియ జరుగుతోంది. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ఇండియా సంకీర్ణ కూటమి బలమైన వాణి వినిపించడం సరైనదే. కానీ, అది 2026 రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు రాష్ట్ర సంస్థాగత నిర్మాణాన్ని సిద్ధం చేసే ప్రయత్నాలను సడలించేలా చేయకూడదు. 2026 ఎన్నికల్లో 2016 నుంచి బీజేపీ నేతృత్వంలోని కూటమి అధికారంలో ఉన్న అస్సోంపై ఇండియా కూటమి తమ ప్రాధాన్యతగా కేంద్రీకరించాలి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నేతృత్వంలోని ఎన్డీయే 2026 ఎన్నికలలో మరొక విజయాన్ని సాధించేందుకు దోషరహితగా సన్నద్ధమవుతోంది. అస్సోం శాసనసభలో 126 సీట్లు ఉండగా, 2021 శాసనసభ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికల గణాంకాలను నిశితంగా పరిశీలిస్తే కాంగ్రెస్, బీజేపీ మధ్య ఓట్ల

వ్యత్యాసం ఒక శాతం నుంచి మూడు శాతం వరకు ఉందని స్పష్టమవుతోంది. వివిధ పొందికలను సమకూర్చుకోవడం ద్వారా స్వల్ప తేడాతో గెలుపు తారుమారయ్యే స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం కాంగ్రెస్, దాని మిత్రపక్షాల ఓటమికి దారితీసింది.

2021 శాసనసభ ఎన్నికల్లో అస్సోంలో బీజేపీకి 33.6 శాతం ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 30 శాతం ఓట్లు వచ్చాయి. కానీ, సీట్ల పరంగా చూస్తే బీజేపీకి 60, కాంగ్రెస్‌కు 29 సీట్లు మాత్రమే లభించాయి. విడిగా పోటీ చేసిన ఏఐయూడీఎఫ్ 9.4 శాతం ఓట్లతో 16 స్థానాలు దక్కించుకుంది. కాబట్టి కాంగ్రెస్ ప్రధానంగా బెంగాలీ మాట్లాడే ముస్లింల పార్టీ అయిన ఏఐయూడీఎఫ్‌తో అవగాహన కలిగి ఉంటే, కాంగ్రెస్ ఎన్డీయేను సులభంగా ఓడించి ఉండేవి. ఇక 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 37.9 శాతం ఓట్లు దక్కాయి. కాంగ్రెస్‌కు అంతే మొత్తంలో 37.9 శాతం ఓట్లు వచ్చాయి. కానీ, బీజేపీకి 9 సీట్లు రాగా, కాంగ్రెస్‌కు 3 సీట్లు మాత్రమే దక్కాయి. ఓట్ల శాతం ఒక్కటే ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు బీజేపీ సీట్లలో మూడింట ఒక వంతు వచ్చాయి. అస్సోంలో ఇండియా ఐక్య సంఘటనలో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీ. ఆ పార్టీ చాలాకాలంగా అధికార పార్టీగా వ్యవహరించింది. చివరి కాంగ్రెస్ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ ప్రజాదరణ పొందిన సీఎం. అధికారాన్ని నిలుపుకోవడంలో ఉన్న చిక్కులు ఆయనకు తెలుసు. మోదీ పాలనలో కాంగ్రెస్ పతనం చోటు చేసుకుంది. కానీ, అస్సామీ హిందువులు, ముస్లింలలో కాంగ్రెస్ ఇప్పటికీ దాని సంప్రదాయ పునాది కలిగి ఉంది. ఈసారి, ఇండియా కూటమి కింద బీజేపీ వ్యతిరేక శక్తులను సమీకరించడానికి కాంగ్రెస్ అన్ని ప్రయత్నాలు చేయాలి. అది సాధ్యం కాకపోతే, రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఫ్రంట్ ఎన్డీయే ఓటమిని ఖాయం చేసేందుకు స్వల్ప తేడాతో గెలుపోటములు నిర్ధారణ జరిగే సీట్లలో ఎన్నికల అవగాహన కలిగి ఉండాలి. శాసనసభలోని 126సీట్లలో, స్వల్ప ఓట్లతో గెలుపు తారుమారయ్యే దాదాపు 30 స్థానాలు ఉన్నాయి. ఈ స్థానాలలో చాలా వరకు ఏఐయూడీఎఫ్ ఉనికిని కలిగిఉంది. 2021 శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం నుంచి అస్సోం రాష్ట్ర కాంగ్రెస్‌కు తగిన మద్దతు లభించలేదు. నిధుల కొరత కూడా ఉంది. బలమైన ప్రయత్నాలతో 2026 ఎన్నికల్లో అస్సోంలో ఎన్డీయే ప్రభుత్వాన్ని గద్దె దించవచ్చు. అస్సోం శాసనసభ ఎన్నికలను కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించాలి. కానీ, దానికి కాంగ్రెస్ ద్వారా తీవ్రమైన ప్రచారం, కాంగ్రెస్ నేతృత్వంలోని ఆరు పార్టీల ప్రతిపక్ష ఫ్రంట్ పూర్తి సమీకరణ, బీజేపీ వ్యతిరేక ఓట్ల విభజనను నిరోధించడంలో సహాయపడే ప్రభావవంతమైన ఎన్నికల వ్యూహాన్ని అమలు చేయడం అవసరం. 2026 శాసనసభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలనే లక్ష్యం గురించి కాంగ్రెస్ కూటమి తీవ్రంగా ఆలోచిస్తే, విజయం సాధించాలంటే ఏఐయూడీఎఫ్‌తో వ్యూహాత్మక పరిమిత అవగాహన అత్యంత అవసరం.

ఈ ఏడాది డిసెంబర్ చివరిలో జరగనున్న ముంబై కార్పొరేషన్ ఎన్నికలపై ఇండియా ఐక్య సంఘటన కొంత దృష్టి పెట్టాలి. గత శాసనసభ ఎన్నికల వినాశకరమైన ఫలితాల తర్వాత, ఇండియా ఐక్య సంఘటన భాగస్వాముల మధ్య విభేదాలు పెరిగాయి. ప్రస్తుతం, కార్పొరేషన్ ఎన్నికల కోసం ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించడంలో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ, కాంగ్రెస్ వేటికి అవే వేర్వేరుదారుల్లో ఉన్నాయి. ఈ ఎన్నికల ఫలితం మహారాష్ట్రలో రాబోయే రాజకీయాలకు వ్యూహాత్మకంగా ముఖ్యమైనది. ఆ తదుపరి కొద్ది నెలల్లో జరిగే ఇతర ఎన్నికలపై ఫలితాలు ప్రభావం చూపుతాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ఎన్నికల్లో గెలవగలిగితే, అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఇది రాష్ట్ర బీజేపీకి మరో ఘనత అవుతుంది. మహారాష్ట్ర రాజకీయాలపై వారి ఆధిపత్యం పెరుగుతుంది, ఇండియా ఐక్య సంఘటన భాగస్వాములను అణగదొక్కుతుంది. అస్సోం, మహారాష్ట్ర రెండింటిలోనూ పరిస్థితి గురించి ఇండియా ఐక్య సంఘటన నాయకులు కేంద్ర స్థాయిలో మాట్లాడి, ఆయా రాష్ట్రాల పరిస్థితిని ఎదుర్కోవడానికి కొన్ని నిర్దిష్ట ప్రతిపాదనలతో ముందుకు రావడానికి ఇదే సరైన సమయం. ఇండియా ఐక్య సంఘటనకి అస్సోం, ముంబై కార్పొరేషన్ ఎన్నికలు చాలా ముఖ్యమైనవి. దీనిని జాతీయ స్థాయిలో మాత్రమే సర్దుబాటు చేసుకోవాలి.

కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు విషయానికొస్తే, పరిస్థితి ఇప్పటికే నిర్ధారణ అయింది. అక్కడ ఇండియా ఐక్య సంఘటన జోక్యం చేసుకునే అవకాశం చాలాతక్కువ. కేరళ ఎన్నికలు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్, సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్‌కే పరిమితం. బీజేపీది స్వల్పపాత్ర మాత్రమే. రెండు కూటములలో ఎవరు గెలిచినా ఇండియా ఐక్య సంఘటనకి చెందినవారే రాష్ట్రంలో పాలకులు అవుతారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీకి తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థి. బీజేపీని ఎదుర్కోవడానికి మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ సిద్ధంగా ఉంది. నిజానికి 2026 ఎన్నికల్లో బీజేపీ తన ప్రస్తుతసీట్లను కోల్పోవచ్చు. తమిళనాడులో కూడా డీఎంకే ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ నేతృత్వంలోని ఇండియా ఐక్య సంఘటన భాగస్వామ్యపక్షాలు బాగా స్థిరపడ్డాయి. ఈ కూటమి సంపూర్ణంగా పని చేస్తోంది. 2026 ఎన్నికలకు సిద్ధంగా ఉంది. ఈ మూడు రాష్ట్రాలలో ఇండియా ఐక్య సంఘటన కేంద్రంగా పెద్దగా చేయాల్సిందేమీ లేదు. కానీ అస్సోం, ముంబై కార్పొరేషన్ విషయంలో చేయాల్సింది చాలా ఉంది.

వృద్ధాశ్రమాలు అవసరం

రావయ్యా బావ ఏంటి విచార వదనంతో అడుగులో అడుగేసు కుంటూ వస్తున్నావు. ఏం చేయమంటావు. నువు నమ్మకపోయినా దేవునిపై నాకు నమ్మకం ఉంది. నిజంగా దేవుడుంటే నన్ను వెంటనే తీసుకెళ్లాలి. నేను ఈ దుర్భరజీవితం అనుభవించలేను. ఏమయిందయ్యా అంతగా బాధపడుతున్నావు. నీకేంటి నువు కోరిన విధంగా నీ కొడుకు కోడలు చూస్తున్నారు. అందుకే బాధ అంటే ఏమిటో తెలియకుండా పోయి కాలం గడుపుతున్నావు. జ్వరంతో బాధపడుతుంటే కొడుకు గాని కోడలు గాని చివరకు పిల్లలు కూడా నా ముఖం చూడలేదు. పనిమనిషితో అన్నం పంపించారు. ఇంత నిర్లక్ష్యపు బతుకు అవసరమంటావా. నిజమేనయ్యా రాను రాను ప్రేమకు అర్థం మారిపోతోంది. ప్రేమంటే యవ్వనంలో ఒకరి అవసరం మరొకరికి ఉన్నప్పుడు ఉండే ప్రేమ తప్ప మాతృప్రేమ, పితృప్రేమ అంటే ఏమిటో ప్రస్తుతం ఈ కాలపు పిల్లలకు తెలియడం లేదు. డబ్బు మీద ఉన్న ప్రేమ కనిపెంచిన తల్లిదండ్రుల మీద కనబడటం లేదు. చేతినిండా డబ్బు ఉంటే ఇంకెవడితోను పని లేదన్నట్లుగా ఈ తరం పిల్లలు వ్యవహరిస్తున్నారు. ఈ స్థితిలో

వృద్ధాప్యం ఒక శాపంగా మారిందనుకో. అలా అని ఎందుకనుకోవాలి. పిల్లల పరిస్థితిని బట్టి మనమూ మారాలి. మారుతున్న కాలాన్ని బట్టి ఎవరైనా మారక తప్పదయ్యా.

పిల్లల పరిస్థితి గమనించి వృద్ధాప్యం దృష్టిలో ఉంచుకుని మనం మొత్తం ఉన్నదంతా పిల్లలకు ఇచ్చి చివరి దశలో బాధ పడకుండా మనకంటూ కొంత సొమ్ము ఉంచుకోవాలి. మళ్లీ మొదటకొచ్చావు. నాకు కావల్సింది భోజనమే కాదయ్యా కనీసం నాన్నా ఎలా ఉన్నావనే పలకరింపు. నిజమేకాని ఈ తరం పిల్లలకు ఆ పలకరింపు వల్ల మనం పొందే ఆనందం తెలియదయ్యా. అలాంటప్పుడు ఆశించి బాధపడే దానికన్న మనలాంటి వారితో కాలం గడిపి ఆనందపడవచ్చు. నా కర్థమయింది. నువు చెప్పేది వృద్ధాశ్రమాల గురించి. అది నిజమే కాని అందరికి అంత డబ్బు పెట్టి ఆశ్రమంలో ఉండే స్థోమత ఉండాలి కదా. అది నిజమే కాని ఎవరి స్థోమతను బట్టి వారుండే విధంగా నెలకు ఒక మనిషికి అయిదువేల నుంచి లక్ష వరకు వసూలు చేసే వృద్ధాశ్రమాలు ఉన్నాయి. ప్రేమ వారికి లేనపుడు మనం కడుపు తీపి చంపుకోలేక నిర్దయతో నిర్లక్ష్యపు బతుకు కంటే ముందే మేలుకొని ఉన్నదంతా అమితమైన ప్రేమతో పిల్లలకు దారాదత్తం చేసి బాధపడకుండా రోజుల్ని బట్టి ముందు జాగ్రత్తతో వ్యవహరించడం మంచిది.

అది సరేనయ్యా నువు చెప్పింది నిజమే కాని పిల్లలు వచ్చి అవసరం అని అడిగితే కడుపు తీపి కాదనలేదు కదా. అదే అక్కడ మన బలహీనత. అది కనిపెట్టి పిల్లలు ఉన్నదంతా లాగేసుకుని మనల్ని గాలి కొదిలేస్తున్నారు. అది సరేనయ్యా ప్రభుత్వం ఏటా ఎంత పెంచినా తప్పదన్నట్లు పన్నులు చెల్లిస్తున్నాం గదా. ఆస్తులు లేక పిల్లల నిరాదరణకు గురైన వృద్ధుల కోసం ఆలోచించవలసిన పరిస్థితిని మరుగున పెడితే ఎలా. ఎంతమటుకు అభివృద్ధికి డబ్బు లేదని పన్నులు పెంచడం తప్ప జీవితాంతం పన్నులు కట్టి చరమాంకంలో ఎవరికి పట్టని వృద్ధుల గురించి కూడా ఆలోచించాలి కదా. పన్నులు వసూలు చేయడంలో ఉన్న ఉత్సాహం విద్య, వైద్యంపై కనబడడం లేదు. మా వల్లకాదని పీపీపీకో లేక ప్రైవేటు సంస్థలకో హాస్పిటల్స్ అప్పచెప్పడం అన్యాయం కదా. పన్నులు వసూళ్లలో వాటాలలో ఉన్న శ్రద్ధ ఆ పన్నులు కట్టే వృద్ధులపై లేకపోవడం శోచనీయం. ఏ ప్రభుత్వం అయినా ముఖ్యంగా ప్రజలెన్నుకున్న ప్రజాప్రభుత్వాలు ఏమి కోరి ఎన్నుకున్నారనే సంగతి విస్మరించరాదు. పేదలకు అన్నా క్యాంటీన్లతో చేతులు దులుపుకోవడం సరికాదు. వారికి కావలసిన వైద్యంతో పాటు పిల్లల నిర్లక్ష్యానికి గురైన వారికి వృద్ధాశ్రమాలు చాలా అవసరం. కనీసం మండలానికొక వృద్ధాశ్రమం ప్రభుత్వం నిర్వహించవలసిన అవసరం నేడు అత్యవసరంగా కనపడుతోంది. రోజురోజుకు వృద్ధుల పట్ల నిర్లక్ష్యం పెరుగుతున్న సంగతి ప్రభుత్వం గమనించాలి. ఈనాటి వృద్ధులు ఒకనాడు సమాజంలో పేరుప్రతిష్టలు సంపాదించిన వారున్నారు. దేశానికి గర్వకారణంగా బతికిన వారున్నారు. దేశ ప్రగతికి బాటలు వేసిన వారున్నారు. దేశానికి గర్వకారణమైన వారు ఈనాడు పనికిరాని వస్తువుగా మారడం నేను జీర్ణించుకోలేకపోతున్నాను. అంతటి గొప్ప వ్యక్తులు పిల్లల నిరాదరణ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న వారున్నారు. ఇటువంటి నిర్లక్ష్యపు బతుకు వెళ్లదీస్తున్న వారి గురించి కనీసం ఒక ఆలోచన చేయని ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోంది. ఈ పరిస్థితిలో సీనియరు సిటిజన్లకు ఒక శాతం బస్సులో రాయితి, రైళ్లలో లోయరు బెర్తులు కేటాయించి చేతులు దులుపుకోవడం ప్రభుత్వాలకు తగదు. ఇప్పటికైనా వృద్ధుల ఈతి బాధలపై దృష్టిపెట్టి వృద్ధాశ్రమాలు ప్రభుత్వమే సముచిత రీతిలో నిర్మించి ఆదుకోవాలి.

సెల్: 9885569394

సమాజాన్ని ముంచేస్తున్న ధార్మిక మూర్ఖత్వం!



ప్రొఫెసర్ దేవరాజు మహారాజు

"ప్రజలెప్పుడైతే తమ హక్కుల కోసం గొంతెత్తుతారో, తమ అధికారం కోసం నిలదీస్తారో, అప్పుడే వారిని మత పిచ్చిలోకి తోసెయ్యాలి!"- నెపోలియన్.

ఎప్పుడెప్పుడు ధార్మికత రాజనీతితో జత కూడుతుందో, అప్పుడప్పుడు ద్వేషం గొప్ప మెజారిటీతో అధికారంలోకి వస్తుంది. దేశంలో అంధ భక్తులు ఎలా తయారయ్యారంటే- ఏదైనా మంచి విషయం జరిగినప్పుడు మీరు వారికి 'కంగ్రేచ్యులేషన్స్' చెప్పారనుకోండి. అది వారికి అర్థం కాదు, పైగా కోపం తెచ్చుకుని - 'బాజ్‌పాలేషన్స్' చెప్పాలంటారు. కాంగ్రేచు-అంటే ఆ పదం కాంగ్రెస్ పార్టీకి సంబంధించింది అని అనుకుంటారు. గత పదకొండేళ్లలో పేడ- అనేది ఒక ఆల్ రౌండర్ పదార్థం అయిపోయింది. పొలంలో వేస్తే ఎరువవుతుంది. పొయ్యిలో వేస్తే పొయ్యిని మండిస్తుంది. అదే గనక, మెదడులో వేసుకుంటేనా, ఇంకేముంది? ఎంచక్కా అంధభక్తులు కావొచ్చు! సనాతనాన్ని నిలబెట్టొచ్చు!! మరింకో వైపు ఈ దేశంలో ధర్మం-ఒక వ్యాపారమై పోయింది. ఆశ్చర్యపోవాల్సినవిషయం అదికాదు- చదువు కున్న వాళ్లంతా విదేశాలకు వలస పోతుంటే- ఇక్కడ మిగిలి పోయిన వారిలో కొందరు చెవిటివాళ్లూ, గుడ్డివాళ్లూ అయి పోతున్నారు. ఇంకా మిగిలిపోయిన ఏ కొందరు మాత్రమే బాధ్యతగా తమ మెదడ్లు ఉపయోగిస్తున్నారు. చాలా విచారించవల్సిన విషయం మరొకటుంది. ప్రపంచ దేశాలలో ఎక్కడాజరగనిది ఇక్కడే జరుగుతోంది. విచిత్రం!! మనిషికి పుట్టిన వాడు ఈ దేశంలో మనిషి కావడం లేదు. హిందూ, ముస్లిం, సిక్కు, ఇసాయీ అవుతున్నాడు. 'మనిషి' మాత్రం కాలేకపోతున్నాడు. దీనికి ముగింపు ఎప్పుడూ?

విద్య- సంస్కారం ప్రతి ఒక్కరికీ అవసరమైనవి. ఎందుకంటే విద్య- తల వంచనీయదు. సంస్కారం- వ్యక్తిత్వాన్ని దిగజారనివ్వదు. విద్యా- సంస్కారం రెండూ లేనివారికి అధికారం కట్టబెడితే ఎలా ఉంటుందీ? ఇదిగో ఇలా భారతదేశం ఇప్పుడున్నట్లు ఉంటుంది. ఈ మధ్య మనుషులు కూడా షేర్ మార్కెట్‌లాగా అయిపోయారు. ఎప్పుడు ఎవడు ఎంతగా దిగజారుతాడో తెలియకుండా పోయింది. పేపర్ లీక్ అయితే, పరీక్ష రద్దవుతుందని మనకుతెలుసు. కాని, ఈ దేశంలో ఇరవై లక్షల- 'ఈవీఎం'లు కనబడకపోయినా, నమోదైన ఓటర్ల సంఖ్య కంటే, అధిక సంఖ్యలో ఓట్లు పోలయినా- ఎన్నికలు ఏ మాత్రం రద్దు కావు. పైగా-సిగ్గువిడిచి, ప్రజాస్వామ్యాన్ని మేమే సాకుతున్నామని డప్పు కొట్టుకుంటారు! ధరలు పెరగడం, జీవనం దుర్భరం కావడం అందరితో పాటు ఆరెస్సెస్- బీజేపీ వారికి కూడా అనుభవంలోకి వస్తోంది. అయితే వారు ఆ విషయం మనలాగా బయటికి చెప్పుకోలేరు. రైతుల జీవితానికి, సైనికుల ప్రాణానికీ, స్త్రీలమానానికి ఈ దేశంలో విలువే లేదు. ఇక మిగతా వాటి ధరలన్నీ ఆకాశమెక్కి కూర్చున్నాయ్. ఒక మహిళ వ్యక్తిత్వం, ఒక దళితుడి ప్రతిభ, ఒక ముస్లిం దేశ భక్తి- ఈ దేశంలో ఎప్పటికీ ప్రశ్నార్థకమే! అబద్ధం- రోజుకు ఐదారు డ్రస్‌లు మార్చుకున్నా భయం భయంగానే తిరుగుతుంది. విలేకరుల సమావేశం ఒక్కటి కూడా నిర్వహించదు. ఎదురుగా ప్రాంప్టర్ లేకపోతే పెదవి కదపదు. నిజం- నిజాయితీ ఒకే ఒక్క తెల్లటి టి-షర్ట్‌తో భయం లేకుండా, ప్రజల పక్షాన మాట్లాడటానికి ఎక్కడంటే అక్కడ, ఎప్పుడంటే అప్పుడు సిద్ధంగా ఉంటుంది. దేశంలో నోట్ల రద్దు జరిగినప్పుడు గుజరాత్‌కు చెందిన మహేష్ షా అరెస్టయ్యాడు. అది పదమూడు వేల ఎనిమిది వందల అరవై కోట్లకు సంబంధించిన పెద్ద కేసు. ఇన్వెస్టిగేషన్‌లో అమిత్‌షా పేరు రాగానే కేసు ఎక్కడికక్కడ గప్‌చుప్ అయిపోయింది. ఏమయ్యిందో ఎవరికీ తెలియదు. జస్టిస్ లోయా హత్య కేసు గురించి దేశంలో అందరికీ తెలుసు. కానీ, ఎవరేమి చేయగలరూ? అధికారపార్టీ వారి నిజాయితీ అలా ఉంటుంది. పెద్ద నోరేసుకుని అరుస్తారు తప్ప, చిన్న విషయం కూడా బయటికి పొక్కనీయరు. వారి ప్రణాళిక అలా ఉంటుంది.

ఒక రాజకీయ విశ్లేషకుడు మోదీ ఉపన్యాసాలన్నీ శ్రద్ధగా విని, ఆయన మాట్లాడే దాంట్లో ఏఏ విషయాలుంటాయన్నది లోతుగా తరచి చూసి, తన పరిశీలనల్ని ఈ విధంగా ప్రకటించాడు- మోదీ ఉపన్యాసాలలో 60 శాతం హిందూ ముస్లిం, మందిర్ మసీద్‌లు ఉంటాయి. 30 శాతం దేశభక్తిపై దొంగ ప్రేమ. 9.99 శాతం నెహ్రూ- గాంధీ కుటుంబాల విషయాలు, 0.01 శాతం మాత్రమే ఆర్థిక వ్యవస్థ, ఆరోగ్యం, వికాసం వంటి విషయాలుంటాయని ఆ విశ్లేషకుడు ప్రకటించాడు. గత పదేళ్లలో దేశంలో ముప్పయ్యారు కోట్లున్న పేదల సంఖ్యను ఈ ప్రభుత్వం ఎనభై కోట్లకు పెంచింది. సబ్‌కా సాత్- సబ్‌క వినాశ్- దేశ ప్రజల మేధోమథనం- అంటే ఏమిటో అర్థమయ్యింది కదా? అబద్ధాలు చెప్పే వారికే ఈ మధ్య కాలంలో ఎక్కువ గౌరవం లభిస్తోంది. ఎందుకంటే, నిజాలు వినే ఓపిక ఏ కొద్ది మందిలో గాని ఉండడం లేదు. టైటానిక్ సినిమా చివరి సన్నివేశం గుర్తుంది కదా? ఓడ మునిగి పోతుంటే కొందరు మూర్ఖులు సంగీత వాయిద్యాలు వాయిస్తూ ఆనందిస్తుంటారు. ఇప్పుడు ఇక్కడ కూడా అలాంటి పరిస్థితే ఉంది. దేశం పూర్తిగా నాశనమౌతూ ఉన్నా, కళ్లు మూసుకుని అంధ భక్తులు తమ నాయకుడిని పొగడుతూ ఉన్నారు. ఇది సబబేనా? ఆలోచించే పనిలేదా? మన కేంద్ర ప్రభుత్వం 'హాజ్‌మోలా' పేరు మార్చాలని తీవ్రంగా కృషి చేస్తోందట! ఎందుకంటే, ఆ పేరులో 'హాజ్' ఉంది. పైగా 'మౌలా' కూడా ఉంది. ఈ రెండూ ముస్లిం మతానికి సంబంధించినవి. ఆ పేరు మార్చి వారు దానికి 'దీన్ దయాల్ డకార్ గోలా' అని పెడతారని వినికిడి. టిప్పుసుల్తాన్ శ్రీరంగ పట్నం పేరు మార్చి ఒక ఇస్లామిక్ పేరు పెట్టి ఉండొచ్చు కదా? ఎందుకు పెట్టలేదూ? అంటే- వివేచన గల ధైర్యవంతుడు సమాజ స్వరూపాన్ని మార్చుదామని తహతహలాడతాడు.

పట్టణాల పేర్లు మారుస్తూ కూర్చోడు. సమాజం పట్ల ఏ మాత్రం బాధ్యత వహించని వాళ్లు పేర్లు మారుస్తూ- గొప్ప అభివృద్ధి సాధించామని తమ వీపు తామే చరుచుకుంటూ ఉంటారు. రైతు యాభై రూపాయలకు లీటర్ ఆవుపాలు అమ్మలేడు. కానీ, పతంజలి రామ్‌దేవ్ బాబా, ఆవు మూత్రం లీటర్ తొంభయి రూపాయలకి అమ్ముకోగలడు. 'మేరా భారత్ మహాన్' అంటే ఇదేనా? ఒక తరం మూర్ఖత్వం తరువాతి తరాలకు సంప్రదాయమౌతోంది! పుణ్య స్థలాలలో దేవుణ్ణి ఎందుకు వెతుకుతావ్? నువ్వు తప్పు చేస్తున్న చోట కూడా దేవుడున్నాడు. నీ విశ్వాసం ప్రకారమే 'ఇందుగలడందు లేడని' కదా చెపుతున్నావ్. దేవుడు చూస్తున్నాడన్న భయం ఉన్నవాడు తన వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి కదా? దగా, మోసం చేస్తూ స్వార్థపూరిత ప్రయోజనాల కోసం, దిగజారిపోయి- మళ్లీ దేవుణ్ణి గుర్తు చేసుకోవడమెందుకూ? మీ తప్పుడు పనులన్నిటికీ ఆ దేవుడు మిమ్మల్ని ఆశీర్వదిస్తున్నాడని భావిస్తున్నాం. ముఖాన్ని చూసి ప్రశంసలు గుప్పించడం కాదు, వ్యక్తిత్వాన్ని చూసి, చరిత్రను చూసి మాట్లాడాలని చెపుతారు విజ్ఞులు. ఇది నమ్మక ద్రోహుల యుగం మహాశయా! మీకు మనుషుల దగ్గర విశ్వాసం ఎక్కడ దొరుకుతుందీ- విశ్వాసమే కావాలంటే తమరు కుక్కలను పెంచుకోవడం మంచిది! ధార్మిక మూర్ఖత్వం సమాజాన్ని నిలువునా ముంచేస్తోంది. పురోహితులను, ముల్లాలను, ఫాదర్‌లను దూరం పెట్టండి. వారి బోధనలు వినిపించుకోకండి! ఆ అవసరం లేదు- మనుషులుకండి! మానవత్వాన్ని నిలిపే పనిలో నిమగ్నమై- మనిషి కేంద్రంగా పని చేయండి! మంచి మనిషి కావడం ముఖ్యం! ఎవరు ఏ మతానికి, ఏ కులానికీ చెందిన వారన్నది అనవసరం! మానవ శ్రేయస్సు కోసం పని చేస్తున్నారా? లేదా? అనేదే ముఖ్యం! కుల మతాలకూ, వారి ధార్మిక విశ్వాసాలకూ విలువే లేదు. మిమ్మల్ని మీరు సజీవులుగా చెప్పుకోవాలంటే, ఎక్కడ ఏ తప్పు జరిగినా, గొంతెత్తి చెపుతూ ఉండండి! నిశ్శబ్దంగా ప్రవాహంలో కొట్టుకుపోయేవి కేవలం శవాలు మాత్రమే!!

త్రిపురనేని రామస్వామి జాతీయ పురస్కార తొలి గ్రహీత

తీవ్ర సంక్షోభంలో గణతంత్రం

- ఒత్తిళ్ల నడుమ నిర్భయ జర్నలిజం
- నిజం మాట్లాడే పరిస్థితి లేదు
- ప్రేక్షకులుగా మారిన పౌరులు
- ప్రజా సమస్యలు మరిచిన పార్లమెంటు
- రాజకీయ మతాధిపత్యంతో ప్రజాస్వామ్యానికి మరణం
- 'నార్త్ఈస్ట్ నౌ' సదస్సులో పరకాల ప్రభాకర్



గువహతి: భారత గణతంత్రం తీవ్ర సంక్షోభంలో ఉందని, దేశంలో నిజాలు మాట్లాడే పరిస్థితి లేదని ప్రముఖ ఆర్థికవేత్త, రాజకీయ వ్యాఖ్యత పరకాల ప్రభాకర్ ఆందోళన వ్యక్తంచేశారు. పాలకులను ఎదిరించడం, వారి కథనాలను సవాల్ చేయడం గురించి ప్రజలు మరిచిపోయారన్నారు. నిర్భయ జర్నలిజం తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటోందని తెలిపారు. ప్రజా సమస్యలపై పార్లమెంటు చర్చించడం లేదని, ప్రజలు కూడా గొంతెత్తడం మానేసి ప్రేక్షకులుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రాజకీయ మతాధిపత్యంతో ప్రజాస్వామ్యం మనుగడ సాగించలేదని హెచ్చరించారు. దేశంలో నెలకొన్న పరిస్థితుల క్రమంలో మన గణతంత్రం సంక్షోభంలో ఉందని ప్రశ్నిస్తే అవుననే చెప్పాల్సి ఉంటుందని వక్కాణించారు. ఇదే అంశంపై డిజిటల్ వార్తా సంస్థ 'నార్త్ ఈస్ట్ నౌ' వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గువహతి కార్యక్రమంలో పరకాల ప్రసంగించారు. భారతదేశం సంక్షోభం అంచున లేదు... సంక్షోభం మధ్య ఉన్నదని వక్కాణించారు. సత్వరమే దిద్దుబాటు చర్యలు లేకపోతే పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. 'మన ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉంది. మన సమాజం సంక్షోభంలో ఉంది. మన రాజకీయాలు సంక్షోభంలో ఉన్నాయి. మన సంస్కృతి సంక్షోభంలో ఉంది. మొత్తంగా మన గణతంత్రం సంక్షోభంలో ఉంది' అని పరకాల ప్రభాకర్ వక్కాణించారు. రెండేళ్లు సాగిన హింసకు మణిపూర్ సాక్షిగా నిలిచిందని... సొంత పౌరుల వెతలను భారతీయులు పట్టించుకోలేదన్నారు. ఇది మన నైతిక-రాజకీయ పతనాన్ని ప్రతిబింబించిందని పరాకల అన్నారు. కోర్టుగదిలో సీజేఐపై దాడి వంటి ఘటనలపైనా ప్రజల స్పందన పేలవంగా ఉందన్నారు. నిరుద్యోగం, గ్రామీణుల వెతలు, రూపాయి మారక విలువ పతనం ఎవరికీ పట్టడం లేదని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామిక నిబంధనలు తారుమారవుతున్నాయని హెచ్చరించారు. గతంలో ప్రభుత్వాన్ని ఓటర్లు నిర్ణయించేవారు కానీ ఇప్పుడు ప్రభుత్వాలే ఓటర్లను నిర్ణయిస్తున్నాయని ప్రస్తుత ఎన్నికల విధానాన్ని, అనేక రాష్ట్రాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితాల ప్రక్షాళనసుద్దేశించి వ్యాఖ్యానించారు. పార్లమెంటు జరుగుతున్న తీరునూ విమర్శించారు. దిగిరాని ధరలు, పెరుగుతున్న నిరుద్యోగం, గ్రామీణుల సమస్యలు అపరిష్కృతంగా ఉంటే, వాటిని వదిలేసి లోక్‌సభలో వందేమాతరంపై మారథాన్ చర్చలు జరపడం కూడా సంక్షోభానికి గుర్తులేని పరకాల ప్రభాకర్ నొక్కిచెప్పారు. కులం, మతం, భాష, రాజకీయ వర్గం, ఆస్తులతో సంబంధం లేకుండా ఇక్కడ ఉండేవారంతా పౌరులేనని భారత్ నిర్ణయించిందని, ఓటు హక్కు కల్పించడం కోసం చాలా దేశాలకు, ప్రజాస్వామ్యాలకు కొన్ని దశాబ్దాలు/శతాబ్దాలు పట్టాయి కానీ సమసమాజాన్ని రాజ్యాంగ సభ పునాది వేసిందని గుర్తుచేశారు. అందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వానికి హామీ ఇవ్వడానికి ప్రాధాన్యతిచ్చిందన్నారు. ఆధునిక ప్రజాస్వామ్యాలు రాత్రికి రాత్రి జరిగే తిరుగుబాట్లు లేక వీధుల్లోకి వచ్చే ట్యాంకర్ల ద్వారా కుప్పకులిపోవని, క్రమంగా ఎదురయ్యే పోట్లు వాటిని నెమ్మదిగా అంతానికి చేరుస్తాయని పరకాల అన్నారు. రాజకీయాలలో మతాధిపత్యం ప్రమాదకరమని హెచ్చరించారు. దేశంలోని అతిపెద్ద మైనారిటీ వర్గం నుంచి కేబినెట్‌లోగానీ పార్లమెంటరీ పార్టీలోగానీ అధికార పార్టీకి ప్రతినిధులు లేరని నొక్కిచెప్పారు.

మతాధారంగా రాజకీయ మెజారిటీలు భర్తీ అయితే ప్రజాస్వామ్యం డొల్ల అవుతుందని హెచ్చరించారు. దీంతో రాజ్యాంగ విలువల పరిరక్షణకు ఆయన పిలుపునిచ్చారు. 'మంచి దానంతట అదే గెలవదు... చెడు శాశ్వతంగా మాయమైపోదు. దానికి ఎప్పటికప్పుడు అడ్డుకుంటూనే ఉండాలి' అని వక్కాణించారు. సమ్మిళిత చర్యల ద్వారానే గణతంత్రాన్ని పరిరక్షించుకోగలమని సూచించారు. 'మనం ఇప్పటికే సంక్షోభంలో ఉన్నాం. పక్కవాడు ఎటు పోతే మనకెందుకు అన్న ధోరణిని వీడండి. ఐక్యంగానే ప్రజాస్వామ్యాన్ని, గణతంత్రాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోగలం' అని దేశ ప్రజలకు పరకాల ప్రభాకర్ పిలుపునిచ్చారు.

'కర్మశ్రీ'కి మహాత్మాగాంధీ పేరు: మమత

కోల్‌కతా: జాతీయ ఉపాధి హామీ పథకం పేరును 'వీబీ-జీ రామ్ జీ'గా మార్చడంపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా మండిపడ్డారు. కొన్ని రాజకీయ పార్టీలు జాతీయ నాయకులను గౌరవించకపోయినా... తాము గౌరవిస్తామని బీజేపీని పరోక్షంగా ఉద్దేశిస్తూ అన్నారు. తమ ప్రభుత్వ ఉపాధి హామీ పథకం 'కర్మశ్రీ'కి మహాత్మా గాంధీ పేరు పెట్టనున్నామని ప్రకటించారు. 'కేంద్ర ఉపాధి హామీ పథకం పేరు మార్చాలని నిర్ణయించినందుకు సిగ్గుపడుతున్నా. నేనూ ఈ దేశ పౌరురాలినే. మనం ఇప్పుడు జాతిపితను కూడా మరచిపోతున్నాం' అని గురువారం ఓ బిజినెస్ కాంక్లేవ్‌లో మమత వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో చేపడుతున్న కర్మశ్రీ పథకానికి మహాత్మాగాంధీ పేరు పెడుతున్నామన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపిన నేపథ్యంతో మమత ఈ ప్రకటన చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి వచ్చే నిధులను కేంద్రం అడ్డుకుంటోందని మమత ఆరోపించారు. కర్మశ్రీ పథకం కింద లబ్ధిదారులకు 75 రోజులపాటు పని కల్పిస్తున్నామన్నారు. భవిష్యత్తులో దీనిని 100 రోజులకు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కేంద్ర నిధులు ఇవ్వనప్పటికీ రాష్ట్ర నిధులతోనే దీనిని కొనసాగిస్తున్నామని చెప్పారు.

నితీశ్ చర్యపై జావేద్ అక్తర్ మండిపాటు



న్యూఢిల్లీ: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ఓ మహిళా వైద్యురాలి హిజాబ్‌ను తొలగించడాన్ని గేయ రచయిత జావేద్ అక్తర్ తీవ్రంగా ఖండించారు. ఆ వైద్యురాలికి నితీశ్‌కుమార్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోషల్‌మీడియా వేదికగా గురువారం ఆయన ఈ ఘటనను ఖండించారు. 'మహిళలు సంప్రదాయకంగా పాటించే పరదా(ముసుగు)ను తీవ్రంగా వ్యతిరేకిస్తానని నా గురించి తెలిసిన వారందరికీ తెలుసు. అంటే దానర్థం... ఒక ముస్లిం వైద్యురాలి పట్ల నితీశ్‌కుమార్ వ్యవహరించిన తీరును సమర్థిస్తానని కాదు. ఈ దుశ్చర్యను నేను అత్యంత కఠిన పదజాలంతో ఖండిస్తున్నాను. నితీశ్‌కుమార్ వెంటనే ఆ మహిళా వైద్యురాలికి బేషరతుగా క్షమాపణ చెప్పాలి' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. నితీశ్‌కుమార్ ఒక ముస్లిం మహిళా వైద్యురాలి పట్ల ప్రవర్తించిన తీరుపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. పట్నాలో సోమవారం 1400 మంది ఆయుష్ డాక్టర్లకు సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఓ మహిళా డాక్టర్‌ను హిజాబ్ తొలగించాల్సిందిగా నితీశ్ కుమార్ ఆదేశించారు. ఆమె తిరస్కరించడంతో హిజాబ్‌ను నితిశ్ కుమార్ బలవంతంగా లాగారు. ఆయన పక్కన ఉన్న వారంతా ఈ చర్యను ఖండించడానికి బదులుగా నవ్వుతూ సమర్థించారు. ఈ చర్య సమంజసం కాదని ప్రతిపక్షాలు సహా పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

జెడ్‌పీ ఎన్నికల్లో ఆప్ హవా

చండీగఢ్: పంజాబ్‌లోని జిల్లా పరిషత్ ఎన్నికల్లో పాలక ఆమ్ ఆద్మీ పార్టీ విజయం సాధించింది. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం... పంచాయతీ సమితిలోని మెజారిటీ జోన్‌లలో ఆధిక్యంలో కొనసాగుతున్నట్లు అధికారులు గురువారం తెలిపారు. బ్యాలెట్ పేపర్ల లెక్కింపు కొనసాగుతోందని, మరికొన్ని గంటల్లో తుది ఫలితాలు వెల్లడికానున్నాయని అన్నారు. జిల్లా పరిషత్‌లో ఇప్పటివరకు వెలువడిన 317 జోన్‌ల ఫలితాల్లో 201 జోన్‌లలో ఆప్ విజయం సాధించింది. కాంగ్రెస్ 60 జోన్‌లతో రెండవ స్థానంలో, శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) 39 జోన్‌లతో మూడవ స్థానంలో, బీజేపీ 4, బీఎస్‌పీ 3, స్వతంత్రులు 10 మంది విజయం సాధించారు. పంచాయతీ సమితి ఎన్నికల్లో మెజారిటీ జోన్‌లలో ఆప్ ఆధిక్యంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

76 రైల్వే స్టేషన్లలో 'హోల్డింగ్ ఏరియా' నిర్మాణాలు

న్యూఢిల్లీ: భారతీయ రైల్వే నిత్యం లక్షలాది మంది ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేరుస్తోంది. ప్రయాణీకులతో స్టేషన్లన్నీ రద్దీగా కనిపిస్తున్నాయి. పండుగలు, సెలవుల సమయంలో స్టేషన్లలో రద్దీ తగ్గించేందుకు భారతీయ రైల్వే ... న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో విజయవంతంగా అమలు చేస్తున్న 'హోల్డింగ్ ఏరియా' మోడల్‌ను దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లోని రైల్వేస్టేషన్లలోనూ అమలు చేయాలని నిర్ణయించింది. పండుగ సీజన్‌లో ప్రయాణీకుల రద్దీ నియంత్రించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న ఇతర రైల్వే స్టేషన్లలో ఢిల్లీ మోడల్‌ను అనుసరించాలని రైల్వేమంత్రి అధికారులను ఆదేశించారు. ఇటీవల రైల్వేశాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు 76 ప్రధాన రైల్వే స్టేషన్లలో నిర్మిస్తున్న హోల్డింగ్ ఏరియాల పురోగతిపై సమీక్షించారు. న్యూఢిల్లీ స్టేషన్‌లోని ఈ విధానంతో సానుకూల ఫలితాలు ఉన్నాయని... దాంతో జాతీయ స్థాయిలో మోడల్‌గా తీసుకోవాలని స్పష్టం చేశారు. సెంట్రల్ టికెటింగ్, పోస్ట్-టికెటింగ్, ప్రీ-టికెటింగ్ కేంద్రాలుంటాయి. పండుగ సీజన్‌లో ఇక్కడి నుంచి ప్రత్యేక రైళ్లు వెళ్తాయి. ప్రయాణీకులకు వరుస క్రమంలో వెళ్లి... ఆ రైలు ఎక్కేలా చూస్తారు. హోల్డింగ్ ఏరియాను 'యాత్రి సువిధ కేంద్రాలు'గా పిలుస్తారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఆరు రైల్వేస్టేషన్లలో వీటిని నిర్మిస్తున్నారు. సికింద్రాబాద్ స్టేషన్‌లోనూ హోల్డింగ్ ఏరియాను నిర్మిస్తున్నారు.

వీధి కుక్కల కేసు విచారణ వాయిదా

న్యూఢిల్లీ: వీధి కుక్కల కేసు విచారణను సుప్రీంకోర్టు జనవరి 7వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసు విచారణలో భాగంగా సుప్రీంకోర్టు గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. మానవత్వం అంటే ఏమిటి అని ప్రశ్నిస్తూ... తదుపరి విచారణలో ఓ వీడియో ప్రదర్శిస్తామని తెలిపింది. అనంతరం విచారణను జనవరి 7కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం పేర్కొంది. వీధి కుక్కల కేసులో ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) రూపొందించిన కొన్ని నిబంధనలను వ్యతిరేకిస్తూ ఒకరు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాటి పట్ల అమానవీయ ప్రవర్తన కనిపిస్తుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎంసీడీ పూర్తి విరుద్ధంగా కొన్ని నిబంధనలు రూపొందించిందని, డిసెంబర్‌లోనే అధికారులు ఈ నిబంధనలు అమలు చేయవచ్చని పిటిషనర్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ పేర్కొన్నారు. వీధి కుక్కలను తొలగించవచ్చని, అయితే వాటి కోసం షెల్టర్ల నిర్మాణం పూర్తి కాలేదని అన్నారు.

న్యాయ వ్యవస్థలో దురదృష్టకర విధానం: సీజేఐ

న్యూఢిల్లీ: న్యాయ వ్యవస్థలో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ గట్టి ప్రయత్నం చేశారు. పదవీ విరమణ వయసు దగ్గరపడుతున్న సమయంలో... జడ్జిలు తమ ఆదేశాలతో సిక్సర్లు కొట్టే ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఓ కేసు విషయంలో గురువారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఆ సమయంలో చీఫ్ జస్టిస్ ... న్యాయ వ్యవస్థలో ఓ దురదృష్టకరమైన విధానం నడుస్తోందని, పదవీ విరమణ సమీపిస్తున్న జడ్జిలు తమ తీర్పులతో సిక్సర్లు కొట్టే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. సుప్రీం ధర్మాసనంలో సీజేఐ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ జోయ్‌మాలా బాగ్చీ కూడా ఉన్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ జిల్లా జడ్జి తన పదవీ విరమణకు పది రోజుల ముందు సస్పెన్షన్‌కు గురయ్యారు. తన సస్పెన్షన్‌ను సవాల్ చేస్తూ ఆ జడ్జి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పదవీ విరమణ సమీపిస్తున్న సమయంలో ఆ జడ్జి రెండు కేసుల్లో కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆ తీర్పులపై ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆ జడ్జిపై సస్పెన్షన్ విధించారు. పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తి తన పదవీ విరమణకు ముందు సిక్సర్లు కొట్టే ప్రయత్నం చేశారని, ఈ అంశంపై లోతుగా ఏమీ చెప్పలేమని అన్నారు. వాస్తవానికి ఆ జిల్లా జడ్జి నవంబరు 30వ తేదీన పదవీ విరమణ కావాల్సి ఉంది. కానీ 19వ తేదీనే ఆయన్ను సస్పెండ్ చేశారు. అయితే ఆ జడ్జి పదవీవిరమణ వయసును మరో ఏడాది కాలం పాటు పొడిగించాలని సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో మధ్యప్రదేశ్ సర్కారుకు చెప్పింది. రెండు కీలక ఆదేశాలు ఇచ్చిన అంశం ఆ జడ్జికి కూడా తెలియదని, కానీ పదవీ విరమణ వయసును ఏడాది పొడిగించినట్లు చెప్పారు. రిటైర్మెంట్‌కు ముందు సంచలన ఆదేశాలు ఇవ్వడం జడ్జిలకు ఓ ట్రెండ్‌గా మారిందన్నారు. తన సస్పెన్షన్‌ను ఛాలెంజ్ చేస్తూ హైకోర్టును ఎందుకు ఆశ్రయించలేదని బెంచ్ ప్రశ్నించింది. జిల్లా జడ్జి తరఫున సీనియర్ న్యాయవాది విపిన్ సంఘీ వాదించారు. అనుచిత ఆదేశాలు ఇచ్చిన జడ్జిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం సరికాదని, దీని కోసం ఆయన్ను సస్పెండ్ చేయలేమని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించాలని ఆదేశించింది.

సంక్షోభం నుంచి బయటపడ్డాం

ఇండిగో సీఈవో

న్యూఢిల్లీ: ఇండిగోలో తలెత్తిన సంక్షోభంపై ఆ సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్ స్పందించారు. ఈ మేరకు ఉద్యోగులకు ఓ వీడియో సందేశాన్ని పంపారు. కష్టకాలం ముగిసిందని తెలిపారు. ఎయిర్‌లైన్ రోజువారీ సర్వీసులు పునరుద్ధరించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రోజుకు దాదాపు 2,200 విమానాలను నడుపుతున్నట్లు తెలిపారు. 'కష్టకాలం ముగిసింది. అతిపెద్ద సవాలును అధిగమించాం. ఇండిగో ఉద్యోగులు, మేము ఒకరికొకరం మద్దతుగా నిలిచి ఈ తుపాన్‌ను ఎదుర్కొన్నాం. పైలట్లు, క్యాబిన్ సిబ్బంది, ఎయిర్‌పోర్టు సిబ్బంది, ఓసీసీ, కస్టమర్ సర్వీస్ ఇలా మాకు మద్దతు ఇచ్చిన అన్ని విభాగాల ఉద్యోగులకు ధన్యవాదాలు' అని తెలిపారు. వివిధ కారణాలు ఒక్కసారిగా ముంచుకురావడంతో ఈ సమస్య తీవ్ర రూపం దాల్చినట్లు చెప్పారు. ఆ తర్వాత సంస్థ తన షెడ్యూల్‌ను పునర్నిర్మించుకుందని అన్నారు. సంస్థను మరింత దృఢంగా తీర్చిదిద్దడంతో పాటు సమస్యకు మూల కారణాన్ని విశ్లేషించేందుకు విదేశీ నిపుణుడిని రంగంలోకి దింపిన విషయాన్ని సీఈఓ పీటర్ ఎల్బర్స్ గుర్తు చేశారు. ఇలాంటి కొన్ని సంక్షోభ పరిస్థితులు మన వ్యవస్థలను బలోపేతం చేయడానికి కూడా సాయపడతాయని అభిప్రాయపడ్డారు. ఇకపై ఉద్యోగులు ప్రశాంతంగా ఉండాలని, వారు బాధ్యతలపై దృష్టిపెట్టాలని సూచించారు. 'సంస్థలో ప్రస్తుతం 65 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. సంస్థ ఇప్పటివరకు 850 మిలియన్లకు పైగా కస్టమర్లకు సేవలందించింది. దేశంలోని మారుమూల ప్రాంతాలను ప్రపంచానికి అనుసంధానిస్తూ అత్యంత భద్రతా ప్రమాణాలను పాటిస్తోంది. ఏ లక్ష్యంతో ఈ సంస్థను ప్రారంభించామో.. ఆ విధంగానే భారత్‌లో సేవలందిస్తూనే ఉంటాము' అని సీఈవో తెలిపారు.

డీఎంకే దుష్టశక్తి

టీవీకే అధినేత విజయ్

ఈరోడ్: తమిళనాడులో డీఎంకే ప్రభుత్వంపై టీవీకే పార్టీ అధినేత విజయ్ విమర్శలు గుప్పించారు. నీట్ పరీక్ష మినహాయింపు, శాంతిభద్రతల సమస్యలపై స్టాలిన్ ప్రభుత్వాన్ని నిందించారు. డీఎంకే పార్టీకి సమస్యలు ఫెవికాల్‌తో ముడిపడి ఉన్నాయని, వాటిని వేరు చేయలేమని వ్యాఖ్యానించారు. అధికార డీఎంకేను దుష్టశక్తిగా, తన పార్టీ టీవీకే(తమిళగ వెట్రి కజగం)ను స్వచ్ఛమైన శక్తిగా అభివర్ణించారు. పోరాటం స్వచ్ఛమైన శక్తికి, చెడుకు మధ్య అని విజయ్ చెప్పారు. విజయ్ గురువారం మధ్యాహ్నం ఈరోడ్ జిల్లాలో భారీ ర్యాలీ నిర్వహించారు. సెప్టెంబర్ 27న కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన తర్వాత రాష్ట్రంలో ఆయన పెద్ద ఎత్తున జరిపిన సభ ఇదే కావడం విశేషం. ఈ ర్యాలీ ద్వారా విజయ్ వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు తన ప్రచారానికి స్వరం సిద్ధం చేసుకున్నారు. ర్యాలీకి వచ్చిన జనసమూహాన్ని సురక్షితంగా వెళ్లమని విజయ్ విజ్ఞప్తి చేశారు. ఈ ర్యాలీ ఏఐఏడీఎంకే మాజీ నాయకుడు కేఏ సెంగొట్టయన్ స్వస్థలం విజయమంగళం సమీపంలో జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. సెంగొట్టయన్ గత నెలలో ఏఐఏడీఎంకే నుండి బహిష్కరణకు గురైన తర్వాత విజయ్ పార్టీ టీవీకేలో చేరారు. ఆయనను సీనియర్ రాజకీయ నాయకుడు, అద్భుతమైన ప్రచార వ్యూహకర్తగా పరిగణిస్తారు. కరూర్ తొక్కిసలాట ఘటన తర్వాత విజయ్ నిర్వహించిన రెండవ పెద్ద బహిరంగ సభ ఇదే కావడం విశేషం. మొదటి సభ గత వారం పుదుచ్చేరిలో జరిగింది. కాగా, తోపులాట, తొక్కిసలాటకు ఆస్కారం ఇవ్వకుండా కార్యకర్తలను నిర్ణీత సమయంలో లోనికి అనుమతించడం, నిర్ణీత సమయంలో విజయ్ అక్కడికి వచ్చే విధంగా ఆదేశాలు ఇచ్చారు. ఇక్కడ ఏర్పాట్లను టీవీకే వర్కింగ్ కమిటీ సమన్వయకర్త సెంగొట్టయన్, ప్రధాన కార్యదర్శి భుస్సీ ఆనంద్ పర్యవేక్షించారు. గుర్తింపు కార్డులు ఉన్న కేడర్‌ను మాత్రమే లోనికి అనుమతించే విధంగా ఏర్పాట్లు చేశారు.

జనాభా 1,500... 27వేలకు పైగా జననాలు!

ముంబై: మహారాష్ట్రలోని యావత్మల్ జిల్లా అర్ని తహసీల్‌లోని షెందురుసాని గ్రామ పంచాయతీ జనాభా కేవలం 1,500. అయితే ఈ ఏడాది సెప్టెంబరు నుంచి నవంబరు మధ్య కేవలం మూడు నెలల్లోనే 27,397 జననాలు ఆ గ్రామంలో నమోదయ్యాయి. కాగా, ఈ విషయం తెలిసి జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు షాక్ అయ్యారు. ఆ గ్రామాన్ని సందర్శించారు. అసాధారణ రీతిలో నమోదైన జననాల ధృవీకరణ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. దీంతో అతిపెద్ద జనన ధృవీకరణ పత్రాల కుంభకోణం బయటపడింది. జనన, మరణ నమోదు వ్యవస్థ (సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్)ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసినట్లు గుర్తించారు. పంచాయతీ సీఆర్ఎస్ లాగిన్ ఐడీ ముంబైకి మ్యాప్ అయ్యిందని తెలుసుకుని అధికారులు షాక్ అయ్యారు. మరోవైపు జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కూడా పంచాయతీ శాఖ డిప్యూటీ సీఈవో అధ్వర్యంలో విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. మూడు నెలల్లో నమోదైన 27,397 జననాలు, ఏడు మరణాలు పంచాయతీ పరిధికి వెలుపల ఉన్నట్లు ఆ కమిటీ నిర్ధారించింది. ఈ నేపథ్యంలో జిల్లా ఆరోగ్య అధికారి ఈ స్కామ్‌పై యావత్మల్ నగర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఐటీ చట్టంతోపాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బీజేపీ సీనియర్ నేత కిరీట్ సోమయ్య ఆ గ్రామాన్ని సందర్శించారు. అక్కడ నమోదైన జననాల్లో 99 శాతం పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తులవేనని తెలిపారు. ఈ నేపథ్యంలో సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌తో మాట్లాడినట్లు చెప్పారు. ఈ జననాల నమోదులన్నీ రద్దు చేయాలని డిమాండ్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

ప్రఖ్యాత శిల్పి రామ్ సుతార్ కన్నుమూత



నోయిడా: ప్రఖ్యాత శిల్పి రామ్ సుతార్(100) బుధవారం అర్ధరాత్రి నోయిడాలోని తన నివాసంలో వృద్ధాప్య సంబంధిత అనారోగ్యాలతో కన్నుమూశారు. గుజరాత్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం ఏర్పాటు చేయడం ద్వారా 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' రూపకర్తగా ఆయన ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. 1925 ఫిబ్రవరి 19న మహారాష్ట్రలోని ధూలే జిల్లా గోండూర్ గ్రామంలో జన్మించిన సుతార్... చిన్ననాటి నుంచే శిల్పకళపై ఆసక్తి చూపారు. ముంబై జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లో గోల్డ్ మెడలిస్ట్‌గా నిలిచారు. పార్లమెంట్ ప్రాంగణంలో ఉన్న ధ్యాన భంగిమలోని మహాత్మాగాంధీ విగ్రహం, గుర్రంపై ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహం ఆయన రూపొందించిన ప్రముఖ శిల్పాలు. దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ పటేల్ విగ్రహం 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ'తో ఆయన ప్రతిభను మరోసారి చాటి చెప్పారు. రామ్ సుతార్‌కు పద్మశ్రీ (1999), పద్మభూషణ్ (2016) పురస్కారాలు లభించాయి. ఇటీవలే మహారాష్ట్ర అత్యున్నత గౌరవం మహారాష్ట్ర భూషణ్ పురస్కారం అందుకున్నారు.

ఎయిరిండియా విమానానికి తప్పిన ముప్పు

కొచ్చి: ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయినట్లు ఓ అధికారి గురువారం తెలిపారు. 160 మంది ప్రయాణికులతో జెద్దా నుండి కోజికోడ్ బయలుదేరిన విమానంలో ల్యాండింగ్ గేర్, టైర్ వైఫల్యమైనట్లు వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో గురువారం ఉదయం 9.07 గంటలకు విమానాన్ని కొచ్చిలో సురక్షితంగా దించినట్లు ఆ అధికారి ప్రకటించారు. జెద్దా నుండి కోజికోడ్‌కు బయలుదేరిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఐఎక్స్ 398ను అత్యవసరంగా సురక్షితంగా ల్యాండింగ్ చేయడంలో తాము విజయం సాధించినట్లు కొచ్చి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (సీఐఏఎల్) ఒక ప్రకటన విడుదల చేసింది. కుడివైపు ప్రధాన ల్యాండింగ్ గేర్, టైర్ వైఫల్యం చెందడంతో విమానంలో సాంకేతిక సమస్య ఎదురైందని, దీంతో అత్యవసరంగా ఈ విమానాన్ని కొచ్చికి మళ్లించినట్లు ఆ ప్రకటన తెలిపింది.

శబరిమల బంగారం చోరీ కేసులో పురోగతి

తిరువనంతపురం: శబరిమల బంగారం చోరీ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కొంత పురోగతి సాధించింది. దీనికి సంబంధించి ఓ ప్రవాస వ్యాపారి వాంగ్మూలం నమోదు చేయగలిగింది. పండలం స్థానికుడైన ప్రవాస వ్యాపారి నుంచి వివరణాత్మక వాంగ్మూలం సేకరించింది. ఆ సమాచారాన్ని ప్రవాస దర్యాప్తు బృందంతో పంచుకున్నది. ఆ వాంగ్మూలం ఆధారంగా సిట్ తదుపరి దర్యాప్తుకు సిద్ధమవుతోంది. ఇటీవల, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రమేష్ చెన్నితాల శబరిమల బంగారు దోపిడీ వెనుక అంతర్జాతీయ పురాతన వస్తువుల స్మగ్లింగ్ ముఠా ఉన్నట్లు తనకు సమాచారం అందిందని ఆరోపణలు, ఫిర్యాదులు చేసిన సంగతి తెలిసిందే. ఆయన ఫిర్యాదులో నిందితుడిగా ఉన్న దుబాయ్ వ్యాపారవేత్త నుంచి సిట్ గతంలో వాంగ్మూలం నమోదు చేసింది. దోపిడీలో పాల్గొన్న ఒకరితో తనకున్న వ్యక్తిగత అనుభవాల గురించి ఆ వ్యాపారవేత్త చెప్పాడు. కానీ అందుకు సంబంధించి ఎటువంటి పత్రాలను ఇంతవరకు అతడు సమర్పించలేదు.

తాగడానికి నీళ్లే లేవు... బాటిళ్లకు నాణ్యతా?

సుప్రీంకోర్టు ప్రశ్న

న్యూఢిల్లీ: నీళ్ల బాటిళ్లకు అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మన దేశంలోని చాలా ప్రాంతాల్లో ప్రజలకు కనీస తాగునీరే అందడం లేదని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. ఇది కేవలం లగ్జరీ వ్యాజ్యమే అంటూ పిటిషన్‌ను తిరస్కరించింది. ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ నాణ్యతా ప్రమాణాలు మెరుగుపర్చేలా ఆదేశాలు జారీ చేయాలంటూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. 'ఇది అర్బన్-రిచ్ మనస్తత్వంతో వేసిన పిటిషనే. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలామందికి తాగునీటి సరఫరా సరిగా లేదు. వారు శుద్ధి చేయని జలాలపై ఆధారపడుతున్నారు. ముందు వారి సంగతి ఆలోచిద్దాం. నీళ్ల బాటిళ్ల నాణ్యత గురించి తర్వాత చూద్దాం' అని ధర్మాసనం తెలిపింది. 'అమెరికా, జపాన్, ఈయూ మార్గదర్శకాలను మన దేశంలో ప్రవేశపెట్టగలమా అనే విషయాన్ని మీరు ఆలోచించుకోవాలి. భారత్‌లోని వాస్తవిక పరిస్థితులు తెలుసుకోవాలి.

గాంధీజీ దేశానికి వచ్చినప్పుడు... ఆయన చాలా మారుమూల ప్రాంతాల్లో పర్యటించారు. మీరు కూడా అలా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలు సందర్శించండి. అక్కడి ప్రజలు తాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో చూడండి. అప్పుడు మీకు మన దేశం అంటే ఏంటో అర్థమవుతుంది' అని పిటిషనర్‌కు సుప్రీం కోర్టు ధర్మాసనం సూచించింది.

విశాలాంధ్ర హైదరాబాద్

విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన పోటీలు

విశాలాంధ్ర-హైదరాబాద్ : జాతీయ వినియోగదా రుల దినోత్సవం సందర్భంగా, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ హైదరాబాద్ జిల్లా లోని పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులకు తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషలలో వక్తృత్వ మరియు వ్యాస రచన పోటీని నిర్వహిస్తున్నట్లు చీఫ్ రేషనింగ్ ఆఫీసర్, ఎం.రాజి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఈనెల 20న సుల్తాన్ బజార్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, అలాగే 22న ప్రభుత్వ సిటీ కాలేజీలో ఉదయం 10.00 గంటలకు జరుగుతాయని తెలిపారు. హై స్కూల్ విద్యార్థులకు కంజుమర్ రైట్స్ ఆక్ట్ 2019 అనే అంశంపై, అలాగే కళాశాల విద్యార్థులకు డిజిటల్ న్యాయం ద్వారా సమర్థవం తమైన, వేగవంతమైన తొలగింపు అనే అంశంపై పోటీలు నిర్వహిస్తారు. ఆసక్తిగల విద్యార్థులందరూ అవసరమైన స్టేషనరీ, ప్రధానోపాధ్యాయుడు జారీ చేసిన ఐడి కార్డులతో పోటీలో పాల్గొనాలని అభ్యర్థించారు. ఇతర సమాచారం కోసం అధ్యక్షుడు, చంద్రశేఖర్ డిసిబిసి, హైదరాబాద్‌ను అలాగే ల్యాండ్ నెంబర్ 8247808538 కు సంప్రదించాలని తెలిపారు.

జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీల ఆర్ట్స్ కాలేజి ఎదురుగా నున్న ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆవరణలో ఈ నెల 22వ తేదీన నిర్వహిస్తున్న జాబ్ మేళాకు అర్హత గల యువతి, యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫ ర్మేషన్, గైడెన్స్ బ్యూరో చీఫ్ అధికారి టి. రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో మెడ్‌ప్లస్ గ్రూప్ కంపెనీ పాల్గొంటుందని, ఫార్మసిస్ట్ , అసిస్టెంట్ లోని రెండు విభాగాల్లో దాదాపు 200 పోస్టులు భర్తీ చేయుటకు గాను డి.బి.యం. ఫార్మసీ లేదా ఏదేని డిగ్రీ అర్హత కలిగి ఉండి, 18 సంవత్సరాలు నుండి 30 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని ఆయన అన్నారు. అర్హత, ఆసక్తి గల నిరుద్యోగ యువతి , యువకులు తమ తమ పూర్తి బయోడేటా లో పాటు విద్యార్హతల జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. ఈ 22న ఉదయం 11.00 గంటల జరిగే జాబ్ మేళాకు అర్హత గల యువతి, యువ కులు అధిక సంఖ్యలో పాల్గొని, సద్వినియోగం చేసుకోవాలన్నారు, మరిన్ని వివరాలకు 9666662481 నెంబర్‌ను సంప్రదించగలని ఆయన కోరారు.

విజయవంతంగా ఏఎస్‌టీ సూపర్ సింగర్ తొలి ఆడిషన్

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : అగర్వాల్ సమాజ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎఎస్‌టి సూపర్ సింగర్ తొలి ఆడిషన్ విజయవంతంగా ముగిసింది. అగ్రవాల్ సమాజ సభ్యుల మధ్య నిర్వహించిన ఈ గీతాల పోటీలో 18 సంవత్సరాల పైబడిన పురుషులు, మహిళలు పాల్గొన్నారు. ఈ పోటీని రెండు విభాగాలుగా నిర్వహించారు. తొలి ఆడిషన్‌లో ఎంపికైన మొత్తం 35 మంది పోటీదారులు డిసెంబర్ 22న జరగనున్న రెండో ఆడిషన్‌లో తమ గానం ప్రదర్శిస్తారు. ఈ రెండో ఆడిషన్‌లో ఎంపికైన వారు 2026 జనవరి 4న భారతీయ విద్యాభవన్‌లో జరిగే గ్రాండ్ ఫినాలేలో పాల్గొననున్నారు. ఈ తొలి ఎడిషన్ ప్రారంభం సందర్భంగా మహారాజ అగ్రసేన్ జీకి ప్రత్యేక పూజా అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాజ ఉపాధ్యక్షుడు రూపేష్ అగ్రవాల్, మంత్రి వికాస్ కేసన్, నిర్వహణ కమిటీ కన్వీనర్ దిలీప్ పంసారీ, సహ కన్వీనర్ మహేంద్ర అగ్రవాల్, అశోక్ జిందాల్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సమాజ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా కూడా హాజరై, సమాజ బంధువుల కోసం నిర్వహించిన ఈ గీతాల పోటీని ప్రశంసిస్తూ పోటీదారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

అధికారుల దృష్టికి.. ప్రజా సమస్యలు

విశాలాంధ్ర, మల్కాజిగిరి : డివిజన్ పరిధిలోనీ ఎల్బీనగర్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ కుమార్ గౌడ్ గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సంవత్సర పరిష్కారానికి కృషి చేశారు. ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ మరియు మున్సిపల్ అధికారులనీ చూపడంతో వారు పరిష్కారం చూపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మోర శ్రీకాంత్ ముదిరాజ్, పార్థసారథి, మల్లేష్ గౌడ్, నరేష్, శ్రీశైలం ముదిరాజ్, కాలని వాసులు నరేందర్, పాల్ రాజ్, వీరేశ్, సతీష్, సంజీవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌ఏ 24శాతానికి పెంపు

విశాలాంధ్ర ప్రతినిధి - రంగారెడ్డి: హెచ్‌ఆర్‌ఏ 11శాతం నుండి 24శాతం కు పెరిగినందుకు జిల్లా కలెక్టర్ ను కలిసి హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా టీజీఓ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రామారావు, శ్రీనేష్ కుమార్ నోరి టీజీవో కార్యవర్గ సమావేశంలో 24శాతం హెచ్‌ఆర్‌ఏ పెరిగినందుకు జిల్లా కలెక్టర్ కు ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు చెప్పాలని, ఈ విషయంలో సహకరించిన టీజీవో సెంట్రల్ అసోసియేషన్ కు కూడా ధన్యవాదాలు తెలపాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. రిటైర్మెంట్ తర్వాత ఖాళీ అయిన అసోసియేట్ అధ్యక్ష పదవికి నూతనకంటి వెంకట్ ను అసోసియేట్ అధ్యక్షుడిగా నియమించుటకు ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగిందన్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు ఐడిఓసి, కొంగరకలాన్, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏను 11% నుండి 24% కి పెంచినట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణా గెజిటెడ్ అధికారుల సంఘం చొరవతో మాత్రమే జరిగింది . దీనికి తెలంగాణా గెజిటెడ్ అధికారుల సంఘం రంగారెడ్డి జిల్లా పక్షాన హర్షం వ్యక్తం చేశారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకున్నందుకు, గత 3 సంవత్సరాలుగా (ఆర్థికంగా నష్టపోయిన) బాధపడుతున్న మా ఐడిఓసి కొంగరకళాన్ ఉద్యోగులకు పెద్ద ఉపశమనం ఇచ్చినందుకు మా జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి కి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నూతన కంటి వెంకట్, శాంతి శ్రీ, అనిత, రాకేష్, సైదమ్మ, పద్మావతి, బాలరాజ్ గౌడ్, బాలేశ్వరి, మసూద్ అలీ, పావని మరియు ఐడిఓసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మండలంలో ఉప సర్పంచుల ఎన్నిక పూర్తి

విశాలాంధ్ర-నేరేడుచర్ల: మండలంలోని గ్రామ పంచాయతీలకు ఉప సర్పంచుల ఎన్నికలు సాధారణంగా ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో ఆయా గ్రామాల నుంచి పలువురు అభ్యర్థులు ఉప సర్పంచులుగా ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచులు గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి సర్పంచులతో కలిసి సమన్వయంతో పని చేస్తామని తెలిపారు. గ్రామస్తులు వారిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రిస్మస్ విందు విజయవంతం చేయాలి

మంత్రి అజహారుద్దీన్

విశాలాంధ్ర-హైదరాబాద్ : క్రిస్టమస్ పండుగ సందర్భంగా ప్రభుత్వం అధికారికంగా విందు కార్యక్రమాన్ని చేపట్టనుండటంతో శాఖల వారిగా కేటాయించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజాహరుద్దీన్ ఆదేశించారు. గురు వారం ఎల్బీ స్టేడియంలోని ఈ సందర్భంగా ఉన్నతాధికారులతో ఏర్పాటుచేసిన సమన్వయ సమావేశంలో క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీ ఉల్లా, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ క్రాంతి వెస్లీ, డైరెక్టర్ సిఐడిఎం శుకూర్, ఈడి వాటర్ వర్క్స్ మయాంక్ మిథల్ లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అధికారికంగా ఈ నెల20న ఎల్బీ స్టేడియం నందు క్రిస్టమస్ విందు కార్యక్రమాన్ని చేపట్ట నున్నందున సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అలాగే కార్యక్రమ నిర్వహణ డయాస్, బారికేడ్‌లు, రాంప్ అలాగే గ్యాలరీల ఏర్పాటు పక్కగా ఉండాలని, వచ్చే అతిథులకు ఇబ్బంది కలిగే విధంగా ఉండకూడదని అలాగే నిరంతర విద్యుత్, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు తో పాటు సౌండ్ ప్రూఫ్ జనరేటర్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, క్రైస్తవ సోదరులు దాదాపు పదివేలకు వరకు పాల్గొం టారని తెలిపారు. ప్రోటోకాల్ తప్పక పాటించాలని అధికారులను ఆదేశిస్తూ పోలీసుల పాత్ర కీలకమని సూచించారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వచ్చే వాహనాలను ఎప్పటికప్పుడు పార్కింగ్ స్థలాల్లో పంపించాలని సూచించారు. స్టేడియంలో శానిటేషన్ పనులు ఎప్పటికప్పుడు జరగాలని, వంటలు చేసే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకుంటూ నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్య వేక్షణ తప్పక ఉండాలని సూచించారు. ముఖ్యంగా డయాస్‌ను పూలతో సుందరీకరణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమం నిర్వహణలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి పాసులు జారీ చేయాలని సంబంధిత శాఖలను నివేదికలు తెప్పించుకోవాలని సూచించారు. డయాస్ వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టం, ఎల్‌ఈడి స్క్రీన్స్ ఏర్పాటుతో పాటు మీడియా గ్యాలరీ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎల్బీ స్టేడియంలో చేపట్టే పనుల పై మెడికల్, జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఏ, ఆర్ అండ్ బి, విద్యుత్, ఆర్టీసీ, ఉద్యాన తదితర శాఖల వారీగా సంబంధిత అధికారులతో కలిసి మంత్రి సమీక్షించారు . తదుపరి జరుగుతున్న పనులను పరిశీలించి అధికారు లకు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

విశాలాంధ్ర-ఎల్.బి.నగర్ : ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాగోల్ డివిజన్, కొత్తపేట డివిజన్ పరిధిలోని మున్సిపల్ అండ్ అవుట్సోర్సింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ సమావేశం అండాలు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమం న్యూ నాగోల్ లోని ఎస్.ఏ.దాంగే భవన్‌లో సదస్సు నిర్వహిం చారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సీనియర్ ఏఐటీయూసీ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు హాజరయ్యారు. ఏం.మద్దిలేటి ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ రావు మాట్లాడుతూ పని గంటలు పెంచడం, నిరుద్యోగులు పెరిగిపోవడం తప్ప మరొకటి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా కార్మికులకు కష్టజీవులకు వ్యతిరేకంగా నాలుగు కోడులు ప్రవేశపెట్టడం అంటే అరచేతిలో స్వర్గాన్ని చూపడములా కనిపిస్తుంది. కార్మిక సంఘాలు, స్వాతంత్రానికి పూర్వం నుంచి పోరాడి సాధించిన అనేక కార్మిక చట్టాలను తొలగించడం ప్యాసిజానికి తార్కాణమని అన్నారు, నాలుగు లేబర్ కోడులు రద్దయేంతవరకు నిరంతర పోరాటం చేస్తామని అందుకు కార్మికులు కర్షకులు అన్ని రంగాల వర్కర్లు కలిసి రావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్కార్మికులను పర్మినెంట్ చేయాలి, పర్మెంటు అయ్యేంతవరకు 26వేల కనీస వేతనం చెల్లించాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం 35000 ఇవ్వాలని, పెరుగుతున్న అధిక ధరల అనుగుణంగా జీతాలు పెంచాలని, వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల జీతాలు పెంచకపోవడం చాలా దుర్మార్గం అని అన్నారు. కార్మికులను హైవే సెంటర్ డివైడ ర్ల వెంబడి డిపించడం వల్ల మున్సిపల్ కార్మికులు ఎంతోమంది ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఎటువంటి భద్రతా చర్యలు చేపట్టకుండా పై అధికారులు డివైడర్లు ఊడిపించడం రద్దు చేయాలని, ఏ.ఐ.టి. యు. సి. మున్సిపల్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేస్తున్నది. ఈ యొక్క సమావేశంలో ,శ్రీరాములు ,ఎల్లయ్య భాగ్యమ్మ ,భారతమ్మ, లక్ష్మి, జి.అండాలు వెంకటమ్మ ,జయమ్మ ,తదితరులు మున్సిపల్ వర్కర్స్ పాల్గొన్నారు.

నాల్గో రోజు రిలే నిరాహార దీక్ష

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : నాలుగవ రోజు రిలే నిరాహార దీక్ష మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యాలయం ముందు నిర్వహించారు. దీక్షను ప్రారంభిస్తూ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే లెప్రసీ సర్వేకు అదనంగా డబ్బులు చెల్లించాలని, గతంలో పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. 18 నుండి లెప్రసి సర్వే చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆరోగ్యశాఖ అధికారులు ఆశాలను ఆదేశిస్తున్నారు. ప్రజలకు సేవలు అందించడానికి ఆశా వర్కర్లు నిరంతరం సిద్ధంగా ఉన్నారనీ తెలియజేస్తున్నాము. కానీ వస్తున్న సమస్య ఏమిటంటే లెప్రసీ సర్వేకు అదనంగా డబ్బులు చెల్లిస్తారా? లేదా? అనేది, అత్యధిక జిల్లాల్లో మెడికల్ అధికారులు సర్వేకు సంబంధించిన అదనపు డబ్బుల పైన స్పష్టత ఇవ్వట్లేదు. సర్వేకు డబ్బులు లేవని అంటున్నారు. కొన్ని జిల్లాల్లో మాకు డబ్బులు చెల్లించాలని పై నుండి ఆదేశాలు రాలేదని అధికారులు అంటున్నారు. మరికొన్ని జిల్లాల్లో మీరైతే సర్వే చేయండి తర్వాత చూస్తామని అంటున్నారు. ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క రకంగా జిల్లా అధికారులు స్పష్టత లేని సమాధానాలు చెప్తున్నారు. దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారు. ప్రతి సంవత్సరం లెప్రసీ సర్వే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇదే విధంగా ఆశాలను ఇబ్బందులకు గురిచేస్తున్నదని, అదనపు డబ్బులు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేయాలని చూస్తున్నదని ఆశా వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరంలో లెప్రసీ సర్వేకు అదనపు డబ్బులు చెల్లింపు కోసం పెద్ద పోరాటమే చేయాల్సి వచ్చింది. పోరాటం సందర్భంగా లెప్రసీ సర్వేకు అద నంగా డబ్బులు చెల్లిస్తామని అంతకుముందు పెండింగ్ లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లిస్తామని రాష్ట్ర అధికారులు గతంలో హామీ ఇచ్చారు. ఇప్పుడు ఈ అంశాలకు భిన్నం గా మళ్ళీ సమస్యలను సృష్టించడం, ఆశాలను గందరగోళం చేయడం సమంజసం కాదు. యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కే.ఉన్ని కృష్ణన్ మాట్లాడుతూ నేటికీ ఆశాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనం చెల్లించటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం నేటికీ ఫిక్సిడ్ వేతనం నిర్ణయం చేయలేదు. పని భారం, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి చాలీచాలని పారితోషికాలతో ఆశాలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఆశాలకు ఫిక్స్ వేతనం రూ.18,000 నిర్ణయం చేసి అశాలను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైన ఉంది. దీనికి భిన్నంగా ప్రభుత్వం అదనంగా చెల్లించే డబ్బులు కూడా ఎగ్గొట్టాలని చూడటం అన్యాయం. కూలజన సర్వేలు చేసిన ఆశాలకు డబ్బులు ఇంకా చెల్లించలేదు. ఈ సమస్య. పరిష్కరించాలి లేకుంటే సమ్మె తప్పదని హెచ్చరించారు.

తెలుగు విశ్వవిద్యాలయం విద్యార్థుల కోసం ప్రత్యేక యాప్

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలుగు భాషా, సంస్కృతుల పరిరక్షణకు కట్టుబడి ఉన్న తెలుగు విశ్వ విద్యాలయం, విద్యార్థుల సౌకర్యార్థం ఒక ప్రత్యేక డిజిటల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. గురువారం తెలుగు విశ్వవిద్యాలయం ఎన్.టి.ఆర్. కళామందిరంలో విద్యార్థుల సమక్షంలో ప్రత్యేక యాప్ ని వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య నిత్యానందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ?డిజిటల్ యుగంలో విద్యా వ్యవస్థ కూడా ఆధునికతను అందిపుచ్చుకునే ఆవశ్యకత ఉందని ??ఇప్పటి విద్యార్థుల జీవనశైలి పూర్తిగా మొబైల్ ఫోన్‌పై ఆధారపడిన నేపథ్యంలో, అవసరమైన సమాచారాన్ని ఒకే వేదికపై అందించాలనే ఉద్దేశంతో ఈ యాప్‌ను రూపొందించామని తెలిపారు. సంప్రదాయ భాష అయిన తెలుగువిశ్వవిద్యాలయం తన నలభై ఏళ్ల చరిత్రలో ఆధునిక సాంకేతికతను మేళవించి విద్యార్థులకు అందించిన ఈ యాప్ ఒక వరంగా నిలిచిపోతున్నం దుకు గర్వంగా ఉందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక యాప్ ని కోటక్ మహేంద్ర బ్యాంక్ వారి సౌజ న్యంతో రూపొందించబడిందని తెలిపారు. కార్యక్రమంలో కోటక్ మహేంద్ర బ్యాంక్ జోనల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, సెంట్రల్ జోనల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, పబ్లిక్ రిలేషన్ మేనేజర్ వెంకట సత్యప్రసాద్, ఎడ్యుసింక్ డైరెక్టర్ శ్రీనివాస్, వర్సిటీ ఆర్థికాధికారి కె.ఎస్.సుహాసిని, పరిపాలనాధికారి నరసింహ్మమూర్తి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు. కార్యక్రమానికి తెలుగు వర్సిటీ అకడమిక్ డీన్ డా. వనజా ఉదయ్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

భవిష్యత్ గెలుపునకు భువనగిరి నుంచే పునాది: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీఆర్‌ఎస్ పార్టీకి పూర్వవైభవం ప్రారంభమైందని, భవిష్యత్తులో సాధించబోయే అఖండ విజయాలకు యాదాద్రి భువనగిరి జిల్లా గడ్డ పునాది వేసిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల అభినందన సభలో పాల్గొన్న ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపారు. పెద్దలు చెప్పినట్లు ఎక్కడైతే అధికారం పోగొట్టుకున్నామో, అక్కడే వెతుక్కోవాలని, ఈరోజు సర్పంచ్ ఎన్నికల ఫలితాలు ఆ ఉత్సాహాన్ని ఇస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. రెండేళ్ల కిందట అసెంబ్లీ ఎన్నికల్లో కొద్దిపాటి ఓట్ల తేడాతో నిరాశ ఎదురైనా, నేడు భువనగిరిలో 56 మంది, ఆలేరులో 74 మంది, మునుగోడులో 15 మంది, తుంగతుర్తిలో 9 మంది, నకిరేకల్‌లో 7 మంది.. ఇలా జిల్లా వ్యాప్తంగా మొత్తం 161 మంది సర్పంచులను గెలిపించుకోవడం సామాన్య విషయం కాదని ఆయన కొనియాడారు. ఈ విజయం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందని, లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయం అత్యంత గలీజుగా మారిందని కేటీఆర్ మండిపడ్డారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్‌ఎస్ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. నూతనకల్ మండలంలో మల్లయ్య యాదవ్‌ను కిరాతకంగా చంపడం, నల్గొండలో అభ్యర్థిపై దాడి చేసి అమానవీయంగా మూత్రం తాగించి అవమానించడం వంటి ఘటనలు కాంగ్రెస్ నాయకుల వికృత మనస్తత్వానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ గారు ఎప్పుడూ ఇలాంటి చిల్లర రాజకీయాలకు తావివ్వలేదని గుర్తు చేశారు. అధికారులు కూడా అధికార పక్షానికి కొమ్ముకాస్తూ, గెలిచిన బీఆర్‌ఎస్ అభ్యర్థులను దొంగతనంగా ఓడించే ప్రయత్నం చేస్తున్నారని, 150కి పైగా గ్రామాల్లో జరుగుతున్న ఈ అన్యాయంపై కోర్టుల ద్వారా న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ పని తీరుకు... పల్లె తీర్పే నిదర్శనం

నూతి శ్రీకాంత్ గౌడ్

విశాలాంధ్ర, హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు ప్రజలిచ్చిన తీర్పే నిదర్శనమని అఖండ విజయం కాంగ్రెస్ ప్రభంజనం కనుల ముందు కదలాడిందని బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయినాక జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఉప ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గుతుంటే, పల్లెలు కూడా అదే దారిలో నడుస్తూ కాంగ్రెస్‌కు మరోసారి పట్టం కట్టాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మూడో విడత కూడా కాంగ్రెస్ మద్దతుదారులకే ఓటర్లు మొగ్గు చూపడం కాంగ్రెస్ పాలనపై ప్రజలు వ్యక్తం చేసిన విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ గ్రామీణ రాజకీయాలలో స్పష్టమైన మార్పుకు ఇది సంకేతం అని, ఈ విజయం వెనక సమన్వయంతో కూడిన బలమైన ప్రచార వ్యూహాలే ప్రధాన కారణమని, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులు ఒకే వేదికపై సమన్వయం చేస్తూ గ్రామస్థాయి వరకు విస్తరించిన ప్రచారం పార్టీకి అనుకూలంగా మారిందని అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా అద్దం పట్టే విధంగా వచ్చిన ఈ తీర్పు కాంగ్రెస్ పాలన పట్ల గ్రామీణ ప్రజలలో ఏర్పడిన సంపూర్ణ విశ్వాసానికి నిదర్శనం అని అన్నారు. రాష్ట్రంలో గత రెండు సంవత్సరాలుగా అమలవుతున్న ప్రజాపాలన సంక్షేమ అభివృద్ధి పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్న తీరు ఈ ఎన్నికల్లో స్పష్టమైందని, సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ప్రజా పాలన ప్రభుత్వం ప్రజలలో బలమైన నమ్మకాన్ని కలిగించిందని గ్రామస్థాయి సమస్యలను గుర్తించి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధి కూడా ఇందుకు నిదర్శనమని, ఆ చిత్తశుద్ధి ఓట్ల రూపంలో, కాంగ్రెస్ పార్టీని విజయ తీరాల వైపు నడిపించిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలలో మరింత విశ్వాసాన్ని పెంచాయని ప్రజలను నేరుగా కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధానం పార్టీ బలాన్ని పటిష్టం చేస్తుందని పేర్కొన్నారు. సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి అనే నినాదాలకు ప్రజలు పట్టం కట్టారని, గ్రామ ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను ఎన్నుకోవడమే ఇందుకు నిదర్శనం అని, దళితులు మైనారిటీలు, గిరిజనులు, మహిళలు,రైతులు, యువత పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కు మద్దతు తెలపడం గ్రామ పాలనా వ్యవస్థలో కొత్త దశ, దిశకు మార్గం సుగమం చేస్తుందని పంచాయతీ ఎన్నికల్లో సామాజిక న్యాయం స్పష్టంగా ప్రతిఫలించిందని అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని, కేంద్రంగా చేసుకొని నిర్ణయాలు తీసుకుంటున్న తీరు తెలంగాణలో నూతన రాజకీయ సంస్కృతికి నాంది పలుకుతుందని, ఈ విజయం కాంగ్రెస్ పార్టీపై మరింత బాధ్యతను పెంచిందని, గ్రామీణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి అనేకసార్లు చెబుతూ వచ్చారని అన్నారు. నూతన సర్పంచులు, వార్డు సభ్యులకు తన శుభాకాంక్షలు తెలిపారు. నిన్నటి వరకు రాజకీయంగా పోటీ ఉన్న నేటి నుంచి గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. పల్లె సీమలే పట్టుకొమ్మలని, పల్లెల అభివృద్ధి ద్వారానే రాష్ట్ర అభివృద్ధి పరిపూర్ణమవుతుందని అన్నారు. తాగునీరు పారిశుద్ధ్యం రహదారులు, విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారికత, వసతులు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజాసేవకు అంకితం కావాలని కోరారు.

వెంకటేష్ చౌహాన్‌కు మంత్రి అభినందనలు

విశాలాంధ్ర, బషీర్ బాగ్: నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు కెప్టెన్ నల్లమద ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఆదివాసి కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్‌గా పార్టీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా డాక్టర్ వెంకటేష్ చౌహాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన విద్యార్థి ఉద్యమ జీవితం, అప్పటి పోరాటాలు, ఎదురైన అనుభవాలను గుర్తు చేసుకుంటూ సుదీర్ఘంగా చర్చ జరిగిందన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి వెళ్లి చదువుకుని డాక్టరేట్ సాధించడం మామూలు విషయం కాదని, ఆ ప్రయాణం ఎంతో కష్టసాధ్యమైందని పేర్కొంటూ పాత జ్ఞాపకాలను మంత్రితో గుర్తు చేసుకున్నట్లు వెంకటేష్ చౌహాన్ తెలిపారు. విద్యార్థి ఉద్యమం నుంచి ప్రజా ఉద్యమాల వరకు సాగిన ఈ ప్రయాణంలో, ఇప్పుడు జాతీయ స్థాయిలో పార్టీ బాధ్యతలు రావడం ఎంతో గర్వకారణమని పేర్కొంటూ తనను ఆత్మీయంగా అభినందించారనీ పేర్కొన్నారు.భవిష్యత్తులోనూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మార్గదర్శకత్వంతో ఆదివాసీ సమాజం కోసం మరింత నిబద్ధతతో పనిచేస్తానని వెంకటేష్ చౌహాన్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, తొర్రూరు మాజీ సర్పంచ్ డాక్టర్ రాజేష్ నాయక్ ధరావత్ పాల్గొన్నారు.

పత్రాలు పరిశీలించి న్యాయం జరిగేలా చూస్తాం

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : వివాదంలో ఉన్న స్థలం డాక్యుమెంట్లను నిశితంగా పరిశీలించి ఎవరికీ అన్యాయం జరుగకుండా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మల్కాజిగిరి మండలంలోని సర్వే నంబర్ 354లో భూవివాద స్థలాన్ని గురువారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరువర్గాల డాక్యుమెంట్లను వెరిఫికేషన్ చేసి పంచనామా తయారు చేసి నివేదికను కమీషన్ కార్యాలయాలనికి పంపాలని ఛైర్మన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఒక వర్గం వారు చూపించిన డాక్యుమెంట్లను పరిశీలించి ఎవరికీ అన్యాయం జరుగకుండా వాస్తవాలను పరిశీలించి తదుపరి చర్య తీసుకుంటామని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని వారి భూమిని వారికి ఇప్పిస్తామని ఛైర్మన్ భరోసా ఇచ్చారు.

అక్రమ నల్లా కనెక్షన్‌దారులపై ఎఫ్ఐఆర్ నమోదు

విశాలాంధ్ర, హైదరాబాద్ : జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశాలతో అక్రమ నల్లా కనెక్షన్ దారులపై విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. జలమండలి సరఫరా చేస్తున్న పైపులైను నుంచి అక్రమంగా నల్లా కనెక్షన్ పొందిన తొమ్మిది మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ నం. 4 (రెడ్ హిల్స్), రెడ్ హిల్స్ లో-లెవెల్ సెక్షన్ పరిధిలో సీతారాం బాగ్ ప్రాంతంలో ఇటీవల జిహెచ్‌ఎంసీ నూతన రోడ్డు నిర్మాణం చేపట్టింది. ఇదే అదునుగా... కాలనీ తొమ్మిది మంది ఇంటికో అధికార కనెక్షన్ ఉండగా.. అధికారుల అనుమతులు లేకుండా వారే స్వంతంగా మొత్తం 15 అక్రమ నల్లా కనెక్షన్ తీసుకున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన జలమండలి విజిలెన్స్ విభాగం ఎండీ సూచనలతో అక్రమ నల్లా కనెక్షన్‌ను తొలగించడంతో పాటు అక్రమ కనెక్షన్ తీసుకున్న తొమ్మిది మందిపై కేసు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అధికారుల అనుమతులు లేకుండా అక్రమ నల్లా కనెక్షన్లు తీసుకుంటే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జలమండలి అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు. జలమండలి అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా తాగునీటి నల్లా, సీవరేజ్ పైపు లైన్ కనెక్షన్లు తీసుకుంటే.. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఎవరైనా అక్రమ నల్లా, సీవరేజ్ కనెక్షన్లు గుర్తిస్తే.. జలమండలి విజిలెన్స్ బృందానికి 9989998100, 9989987135 ఫోన్ నంబర్ల ద్వారా సమాచారం ఇవ్వగలరు.

చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: స్థానిక ఎల్లమ్మ కుంట చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ తులసివనం ఉమెన్స్ వెల్ఫేర్ సెక్రటరీ శ్రీమతి శిరీష సత్తూరు కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు, అందులో భాగంగానే ఈ చెరువు అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తులసీవనం కాలనీ వాసులు, జయనగర్, నవోదయ కాలనీ వాసులు, మహిళలు, యువకులు , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు పంపిణీ

విశాలాంధ్ర, ఎల్.బి.నగర్ : ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ మల్టీ స్టేట్ బ్యాంక్, నాగోల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో 2025 సంవత్సరం అంతర్జాతీయ సహకార సంవత్సరంగా యునైటెడ్ నేషన్స్(ఇఎన్)డిక్లేర్ చేసిన సందర్భంగా, సహకార స్ఫూర్తి, నేటి సమాజం, అనే అంశం పైన విద్యార్థులకు వ్యాసరచన పోటీని గీతాంజలి ఉమెన్స్ కాలేజీ లో నిర్వహించడం జరిగింది.,ఈ పోటీలో 56 మంది విద్యార్థులు పాల్గొనగా, ముగ్గురు విజేతలుగా ఫాస్ట్, సెకండ్,థర్డ్, విజేతలకి బహుమతులు అందజేయడం జరిగింది. ఈ బహుమతి ప్రధాన కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు శ్రీమతి ఈమని ఆవని, జొన్నలగడ్డ ప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ పెద్ది ప్రసాదరావు బ్రాంచ్ మేనేజర్ ఆర్. చంద్రశేఖర్, బ్యాంకు సిబ్బంది కాలేజీ ప్రిన్సిపల్ శిరీష, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్, శ్రీశైలానికి సీఈసీ రాక

విశాలాంధ్ర - హైదరాబాద్ :: భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) గ్యానేశ్ కుమార్ అధికారిక పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు రానున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన మధ్యాహ్నం 12.00 గంటలకు హైదరాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. హైదరాబాద్‌కు వచ్చిన అనంతరం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలానికి ప్రయాణం చేయనున్నారు. ఆయన సాయంత్రం 6.30 గంటలకు శ్రీశైలంలోని బ్రహ్మారాంభ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. మరుసటి రోజు తెల్లవారుజామున ఆయన శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయంలో మహా ఆరతి కార్యక్రమంలో పాల్గొని దర్శనం చేసుకుంటారు. శ్రీశైలంలో సీఈసీ పర్యటన పూర్తిగా భక్తి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాగా, ఈ సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో ఎలాంటి అధికారిక సమావేశాలు లేదా పరిపాలనా కార్యక్రమాలు ఉండవని అధికారులు తెలిపారు. హైదరాబాద్ షెడ్యూల్‌లో భాగంగా గ్యానేశ్ కుమార్ నగరంలోని చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం గల ప్రాంతాలను సందర్శించనున్నారు. ఇందులో గోల్కొండ కోట, హుస్సేన్‌సాగర్, చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం ఉన్నాయి. అదేవిధంగా ఎన్నికల నిర్వహణలో కీలకమైన తెలంగాణ రాష్ట్ర బూత్ లెవల్ అధికారులతో (బీఎల్‌వోలు) రవీంద్రభారతి ఆడిటోరియంలో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఎన్నికల ప్రక్రియను మరింత పటిష్టంగా అమలు చేయడంపై దిశానిర్దేశం చేయనున్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా యంత్రాంగం సమన్వయంతో చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటాలను నిర్వహించండి

విశాలాంధ్ర, హైదరాబాద్: భారతదేశంలో నేడున్న పరిస్థితుల్లో భారత రాజ్యాంగం స్వామి పరిరక్షణ పోరాటాలు చాలా బలంగా రాష్ట్రమంతట నిర్వహించాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం పిలుపునిచ్చింది. నేడు అఖిలభారత శాంతి సంఘీభావ సంగం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జి.నాగేశ్వరరావు అధ్యక్షతన హిమాయత్ నగర్ లోని రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రెడ్డి ఎక్స్ ఎమ్మెల్సీ జాతీయ అధ్యక్ష వర్గ సభ్యులు డాక్టర్ డి డి సుధాకర్ గారెలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ అంతర్జాతీయంగా యుద్ధోన్మాదం విధానాలు ప్రమాదకరంగా శాంతికి భంగకరంగా పరిణమించాయని భారతదేశంలో అలిన విధానము నుండి తప్పుకుంటుందని భారతదేశంలో రాజ్యాంగం ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాద పంచుల్లోకి నెట్టివేయబడుతుందని పాలకులు కేంద్రంలో ప్రశ్నించే తత్వాన్ని బావ ప్రకటన స్వేచ్ఛను సహించటం లేదని ప్రశ్నించిన వారి మీద కేసులు బనాయించి జైల్లో పెట్టడం, కార్ ఆపరేషన్ లాంటి రాజ్యాంగ వ్యతిరేక, అప్రజస్వామిక చర్యను చేపట్టడం , ఆదివాసీలను ఉద్యమకారులను చంపడం లాంటి చర్యలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేదిగా కనబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం సమన్వయ ప్రధాన కార్యదర్శి కేపీఎల్ మాట్లాడుతూ రాష్ట్రంలో అయ్యప్ప సో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల రిపోర్టును ప్రవేశపెట్టారు అన్ని జిల్లాల్లో అఖిలభారత శాంతి సంఘీభావ సంగం ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు జరిగాయన్నారు శాంతి ఉద్యమ ప్రాధాన్యతను తెలియజేస్తూ సంఘం బలోపేతానికి సభ్యత్వాలు, నిర్మాణం పునాది అని సభ్యత్వాలు చేర్పించి సమావేశాలు జరిపించాలని నూతన సంవత్సరం లో జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా అనే అంశంపై విస్తృతంగా మీటింగ్లో సెమినార్లు స్కూళ్లలో కాలేజీలలో వివిధ రూపాల్లో నిర్వహించాలని తెలియజేశారు.రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టమును జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాన్ని తుంగలో తొక్కి ప్రయత్నం చేస్తున్నారని మత పరమైన ఆలోచనలతో పాలన విధానాలను కొనసాగిస్తున్నారన్నారు. ఐప్ సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి నాగేశ్వరరావు, తిప్పర్తి యాదయ్య మాట్లాడుతూ దేశంలో ప్రజలంతా యుద్ధాలకు వ్యతిరేకంగా ఐక్యంగా నిలబడాలని మానవజాతిని కాపాడుకోవాలని అన్నారు. అధ్యక్ష వర్గ సభ్యులు ఎం ఆర్ జి వినోద్ రెడ్డి డాక్టర్ సమత రోషిని మాట్లాడుతూ పార్టీలకతీతంగా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.వివిధ జిల్లాల నుండి వచ్చిన జిల్లా నాయకులు స్నేహితులు ఉదయ భాస్కర్, కోటంరాజు, డాక్టర్ ప్రశాంతి, గురు బచ్చన్ సింగ్ ,జె.కె.శ్రీనివాస్, గురు బచ్చన్ సింగ్, పోల గాని రవి కిషోర్ ,తిప్పర్తి మహేష్, పల్లె కుమార్, వెంకట్రాంరెడ్డి, ప్రేమ పావని, కమలా రెడ్డి, కరుణ, లెనిన్, రాజమౌళి, రామ్ రెడ్డి,, రామ్ నారాయణ, అమరేందర్ రెడ్డి, సుభాష్ యాదవ్, డి.జి. నరేంద్ర ప్రసాద్, సుధావన్, వెంకటేశ్వర్లు, నాగసేనారెడ్డి, ఎస్ .ఎన్ .శెట్టి, జగన్మోహన్, బాలయ్య, శివయ్య, పల్లె వెంకన్న, చిత్రం సైదులు నగేష్ అప్పు, జావేద్, అజీమ్, రాకేష్ తదితరులు చర్చల్లో పాల్గొని అనేక సలహాలు ఉద్యమ అభివృద్ధి కోసం ఇచ్చారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడుతాం: సంజీవ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతామని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తెలంగాణ చౌరస్తా నుంచి బీజేపీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించడానికి ప్రయత్నించగా కార్యాలయ సమీపంలో పోలీసులు భారీకెడ్లు ఏర్పాటు చేశారు. భారీకేడ్లు దాటి కాంగ్రెస్ నాయకులు వెళ్లడానికి ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం మీడియాతో డీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఆరోపించారు. ప్రతిపక్షాలను భయభ్రాంతులకు చేయడానికి ఈడీ, సీబీఐలను ఇష్టానుసారంగా వాడుకుంటున్నదని విమర్శించారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గట్టిగా ప్రస్తావిస్తున్న కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్గాంధీపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ అనేది కేవలం జర్నలిజంకు సంబంధించినదని అన్నారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పట్ల బీజేపీ అవలంభిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని అన్నారు. దేశంలో బీజేపీని భూస్థాపితం చేసేవరకు పోరాడుతామని హెచ్చరించారు. నిరసనలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, నాయకులు వినోద్ కుమార్, మిథున్ రెడ్డి, సీజే బెనహర్, అజ్మత్ ఆలీ, బెక్కరి మధుసూదన్ రెడ్డి ఫయాజ్, ఆవేజ్, రాములు యాదవ్, నాగరాజు, ప్రవీణ్ కుమార్ తో పాటు జిల్లాలోని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నూతనంగా గెలుపొందిన గ్రామ పంచాయతీల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ హైదరాబాద్‌లోకి జీహెచ్ఆర్ ఇన్‌ఫ్రా

విశాలాంధ్ర - హైదరాబాద్ :: హైదరాబాద్ దక్షిణ భాగంలో తమ కొత్త విల్లా కమ్యూనిటీ, జిహెచ్ఆర్ త్రివనను ప్రారంభించినట్లు జిహెచ్ఆర్ ఇన్‌ఫ్రా వెల్లడించింది. ఈ సందర్భంగా జిహెచ్ఆర్ ఇన్‌ఫ్రా సీఈఓ కర్తీష్ రెడ్డి మాట్లాడుతూ రెరా రిజిస్ట్రేషన్‌ను పొందడం అనేది మెరుగైన నివాసాన్ని అందించాలనే మా ప్రతిజ్ఞను ధృవీకరిస్తుందన్నారు. ఇక్కడ డిజైన్ అధునాతనత మరియు నియంత్రణ కఠినత కలిసి ఉంటాయన్నారు. "విల్లా జీవనంలో విశాలతను కోరుకుంటున్నప్పటికీ పాఠశాలలు, ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు, విమానాశ్రయానికి కనెక్టివిటీని కోరుకుంటున్న కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని జిహెచ్ఆర్ త్రివన రూపొందించబడిందని పేర్కొన్నారు. సమృద్ధిగా సహజ సిద్ధమైన కాంతి నుండి పొరుగువారితో ఆహ్లాదకరమైన సంభాషణలను ప్రోత్సహించే స్థలాల వరకు శ్రేయస్సును పెంపొందించడానికి మేము ప్రతి చదరపు అడుగును అందంగా తీర్చిదిద్దాము " అని అన్నారు. ఇది తమ భవిష్యత్ నివాసితులను కనెక్టివిటీ, ప్రశాంతత, కూడలిలో ఉంచుతుంది.

సీపీఐ ర్యాలీ జయప్రదం చేయండి

రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నరసింహ

విశాలాంధ్ర, హైదరాబాద్ : భారత కమ్యూనిస్టు పార్టీ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో సీపీఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఈ నెల 20న జరిగే ర్యాలీ బహిరంగ సభకు సంబంధించిన కటౌట్ సీపీఐ కార్యాలయం ముందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నరసింహ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసి దేశ స్వాతంత్ర్యం కోసం అనేకమంది పోరాట వీరులను త్యాగం చేసిన సీపీఐ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా హైదరాబాదులో 20వ తారీకు జరిగే ర్యాలీ బహిరంగ సభలో వేలాదిమంది ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల రైతుల విద్యార్థి యువజన పక్షాన మహాత్తరమైన పోరాటాలు చేసి అనేక విజయాలు సాధించడం జరిగింది. ఈ 100 సంవత్సరాల సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన జరిగిన పోరాటాలను చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ఇప్పటికే దేశవ్యాప్తంగా సంవత్సరం పాటు అనేక సెమినార్లు బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించడం జరిగింది. హైదరాబాద్ సంస్థానంలో రాచరిక పాలన అంతముదించి ప్రజాస్వామ్య పరిపాలనకు నడుం బిగించిన సిపిఐ పార్టీ అశేష త్యాగాలను చేసింది. ఉరికొయాలను ముద్దాడింది. ప్రపంచం గర్వించే విధంగా చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచే విధంగా రైతాంగ సాయుధ పోరాటాన్ని నడిపింది.దున్నేవాడికి భూమి కావాలని ప్రభుత్వం ప్రజలందరికీ కనీస అవసరాలు అయినా కూడు, గూడు ,గుడ్డ ఏర్పాటు చేయాలనే కార్యక్రమ ఎజెండా నీ ప్రభుత్వాల ముందు పెట్టీ వాటిని సాధించడంలో క్రియాశీలకమైన పాత్ర సిపిఐ పార్టీ పోషించింది. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ ఛాయా దేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, తెలంగాణ ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.నరసింహ, చంద్ర మోహన్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్,పడాల నళిని, కౌన్సిల్ సభ్యులు ఆరుట్ల రాజ్ కుమార్, బాలకృష్ణ, మహమూద్,నరసింహ, అటుకుల రాజు,బిక్షపతి,భాను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్: రవీందర్ యాదవ్

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వంపై శేరిలింగంపల్లి యువ నేత, భారాస సీనియర్ లీడర్ రవీందర్ యాదవ్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేతిలో రాజ్యాంగంను పట్టుకొని తిరుగుతారని, రాజ్యాంగ స్ఫూర్తి అని చెబుతారని, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే చూస్తూ ఊరుకోవడం ద్వంద నీతికి పరాకాష్ట అన్నారు. ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని తెలిపారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ లపై స్పీకర్ తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత రవీందర్ యాదవ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం స్థానిక నేతలతో కలిసి సమావేశం అయ్యారు. భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై పోరాడుతామన్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారారని రాష్ట్రంలోని ఏ ఒక్కరిని అడిగినా చెబుతారన్నారు. శేరిలింగంపల్లిలో భారాస నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరింది వాస్తవం కాదా..? అని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని ప్రశ్నించారు. దమ్ముంటే ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు చెప్పాలని సవాల్ చేశారు. భారాసలో ఉన్నట్లుగా చెప్పుకునే ధైర్యం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఉందా..? అని మండిపడ్డారు. ప్రజలు పిచ్చోళ్లు కాదని, అన్ని గమనిస్తున్నారని వెల్లడించారు. శేరిలింగంపల్లిలో అరికెపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరింది నిజామా..? కాదా..? చెప్పాలన్నారు. పార్టీలు మారే ఊసరవెళ్లల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రవీందర్ యాదవ్ సూచించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజా పోరాటాలు చేస్తామని, రానుంది భారాస ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి మాజి ప్రధానకార్యదర్శి గంగారాం సంగరెడ్డి నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ బి సి నాయకులు ముద్దంగుల మల్లేష్ యువజన నాయకులు గణేష్ రెడ్డి విద్యార్థి నాయకులు రాజు యామలవలస, వసంత్ నాయుడు, నవీన్ రెడ్డి,పవన్ యాదవ్, కోటేష్,జస్వంత్, వరుణ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రసాయన ట్యాంకులో పడిపోయిన కార్మికుడు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: రసాయన ట్యాంకును శుభ్రం చేస్తూ.. ప్రమాదవశాత్తు అందులో పడిపోయి దాదాపు ప్రాణాపాయ స్థితికి చేరుకున్న ఓ ఫ్యాక్టరీ కార్మికుడికి అమోర్ ఆస్పత్రి వైద్యులు సంక్లిష్ట చికిత్సలు చేసి అతడి ప్రాణాలు కాపాడారు. 28 ఏళ్ల వయసున్న బాబూరావు డిసెంబర్ 2వ తేదీన తన పని ప్రదేశంలోనే రసాయన ట్యాంకులో పడిపోయాడు. ఒళ్లంతా తీవ్రంగా కాలిపోయి, రసాయనాల ప్రభావానికి గురై అస్సలు ఊపిరి అందని పరిస్థితిలో ఉన్నాడు. అతడిని అమోర్ ఆస్పత్రికి తీసుకురాగానే అప్పటికే స్పృహలేని పరిస్థితిలో ఉన్నాడు. తీవ్రంగా వాంతులు అవుతూ, ఆహారం శ్వాసనాళంలోకి వెళ్లింది. రసాయనాల ప్రభావం కూడా బాగా ఉంది. ఆస్పత్రికి చేరుకున్న వెంటనే వైద్యులు బాబూరావుకు వెంటిలేటర్ అమర్చారు. ఊపిరి అందకపోవడంతో మెకానికల్ వెంటిలేషన్ మీద పెట్టారు. శ్వాసకోశ వైఫల్యం తీవ్రంగా ఉండటంతో పాటు రసాయన ప్రభావం కారణంగా తక్షణ డీకంటామినేషన్ చికిత్స ప్రారంభించారు. పరీక్షల్లో ఆయనకు 22%-%25 శాతం మేర ద్వితీయశ్రేణి రసాయన కాలిన గాయాలు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. కాలిన గాయాలకు శస్త్రచికిత్స ద్వారా డీబ్రైడ్‌మెంట్ నిర్వహించి, క్రమం తప్పకుండా గాయాలకు డ్రెసింగ్ చేస్తూ వచ్చారు. ఆహార కణాలు శ్వాసనాళంలోకి వెళ్లడం, రసాయన వాయువులు పీల్చడం వల్ల బాబూరావుకు ఆక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్ (ఏఆర్‌డీఎస్) ఏర్పడింది. దీంతో వైద్యులు దీర్ఘకాలం వెంటిలేటర్ సహాయం అందించి ఐసీయూలో క్రిటికల్ కేర్ చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా అమోర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ కిషోర్ బి రెడ్డి మాట్లాడుతూ, "ఇలాంటి తీవ్ర ప్రమాదాల్లో అత్యవసర చికిత్సలను వేగంగా అందించడం, అత్యాధునిక క్రిటికల్ కేర్ సదుపాయాలు, అన్నివిభాగాల సమన్వయం కీలక పాత్ర పోషిస్తాయి. రసాయన గాయాలు, ఏఆర్‌డీఎస్ నుంచి బాబూరావు కోలుకోవడం మా వైద్య బృందం అంకితభావాన్ని స్పష్టంగా చూపుతోంది. ఆయనకు మరో జీవితం అందించినందుకు మేము గర్విస్తున్నాం" అని చెప్పారు.

దివ్యాంగుల జీవితాల్లో కొత్త వెలుగు: మంత్రి అడ్లూరి

విశాలాంధ్ర - హైదరాబాద్ :: సంక్షేమంతో పాటు దివ్యాంగులు స్వతంత్రంగా, గౌరవప్రదమైన జీవనం సాగించాలన్నదే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గౌరవ సాంఘిక సంక్షేమ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని అలైన్ ఎనోవేషన్స్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన దివ్యాంగుల కోసం అసిస్టివ్ టెక్నాలజీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులు కేవలం సహాయం పొందే వర్గం కాదని, అవకాశం ఇస్తే తమ కాళ్లపై తామే నిలబడి ఆత్మవిశ్వాసంతో జీవించగల సామర్థ్యం ఉన్న పౌరులని మంత్రి పేర్కొన్నారు. ఇదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన దృక్పథమని తెలిపారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం పింఛన్లకే పరిమితం కాకుండా విద్య, ఉపాధి, ఉద్యోగ రిజర్వేషన్, టెక్నాలజీ, స్వయం ఉపాధి అన్నీ కలిసేలా సమగ్ర విధానంతో పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు దివ్యాంగుల పింఛన్లు సకాలంలో, ఎలాంటి అడ్డంకులు లేకుండా పేద దివ్యాంగుడి చేతికి చేరేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే చదువుతున్న దివ్యాంగ విద్యార్థి ఎక్కడా ఆగిపోకుండా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు ఉన్న రిజర్వేషన్ కాగితాల్లోనే కాకుండా వాస్తవంగా ఉద్యోగాల్లో కనిపించాలన్నదే సీఎం స్పష్టమైన ఆదేశమని గుర్తు చేశారు.ఈ లక్ష్య సాధనలో టెక్నాలజీ ఆధారిత ఇన్నోవేషన్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ అనేక మంది యువ ఆవిష్కర్తలకు మార్గదర్శకత్వం చేస్తూ వారి ఆలోచనలను స్టార్టప్‌లుగా మార్చడంలో ముందుండి పనిచేస్తోందని మంత్రి ప్రశంసించారు. టిజిఐసి మద్దతుతో ఎదిగిన అలైన్ ఇన్నోవేషన్స్ వంటి సంస్థలు దివ్యాంగుల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకొచ్చే ఉత్పత్తులను రూపొందించడం తెలంగాణకు గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో అలైన్ ఇన్నోవేషన్స్ రూపొందించిన నవీనావుల్ట్ " అసిస్టివ్ టెక్ పరికరాలను 20 మందికి పైగా దృష్టిలోపం ఉన్న వ్యక్తులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఉద్యోగాలు చేస్తున్న దివ్యాంగులు ఎవరి మీద ఆధారపడకుండా తమ వృత్తి గౌరవాన్ని కాపాడుకునేలా ఈ టెక్నాలజీలు రూపుదిద్దుకున్నాయని తెలిపారు. ఇది కేవలం వ్యాపారం కాదని, సామాజిక బాధ్యతతో కూడిన ఇన్నోవేషన్ అని పేర్కొన్నారు. బాష్ వంటి సంస్థలు ముందుకు వచ్చినట్లే మరిన్ని కార్పొరేట్ సంస్థలు సియేసర్ ద్వారా దివ్యాంగుల సాధికారతకు భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. సియేసర్ ద్వారా వచ్చే నిధులు దివ్యాంగుల సంక్షేమానికి మాత్రమే కాకుండా వారి స్వయం ఆధారిత జీవనంలో పెట్టుబడిగా మారాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రభుత్వ%-%సీఎస్ఆర్%-%స్టార్టప్ భాగస్వామ్యంతో దివ్యాంగుల కోసం ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని భారతదేశంలో తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించడం దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని చెప్పారు.

కేవలం 21 ఏళ్ల వయసులోనే అలైన్ ఇనోవేషన్స్ వ్యవస్థాపకుడు రవి కిరణ్ ప్రపంచ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ ఇమాజిన్ వెంచర్ విన్నర్ అవార్డ్ సాధించిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందడం ప్రతి తెలంగాణ వాసికి గర్వకారణమని మంత్రి తెలిపారు. టిజిఐసి మద్దతుతో ఎదిగిన ఇన్నోవేటర్‌గా రవి దృష్టిలోపం ఉన్నవారికి మరిన్ని అవకాశాలు కల్పిస్తూ, తెలంగాణను మరింత అందుబాటులో ఉండే రాష్ట్రంగా మార్చాలన్న స్పష్టమైన విజన్‌తో ముందుకు సాగుతున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టిజిఐసి సీఈఓ మిరాజ్, యునిసెఫ్ (ఆంధ్రప్రదేశ్ %ఉ% తెలంగాణ) ఫీల్డ్ ఆఫీసర్ జెలామియాలి, ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి ప్రదీప్‌తో పాటు నెట్‌వర్క్ మోడల్‌పై పనిచేస్తున్న పలు ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ మాఫియాగా రేవంత్ ప్రభుత్వం

దాసోజు శ్రవణ్ సంచలన ఆరోపణలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తయ్యాయని, కానీ ఈ రెండేళ్ల పాలనలో ప్రజా ప్రయోజనాలు మరిచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాఫియాలా వ్యవహరిస్తోందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్ర ఆరోపణలు చేశారు. దేశం గర్వించదగ్గ నేత, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తీసుకొచ్చిన ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని, అలాగే రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన చట్టాలను ఉద్దేశపూర్వకంగా నీరుగార్చే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. భూములు ఎక్కువగా ఉన్న వారి నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీనే ఒకప్పుడు తీసుకొచ్చిన చట్టాలను నేడు అదే పార్టీ తూట్లు పొడుస్తోందన్నారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన నాయకులకు నజరానాలుగా వేల కోట్ల రూపాయల భూములను అక్రమంగా బదలాయిస్తున్నారని ఆరోపించారు. గాజుల రామారం ప్రాంతంలో అరికెపూడి గాంధీ 11 ఎకరాల భూమిని అక్రమంగా కబ్జా చేశారని, ఆయన పార్టీ మారిన వెంటనే ఆ భూమిని ల్యాండ్ రెగ్యులరైజ్ చేయడం ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. రేవంత్ రెడ్డికి భజన చేస్తే చాలు, పార్టీ మారితే చాలు భూ బదలాయింపులు జరిగిపోతున్నాయన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం గాజుల రామారం పరిధిలోని సర్వే నెంబర్ 307లో మొత్తం 411 ఎకరాల భూమి ఉండగా, అందులో 317 ఎకరాలను ల్యాండ్ సీలింగ్ చట్టం కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. మిగిలిన 123 ఎకరాల 28 గుంటల భూమి మాత్రమే ప్రైవేట్ భూమిగా రికార్డుల్లో ఉందన్నారు. అయితే ల్యాండ్ సీలింగ్ కిందకి వచ్చే భూములపై అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపించారు. 1980కు ముందే ల్యాండ్ సీలింగ్ కిందకి వచ్చిన భూమిని 1991లో షేక్ ఇమామ్ పేరుపై ఉన్నట్లు రికార్డులు చూపించడం, ఆయన అప్పటికే భూమిని అమ్మేసినా, 2006లో అమ్మినట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడం ఘోర నేరమన్నారు. ఆ భూమిలో 128.28 ఎకరాలను నలుగురు వ్యక్తులు విక్రయించినట్లు రికార్డులు ఉన్నాయని తెలిపారు. 2015 వరకు ఆ ప్రాంతంలో అభివృద్ధి జరిగినా, ఇప్పుడు అక్రమంగా భూములను తిరిగి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. అరికెపూడి గాంధీ పార్టీ మారినప్పుడు రేవంత్ రెడ్డి ఇచ్చిన నజరానా ఏమిటంటేఇప్పటికే అమ్మిన భూమిని నకిలీ డాక్యుమెంట్లతో మళ్లీ అతని పేరుపై రిజిస్టర్ చేయించడం అని ఆరోపించారు. భూ భారతి పోర్టల్‌లో కూడా అరికెపూడి గాంధీ పేరుపై ఎంట్రీ చేయడం ప్రభుత్వ ప్రమేయం లేకుండా సాధ్యం కాదన్నారు. ఈ అక్రమాలపై మాధవరం కృష్ణారావు బాధ్యతగల ప్రజాప్రతినిధిగా సీసీఎల్ఏ, చీఫ్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్, హైడ్రా కమిషనర్, విజిలెన్స్ కమిషనర్, కూకట్పల్లి పోలీస్ కమిషనర్ సహా పలు శాఖల అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. తాను కూడా హైడ్రా కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు ఇవ్వగా, "రేపే చర్యలు తీసుకుంటాం" అని చెప్పినప్పటికీ, మరుసటి రోజే అక్కడ అక్రమ బౌండరీలు వేసినట్లు చెప్పారు. తరతరాలుగా ప్రభుత్వానికి చెందిన భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం ఎవరి సొమ్ము అని ప్రశ్నించారు. కబ్జాదారులను, దొంగలను అరికట్టకపోతే దేశాన్ని ఎవరూ కాపాడలేరన్నారు. పార్టీ మారితే వేల కోట్ల భూములు నజరానాగా ఇస్తారన్న ప్రచారం నిజమని ఆరోపించారు. ఐడీపీఎల్ భూములపై విచారణ చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతూనే, అది కేవలం ఒక్క సర్వే నెంబర్‌కే పరిమితం చేయడం డ్రామా తప్ప మరొకటి కాదన్నారు. గాజుల రామారం సర్వే నెంబర్ 307పై ఎందుకు విచారణ చేయడం లేదని ప్రశ్నించారు. మాధవరం కృష్ణారావు పలుమార్లు పూర్తి స్థాయి విచారణ కోరినా పట్టించుకోలేదన్నారు. నియమనిబంధనలు పాటించకుండా హైడ్రా పేరు చెప్పి అక్రమ బ్లూ షీట్లు పెట్టడం జరుగుతోందన్నారు. దమ్ముంటే గాజుల రామారం సర్వే నెంబర్ 307లోని భూముల వద్దకు రావాలని రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. "అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు" ప్రభుత్వ భూములను పంచడం ఏ నైతికత అని నిలదీశారు. రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు తెచ్చిన చట్టాలను తానే అధికారంలోకి వచ్చి నాశనం చేశారని విమర్శించారు. ల్యాండ్ సీలింగ్ చట్టం కింద ఉన్న భూముల్లో జరుగుతున్న అన్ని కార్యకలాపాలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. అనుమతులు ఇచ్చిన అధికారుల పాత్రపై కూడా విచారణ జరపాలని కోరారు. భూ భారతి అంటే బోగస్ భారతి అయ్యిందా? అని ప్రశ్నించారు. ఐడీపీఎల్ భూములపై ఎలాంటి విచారణ జరుగుతోందో, అదే విధంగా గాజుల రామారం సర్వే నెంబర్ 307పై కూడా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మంత్రులు, ముఖ్యమంత్రి మధ్య సమన్వయం లేదని, హిల్‌టాప్ పాలసీ డాక్యుమెంట్లను మంత్రులే బయటకు ఇచ్చారని ఆరోపించారు. ప్రతి రోజు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల పేర్లు చెప్పడం తప్ప రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలపై మాట్లాడటం లేదన్నారు. ప్రతిపక్ష నేతలపై బురదజల్లితే ప్రజలు నమ్మరని హెచ్చరించారు. ఏకగ్రీవ ఎన్నికల పేరుతో బెదిరింపులకు పాల్పడిన విషయం ప్రజలు చూశారన్నారు. అధికారంలో ఉన్న పార్టీ కేవలం 50 శాతం స్థానాలు మాత్రమే గెలవడం సిగ్గుచేటని, ప్రభుత్వం నిజంగా మంచి చేస్తే 90 శాతం స్థానాలు గెలవాల్సిందన్నారు. మహాలక్ష్మి, రైతు బంధు వంటి హామీలు గ్రామాల్లో అమలు కాలేదని, కానీ తాత%-%మనవడు ఆడుకోవడానికి ప్రభుత్వ ఖజానా నుంచి 200 కోట్ల రూపాయలు ఖర్చు చేశారని విమర్శించారు. ఈ ఖర్చు ఎవరి కోసమని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.

గాంధీజీ పేరు తీసేస్తే చరిత్ర మారుతుందా?:

మంత్రి పొంగులేటి ధ్వజం

విశాలాంధ్ర - హైదరాబాద్ :: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో గాంధీజీ పేరును తొలగించడం ఆయనను అవమానించినట్లేనని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయన పేరును తొలగించడం సిగ్గుచేటని అన్నారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలన్న లక్ష్యంతో 2005లో ఆనాటి యూపీఏ ప్రభుత్వం చారిత్రాత్మకమైన ఉపాధి హామీ పథకాన్నితీసుకువస్తే గడచిన పది సంవత్సరాల నుంచి బిజేపీ ప్రభుత్వం ఆ పథకానికి తూట్లుపొడుస్తూ నీరుగారుస్తోందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి, రాష్ట్రాలపై 40 శాతం భారాన్ని నెట్టడం పేదల పొట్ట కొట్టడమేనని దుయ్యబట్టారు. పార్లమెంట్‌లో తీసుకువచ్చిన బిల్లు అభివృద్ధి తిరోగమనమేనని, రాష్ట్రాలపై మోయలేని భారమని అన్నారు. భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' ఇప్పుడు 'వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్' (విబి - జి- రామ్ - జి) గా మార్చడం అన్యాయమని అన్నారు. లోక్‌సభలో బలవంతంగా గురువారం ఆమోదించిన ఈ కొత్త బిల్లు, పథకం యొక్క స్వభావాన్ని, నిధుల సమీకరణను పూర్తిగా మార్చివేసిందని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్య ఫలాలు అందించిన మహనీయుడు, జాతిపిత మహాత్మా గాంధీ పేరు మీద 20 ఏళ్ల క్రితం యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం పేరు మార్చడం వెనుక కేంద్ర పాలకుల సంకుచిత మనస్తత్వం కనిపిస్తోందని, పేరు మార్చినంత మాత్రాన వారి వైఫల్యాల నుంచి కప్పిపుచ్చుకోలేరని అన్నారు. వికసిత్ భారత్ అని నినాదాలు ఇస్తూ, గ్రామీణ భారతానికి వెన్నెముకగా ఉన్న పథకాన్ని అగాధంలోకి నెడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, పేదల కడుపు కొడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

హౌసింగ్ బోర్డు బంపర్ ఆఫర్

గచ్చిబౌలిలో సింగిల్ బెడ్ రూం ఎల్ఐజి ఫ్లాట్స్

విశాలాంధ్ర - హైదరాబాద్ :: రాష్ట్రంలోని ప్రజల సొంత ఇంటి కలను నెరవేర్చడంలో తనదైన ముద్ర వేసుకున్న హౌసింగ్ బోర్డు ప్రత్యేకంగా ఎల్ ఐ జి వర్గాల (లోయర్ ఇన్ కం గ్రూప్) కోసం ఫ్లాట్లను అందుబాటులోకి తెచ్చింది. హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ ప్రాంతాల్లోని మొత్తం 339 ఫ్లాట్లను అందుబాటులోని ధరలతో ఎక్కడ ఉన్నవి అలానే అన్న ప్రాతిపదికన విక్రయిస్తున్నది. అల్పాదాయ వర్గాల ప్రజలకు (ఎల్ ఐ జి) మంచి వసతులతో కూడిన సొంత ఇంటి వసతిని కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఇప్పటికే అనేక కుటుంబాలు నివసిస్తున్న గేటెడ్ కమ్యూనిటీ - అపార్ట్ మెంట్ లలోని ఫ్లాట్లను ఆ వర్గాలకు చెందిన వారికే కేటాయించాలనే నిర్ణయం తీసుకున్నామని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ఇవన్నీ కూడా అభివృద్ధి చెందిన, అత్యధిక డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోని ఫ్లాట్లే అని బహిరంగ మార్కెట్ కంటే చాలా తక్కువ ధరలతో విక్రయిస్తున్నట్లు ఆయన వివరించారు. వివిధ ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో హౌసింగ్ బోర్డు నిర్మించిన అపార్ట్ మెంట్ లలోని ఈ ఫ్లాట్లను ప్రత్యేకించి అఫర్డబుల్ హౌసింగ్ కింద అల్పాదాయ వర్గాల ప్రజల సొంత ఇంటి కలను నెరవేర్చాలన్న లక్ష్యంతో ఏడాదికి ఆరు లక్షల రూపాయల (నెలకు రూ.50 వేలు) ఆదాయం ఉన్న వారికే వీటిని కేటాయించాలనే నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ గచ్చిబౌలి లోని 111 ఫ్లాట్లు, వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని అపార్ట్ మెంట్ లో 102 నూ, ఖమ్మంలో శ్రీరామ్ హిల్స్ వద్ద 126 ఫ్లాట్లు అందుబాటులో ఉన్నాయని వైస్ ఛైర్మన్ శ్రీ విపి గౌతం తెలిపారు. వీటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతూ దరఖాస్తు చేసుకున్న వారికి పూర్తి పారదర్శకమైన విధానంలో లాటరీ పద్ధతిలో కేటాయిస్తామన్నారు. ఫ్లాట్ల విస్తీర్ణం 450 చదరపు అడుగుల నుంచి 650 చదరపు అడుగుల వరకు ఉన్నదనీ, గచ్చి బౌలి ప్రాంతంలోని ఫ్లాట్ల ధర రూ.26 లక్షల నుంచి గరిష్టంగా 36.20 లక్షల వరకు మాత్రమే ఉన్నదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఖమ్మం, వరంగల్ లో రూ. 19 -21.50 లక్షలకు, ఖమ్మంలో రూ.11.25 లక్షలకే అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ ప్రాంతాల్లోని ఫ్లాట్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి ఉన్న వారు ఆన్ లైన్ లోనూ, మీ సేవా కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకోవచ్చును. గచ్చిబౌలి ప్రాంతం ఫ్లాట్ల కేటాయింపు లాటరీ ప్రక్రియ జనవరి 6 వ తేదీన, వరంగల్ లోని ఫ్లాట్ల కేటాయింపు జనవరి 8న, ఖమ్మం ఫ్లాట్ల లాటరీ జనవరి 10 వ తేదీన నిర్వహిస్తారు. ఈ విక్రయాలకు సంబధించిన వివరాలన్నీ కూడా హౌసింగ్ బోర్డు వెబ్ సైట్ %ఫ్ట్రజూం:7/స్త్రష్ప్రఎ.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ% లో అందుబాటులో ఉన్నాయి.

గాంధీ భవన్ వద్ద హై టెన్షన్

విశాలాంధ్ర - హైదరాబాద్ :: ఏఐసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బీజేపీ కేంద్ర కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో గాంధీభవన్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకుంది. గురువారం ఉదయం నుండే భారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గాంధీభవన్ కు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ల ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలతో బీజేపీ ఆఫీస్ కి ర్యాలీగా బయలు దేరారు. దీంతో పోలీసులు ర్యాలీని అడ్డుకోవడంతో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ జిందాబాద్..కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటూ కార్యకర్తల నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాహుల్, సోనియా గాంధీ పై బీజేపీ అక్రమ కేసులు పెడుతుందని విమర్శించారు. ఢిల్లీ కోర్టులో ఈడీ వేసిన చార్జిషీట్ ని కొట్టివేసిందని, స్వతంత్రం నుండి ఉన్న పేపర్ నేషనల్ హెరల్డ్ అంటూ గుర్తు చేశారు. దేశ కోసం ఆస్తుకు త్యాగం చేసిన కుటుంబం గాంధి కుటుంబం అంటూ చెపుకొచ్చారు. అలాంటి కుటుంబం పై కావాలనే బీజేపీ వేధింపులకు గురి చేస్తుందని మండి పడ్డారు. ఇదే అంశాన్ని మేము ప్రజలోకి తీసుకెళ్తామని, శాంతియుతంగా మా నిరసన, ర్యాలీ ఉంటుందన్నారు. మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని, నేషనల్ హెరల్డ్ పేపర్ కేసు విషయం లో అదే జరిగిందన్నారు. రేపు కూడా అదే జరుగుతుందని, బీజేపీ పెడుతున్న అక్రమ కేసు లా గురించి ప్రజలకు వాస్తవాలు చెప్తామని పేర్కొన్నారు. గాంధి కుటుంబం పై బీజేపీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. గాంధీ పేరు ని సైతం తొలిగిస్తుందని, న్యాయం గెలివడానికి సమయం పట్టొచ్చు.. కానీ చివరికి గెలిచేది న్యాయమే అని వ్యాఖ్యానించారు. నేషనల్ హెలర్డ్ పేపర్ గురించి బీజేపీకి ఏమి తెలియదని, శాంతియుతంగా నిరసన చేసి ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తామన్నారు.

జోగి సోదరుల బెయిల్ పిటిషన్ కొట్టివేత

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: నకిలీ మద్యం కేసులో జోగి సోదరులకు కోర్టులో చుక్కెదురైంది. మద్యం కేసులో కీలక నిందితులు అద్దేపల్లి సోదరులు, జోగి సోదరులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను ఎక్సైజ్ కోర్టు గురువారం డిస్మిస్ చేసింది. ఈ కేసులో ఏడుగురు నిందితులు... బాదల్ దాస్, ప్రదీప్ దాస్, కళ్యాణ్,రవి, శ్రీనివాస్ తిరుమలశెటి, శ్రీనివాస్ రెడ్డి, సతీష్‌లకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇదే కేసులో అరెస్టయిన మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాము, అద్దేపల్లి జనార్దన్ రావు, ఆయన సోదరుడు అద్దేపల్లి జగన్మోహన్ రావుతోపాటు ఇతర నిందితులు నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. బెయిల్ కోసం వీరు ఎక్సైజ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన కోర్టు కీలక నిందితులుగా ఉన్న ఈ నలుగురికి తప్పించి...మిగిలిన ఏడుగురికి బెయిల్ మంజూరు చేసింది. ఇరు పక్షాల న్యాయవాదుల వాదనలు విన్న కోర్టు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. జగన్ ప్రభుత్వ హయాంలో ఈ నకిలీ మద్యం కేసులో అద్దేపల్లి బ్రదర్స్‌కు జోగి బ్రదర్స్ అండగా ఉండి ప్రోత్సహించినట్లు కోర్టుకు ఆధారాలను ప్రభుత్వం తరపు న్యాయవాది ఇప్పటికే అందజేశారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ కోర్టు ఈ నలుగురి బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నలుగురికి గురువారంతో రిమాండ్ ముగియనుంది. దాంతో వర్చువల్‌గా న్యాయమూర్తి ముందు పోలీసులు వీరిని హాజరుపరిచారు. డిసెంబర్ 31వ తేదీ వరకు వారి రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు ఇచ్చారు.

కారుచౌకగా భూముల సంతర్పణ

- కార్పొరేట్‌లకు ధారాదత్తం
- భూ కేటాయింపులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో కోట్లాది రూపాయల అతి విలువైన భూములను కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెట్టడంపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి కార్పొరేట్ అనుకూల పాలన సాగిస్తోందన్నారు. పెట్టుబడులను, పరిశ్రమలను ఆహ్వానిస్తున్నామనే పేరుతో రాష్ట్రంలో అతి విలువైన భూములను నామమాత్రపు ధరకే కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నదని, ఆయా సంస్థలకు ప్రోత్సాహకాల పేరుతో భూసంతర్పణకు తోడు అప్పనంగా వనరులు, నిధులు సమకూరుస్తున్నదని పేర్కొన్నారు. చంద్రబాబు సర్కార్ ఇప్పటికే విశాఖపట్నంలో కోట్లాది రూపాయల అతి విలువైన భూములను అదానీ గూగుల్ డేటా సెంటర్‌కు 200 ఎకరాలు, టీసీఎస్ కంపెనీకి 21.60 ఎకరాలు, కాగ్నిజెంట్‌కు 22.19 ఎకరాలు, ఇన్ఫోసిస్‌కు 20 ఎకరాలు, సత్వా గ్రూపుకు 30 ఎకరాలు, ఎఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు 10.29 ఎకరాలు, సంవర్ధన సుదర్శన్ ఇంటర్నేషనల్ కంపెనీకి 3.55 ఎకరాలు, రహేజా కార్ప్ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ అనే రియల్ ఎస్టేట్ సంస్థకు 27.10 ఎకరాలు, లూలూ గ్రూపుకు 13 ఎకరాలను రూ.0.99 పైసల చొప్పున కారుచౌకగా కట్టబెట్టిందని వివరించారు. తమ కంపెనీల ఏర్పాటు కోసం పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో భూములను వందల కోట్లకు కొనుగోలు చేసిన ఆయా కంపెనీలు...రాష్ట్రంలో మాత్రం రాయితీల పేరుతో అతి తక్కువ ధరకు తీసుకోవడంలో కూటమి ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలు వెలుగుచూస్తున్నాయని తెలిపారు. రహేజా కార్ప్ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ అనే రియల్ ఎస్టేట్ సంస్థకు విశాఖపట్నంలో అతి విలువైన 27.10 ఎకరాల భూమిని ఎకరా కేవలం రూ.0.99 పైసలకే కట్టబెట్టడాన్ని హైకోర్టు తప్పుబట్టిందన్నారు. ప్రోత్సాహకాల పేరుతో రహేజా కంపెనీకి రూ.91.2 కోట్లను ప్రభుత్వమే ఎదురు చెల్లించేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోందని, దరఖాస్తులు ఆహ్వానించకుండా, నోటిఫికేషన్ ఇవ్వకుండా ఒకే కంపెనీకి భూములు ధారాదత్తం చేయడంపై హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేయడం గమనార్హమని పేర్కొన్నారు. రహేజా వంటి రియల్ ఎస్టేట్ కంపెనీకి భూములు కట్టబెట్టి, ప్రజాధనాన్ని దుర్వినియోగపరచడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండించిందని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 18 నెలలు గడచినప్పటికీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల ఇళ్లస్థలాలు కేటాయింపులు ఇప్పటివరకు చేపట్టలేదన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయాలని కోరుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని తెలిపారు. ఏళ్లతరబడి తమకో గూడుకోసం ఆశగా ఎదురుచూస్తున్న పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల విషయంలో తాత్సారం చేస్తున్న..చంద్రబాబు సర్కార్ గుత్త పెట్టుబడారీ సంస్థలకు, బడా కార్పొరేట్ శక్తులకు మాత్రం ఆగమేఘాల మీద భూ కేటాయింపులు చేస్తూ ఉత్తర్వులివ్వడం దుర్మార్గమని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబుకు చిత్తశుద్ధి, పాలనా పారదర్శకత ఉంటే తక్షణమే రాష్ట్రంలో కార్పొరేట్ శక్తులకు నామ మాత్రపు ధరకు చేసిన భూ కేటాయింపులపైన, వనరులు, ప్రోత్సాహకాల పేరుతో చేసిన ప్రభుత్వ నిధుల వినియోగంపై శ్వేతపత్రం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలను కేటాయించి, ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయాలని కోరారు.

ఇంట్లో ముగ్గురికి అవార్డులు

ఎన్నికల కంటే ఈ పోటీ తట్టుకోలేకపోతున్నా: లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ గురువారం తన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఆసక్తికర ట్వీట్ చేశారు. తల్లి, భార్య, తండ్రి ఇలా వరుసగా ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకోవడంతో వారితో పోటీపడటం ఎన్నికల కన్నా కష్టంగా ఉందని లోకేశ్ చమత్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు 'ఎకనమిక్ టైమ్స్' పత్రిక ప్రతిష్ఠాత్మక 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్-2025' పురస్కారాన్ని ప్రకటించిన నేపథ్యంలో లోకేశ్ స్పందిస్తూ, "నాన్న 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు గెలుచుకున్నారు. అమ్మ 'గోల్డెన్ పీకాక్' అవార్డును ఇంటికి తీసుకొచ్చారు. నా భార్య దేశంలోనే అత్యంత శక్తిమంతమైన వ్యాపారవేత్తల్లో ఒకరిగా నిలిచారు. ఈ కుటుంబంతో పోటీ పడటం ఏ ఎన్నికల కన్నా కష్టమని నేను తెలుసుకుంటున్నాను!" అని పోస్ట్ చేశారు.

పిల్లల్ని విక్రయించే ముఠా అరెస్టు

ఐదుగురు చిన్నారులు సురక్షితం: రూ.3.30 లక్షలు స్వాధీనం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): పిల్లలను అక్రమంగా విక్రయిస్తున్న ముఠాను విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి నెలల వయస్సున్న శిశువులను తెప్పించి విక్రయిస్తున్న ముఠాను గుర్తించి, అదుపులోకి తీసుకున్నట్లు సీపీ రాజశేఖర బాబు గురువారం కేసు వివరాలను వెల్లడించారు. ఐదుగురు పిల్లలను కాపాడినట్లు తెలిపారు. ఒక్కొక్కరిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. మూడు నెలల క్రితం అరెస్ట్ అయిన బండి సరోజనీ ముఠా బయటకు వచ్చిన తర్వాత ఈ దందాను కొనసాగిస్తున్నట్లు తేల్చారు. ఆరుగురు మహిళలు సహా 10 మందిని అరెస్టు చేసినట్లు సీపీ తెలిపారు. వీరిని విజయవాడ, పాయకాపురం గుంటూరు, నరసరావుపేట ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. ముఠా నుంచి కాపాడిన ఐదుగురు పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సీపీ వెల్లడించారు. కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విద్యాధరపురం సితార సెంటర్‌కు చెందిన సరోజినీ(31), వాడపల్లి ఖ్లేసీ(30), గొల్లపూడికి చెందిన గరికముక్క విజయలక్ష్మీ (41), నాంపల్లికు చెందిన నందనీ (30) గుంటూరు జిల్లాకు చెందిన బాబావలి (28), దుర్గాపురంకు చెందిన ఆమదాల మణి(49), విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన షేక్.ఫరీనా (26), కబేలా సెంటర్‌కు చెందిన ఐరి వంశి కిరణ్‌కుమార్ (29), గుణదలకు చెందిన శంక యోహన్(46), వాంబే కాలనీకి చెందిన పతి శ్రీనివాసరావు (52)ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3.30లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో డీసీపీలు కృష్ణ కాంత్ పటేల్, కేజీవీ సరిత, ఏడీసీపీలు జి.రామకృష్ణ, ఏసీపీలు లలితా కుమారి, ఎన్‌వీ దుర్గారావు, స్రవంతి రాయ్, సీఐలు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' మార్పుపై 22 రాష్ట్రవ్యాప్త నిరసనలు

వామపక్షాల పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలకు వ్యతిరేకంగా ఈనెల 22న రాష్ట్రవ్యాప్త నిరసనకు వామపక్షాలు పిలుపునిచ్చాయి. హక్కుగా ఉన్న ఈ పథకాన్ని రద్దు చేసే కుట్రలను ఖండించాయి. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి పి.ప్రసాద్, సీపీఐ(ఎంఎల్) నుంచి జాస్తి కిశోర్‌బాబు, ఎంసీపీఐ(యూ) నుంచి కాటం నాగభూషణం, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నుంచి బి.బంగార్రావు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి ఎం.రామకృష్ణ, ఎస్‌యూసీఐ(సీ) బీఎస్ అమర్‌నాథ్, ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పీవీ సుందరరామరాజు, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ నాయకులు జానకి రాములు గురువారం ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. నాడు వామపక్షాల ఒత్తిడి ఫలితంగా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిందని, ఇప్పుడు దీని మౌలిక స్వభావాన్ని ఎన్డీయే సర్కారు మారుస్తున్నదని పేర్కొన్నారు. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (వీబీ-జీ రామ్‌జీ) పేరుతో ఉ పథకానికి 'రాంరాం' పలకనున్నదని విమర్శించారు. పని హక్కుగా ఉన్న చట్టాన్ని మార్చి ఒక సాధారణ పథకంగా అమలు చేయనున్నదని దుయ్యబట్టారు. వ్యవసాయ కార్మికులకు డిమాండ్ ఆధారంగా ఉపాధి కల్పించే విధానాన్ని మార్చి... అవసరాన్ని (సప్లయిని) బట్టి పనులు కల్పించడం అంటే ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమేనని వ్యాఖ్యానించారు. పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచనున్నట్లు చెప్పడం ప్రజలను మభ్యపెట్టేందుకేనని వామపక్ష నాయకులు విమర్శించారు. ఉపాధి కార్డులను హేతుబద్ధీకరిస్తున్నామన్న పేరుతో పెద్ద సంఖ్యలో గ్రామీణ కుటుంబాలను మినహాయిస్తున్నారని వివరించారు. ఇప్పటికే యంత్రాలు కేటాయించి కూలీల డిమాండ్ తగ్గించారని, వ్యవసాయ పనులు రద్దీగా ఉండే సమయాలలో 60 రోజుల ఉపాధి నిలుపుదల వలన అత్యంత అవసరమైన సమయాలలో గ్రామీణ కార్మికులకు పని లభించడం లేదని వెల్లడించారు. దీంతో భూస్వాములపై ఆధారపడే పరిస్థితి వస్తోందని, ఇది గర్హనీయమన్నారు. పథకం పేరును మార్చడం మహాత్ముడిని అవమానించడమేనని విమర్శించారు. కొత్త బిల్లు వల్ల రాష్ట్రాలపై రాష్ట్రాలపై వేల కోట్ల అదనపు భారం వేస్తున్నారన్నారు. ఏటా నాలుగు వేలకోట్ల అదనపు భారం రాష్ట్రంపై పడనుందని వామపక్ష నాయకులు తెలిపారు. కొత్త ఉపాధి బిల్లును ఉపసంహరించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని 'కూటమి' పార్టీలను డిమాండ్ చేశారు. 22న జరిగే నిరసనల్లో కార్యకర్తలు, ప్రజలు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు.

ప్రేమ పేరిట వంచన

విద్యార్థినిపై అత్యాచారం: ముగ్గురి అరెస్టు

బెంగళూరు: ప్రేమ పేరుతో ఒక విద్యార్థిని లోబర్చుకొని, స్నేహితులు రికార్డ్ చేయించి ఓ యువకుడు వికృత చేష్టకు ఒడిగట్టాడు. విద్యార్థినిని బ్లాక్‌మెయిల్ చేసి ఆమెపై ఆ ముగ్గురు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు యువకులను అదుపులోకి తీసుకున్నారు. కర్నాటక రాజధాని బెంగళూరులో ఈ ఘటన జరిగింది. మాగడి ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల యువతికి ఆరు నెలల కిందట వికాస్‌తో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నట్లు నమ్మించి ఆమెను లోబర్చుకున్న వికాస్ తన స్నేహితుడు ప్రశాంత్ ఇంటికి ఆమెను తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. మరో స్నేహితుడు చేతన్ దీనిని రికార్డ్ చేశాడు. ముగ్గురూ కలిసి సెప్టెంబర్ నుంచి ఆమెను వేధిస్తున్నారు. ఎప్పుడు పిలిస్తే అప్పుడు రూమ్‌కు రావాలని బెదిరించారు. రెండు నెలలుగా లైంగికంగా వేధింపులను ఎదుర్కొన్న బాధిత విద్యార్థిని ఇక భరించలేక పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి సపోలీసులు ఆ ముగ్గురిని అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఇద్దరు విద్యార్థులు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు.

మెడికల్ కాలేజీలపై జగన్ విష ప్రచారం

టీడీపీ అధికార ప్రతినిధి పాతర్ల ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కోటి సంతకాల పేరుతో జగన్ హైడ్రామాలు ఆడుతున్నాడని, మెడికల్ కాలేజీల విషయంలో ప్రభుత్వంపై వైసీపీ విమర్శలు చేయడం దుర్మార్గమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేశ్ విమర్శించారు. అమరావతిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోటి సంతకాల హడావుడి జగన్ ఆడుతున్న నాటకమని అన్నారు. పేదలకు వైద్య విద్యను ప్రభుత్వం దగ్గర చేస్తుందన్నారు. పీపీపీతో మెడికల్ కాలేజీలను నిర్మించి, పేద విద్యార్థులకూ వైద్య విద్యలో అవకాశాలు పెంచే దిశలో చంద్రబాబు చర్యలు చేపట్టారని తెలిపారు పీపీపీ విధానంలో అదనంగా 220 సీట్లు మన రాష్ట్ర విద్యార్థులకు పెరుగుతాయని, ఇందులో 110 మెడికల్ సీట్లు ప్రభుత్వ (కన్వీనర్) కోటాలో పొందుతారని, రెండేళ్లలోనే కాలేజీ నిర్మాణాలు పూర్తి అయ్యి 1750 సీట్లు మన విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు జగన్ పద్ధతిలో అయితే కాలేజీల నిర్మాణాలు పూర్తవడానికి 15 ఏళ్లు పడుతుందన్నారు. ప్రైవేట్ భాగస్వామి కేవలం మౌలిక సదుపాయాలు, నిర్వహణలో సహాయం కల్పిస్తుందని ముఖ్యంగా, 50 శాతం సీట్లు ప్రభుత్వ కోటాలోనే ఉంటాయని, దీని ద్వారా ప్రజలకు వైద్య విద్య అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రిజర్వేషన్ విధానాలు యథాతథంగా కొనసాగుతాయని. కన్వీనర్ కోటా ద్వారా జరిగే ప్రవేశాలు కూడా ప్రభుత్వ కళాశాలల్లో మాదిరిగానే జరుగుతాయని ఆయన తెలిపారు.

హైదరాబాద్- బెళగావి రైలుకు తప్పిన ప్రమాదం

హైదరాబాద్: హైదరాబాద్ నుంచి కర్నాటకలోని బెళగావి వెళ్లే క్రమంలో ప్రత్యేక రైలు(07043)కు పెద్ద ప్రమాదం తప్పింది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ సమీపంలోకి రాగానే మొదటి జనరల్ బోగీ కింద మంటలు చెలరేగాయి. ప్రయాణికుల సమాచారంతో వెంటనే అప్రమత్తమైన రైల్వే సిబ్బంది మంటలు ఆర్పివేశారు. బ్రేక్ జామ్ అవడంతో నిప్పురవ్వలు చెలరేగి మంటలు వచ్చినట్టు గుర్తించారు. మంటలు ఆర్పిన తర్వాత నిపుణుల సూచనల మేరకు రైలు బయల్దేరింది.

'అణు ఇంధన' బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

జేపీసీకి పంపాలని విపక్షాల డిమాండ్

న్యూఢిల్లీ: అణు ఇంధన రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం తెలిపింది. సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా- శాంతి పేరుతో రూపొందించిన ఈ బిల్లు గురువారం రాజ్యసభలో మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. ఈ బిల్లుపై చర్చకు మంత్రి జితేంద్రసింగ్ సమాధానమిస్తూ ఇతర పునరుత్పాదక ఇంధన వనరులతో పోలిస్తే అణుశక్తి ద్వారా నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ఆస్కారం ఉంటుందని చెప్పారు. భద్రత విషయంలో ఆందోళన అక్కర్లేదని అన్నారు. రేడియేషన్ వల్ల ప్రజలకు హాని జరిగినట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుదుత్పత్తిని సాధించాల్సి ఉందని గుర్తుచేశారు. ప్రైవేటు భాగస్వాముల్ని అనుమతించడం వల్ల పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతాయని అధికారపక్షం చెబుతోంది. రాజ్యసభలో ఈ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రైవేటు భాగస్వామ్యాన్ని విపక్ష ఎంపీలు తప్పుబట్టారు. దేశ సార్వభౌమత్వం, భద్రతపై దీనివల్ల ప్రభావం పడుతుందని తృణమూల్ ఎంపీ సాగరిక ఘోష్ ఆరోపించారు. ఈ బిల్లు చాలా ప్రమాదకరమని డీఎంకే ఎంపీ విల్సన్ విమర్శించారు. ప్రైవేటుకు లాభాలు కట్టబెట్టడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు. ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశారు. పునరుత్పాదక ఇంధనం ఉండగా..అణు శక్తిపై ఆసక్తి ఎందుకని ఆప్ ఎంపీ సందీప్ పాఠక్ ప్రశ్నించారు. ఈ బిల్లును జేపీసీకి పంపించాలని బీజేడీ ఎంపీ ముజిబుల్లా ఖాన్ డిమాండ్ చేశారు.

ఏపీఈపీడీసీఎల్‌కు జాతీయ అవార్డు



గిరిజన ఆవాసాలకు విద్యుత్ అందించినందుకు గుర్తింపు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)ను ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారం వరించింది. వినియోగదారులకు మెరుగైన సేవలతో పాటు నిరంతర విద్యుత్ సరఫరాకు విశేష కృషికిగాను ఈ అవార్డు లభించింది. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) అధ్వర్యంలో 'ఎంపవరింగ్ గ్రోత్, ప్రిజర్వింగ్ రూట్స్-ది పీఆర్ విజన్ ఫర్ 2047' అనే నినాదంతో ఉత్తరాఖండ్ రాష్ట్రం, డెహ్రాడూన్‌లో జరిగిన 47వ అఖిల భారత పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్- 2025లో 'భారతరత్న శ్రీఅతల్ బిహారీ వాజ్‌పేయి జాతీయ అవార్డు'ను ఏపీఈపీడీసీఎల్ అందుకున్నది. ఈ మేరకు సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ తెలిపారు. పీఆర్ఓ జీఎస్ఎస్ఎస్ వాసు ఈ అవార్డును అందజేశారు. పృథ్వీతేజ్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖల సహకారంతో ఈపీడీసీఎల్‌లో అనేక పథకాలు సమర్థంగా అమలవుతున్నాయని అన్నారు. పీవీటీజీ గిరిజన ఆవాసాలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ గిరిజన న్యాయ మహా అభియాన్ కార్యక్రమం ద్వారా విద్యుత్ నెట్‌వర్క్, రహదారులు, రవాణా సదుపాయాలు లేని మారుమూల గిరిజన ప్రాంతాలకు అవసరమైన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు తదితర సామగ్రిని తరలించి, 23 వేల గిరిజన కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ సదుపాయం కల్పించామని తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బందిని అభినందించారు. మరింత ఉత్తమ సేవలు అందించాలని, మరెన్నో అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి, స్పీకర్ రీతూ ఖండూరీ భూషణ్, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రమేష్ పోక్రియల్ 'నిశాంక్', పర్యావరణ & అటవీశాఖ మంత్రి శుభోద్ ఉనియల్, పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్ హాజరయ్యారు.

టాంజానియాలో తెలంగాణ వాసి మృతి

హైదరాబాద్: టాంజానియాలో జియాలజిస్టుగా పనిచేస్తున్న తెలంగాణ వాసి గుండెపోటుతో మృతి చెందారు. నల్గొండ జిల్లా మునుగోడు మండలం పలివెల గ్రామానికి చెందిన బడుగు రాజు (38) మూడేళ్ల కిందట టాంజానియా రాజధాని దారుస్సలాం వెళ్లారు. ఇటీవల హైదరాబాద్‌లో తన కుటుంబంతో నాలుగు నెలలు గడిపిన ఆయన రెండు నెలల కిందట టాంజానియాకు తిరిగి వెళ్లారు. అయితే ఆయన మరణించినట్లు పలివెల గ్రామంలో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అక్కడి వారు చేరవేశారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు ఆ దేశ రాయబారితో మాట్లాడించి మ ృతదేహాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎంపీ ఈటల రాజేందర్ సైతం తనవంతు ప్రయత్నం చేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. బడుగు రాజుకు భార్య, పదేళ్ల కుమారుడు ఉన్నారు.

గంజాయి నియంత్రణలో 'కూటమి' విఫలం

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: రాష్ట్రంలో గంజాయి లేకుండా చేస్తామని చెప్పిన హోం మంత్రి అనిత... నెల్లూరు జిల్లాలో మహిళలే గంజాయి డాన్‌లుగా ఎదుగుతుంటే ఏం చేస్తున్నారంటూ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విమల, దుర్గాభవాని ప్రశ్నించారు. స్థానిక రామకోటయ్య భవన్‌లో గురువారం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నెల్లూరు జిల్లా జనరల్ బాడీ సమావేశం జిల్లా కన్వీనర్ కె.వినోదమ్మ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన వీరు మాట్లాడుతూ... ఎన్నికల ముందు రాష్ట్రంలో గంజాయి లేకుండా చేస్తానని ప్రకటించిన చంద్రబాబు నాయుడు... అధికారం చేపట్టి దాదాపు 20 నెలలు కావస్తున్నా... గంజాయి అమ్మకాలు... గంజాయి డాన్‌ల ఆగడాలు పెరిగిపోతున్నాయి కానీ తగ్గడం లేదన్నారు. నాడు హోం మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనిత ... రాష్ట్రంలో గంజాయి అనే పదాన్ని లేకుండా చేస్తానని ప్రగల్భాలు పలికి... ఈరోజు గంజాయి అమ్ముతున్న మహిళలను సైతం ఏమి చేయలేని పరిస్థితుల్లో ఈ పాలకులు ఉన్నారని ధ్వజమెత్తారు. విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలతో మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు అధికమవుతున్నాయని, దీనిపై ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. కేంద్రం... మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును వారు ఇష్టానుసారంగా మార్చి వేయడం సరికాదని, ఇది గాంధీని అవమానించడమేనని అభిప్రాయపడ్డారు. సనాతన ధర్మం... హిందూ తత్వం పేరుతో మహిళలపై అరాచకాలను అధికమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశంలో మహిళలను వంటింటి కుందేళ్లుగా మారుస్తున్న ఈ కూటమి ప్రభుత్వానికి మహిళలు బుద్ధి చెప్పవలసిన సమయం ఆసన్నమైనదని అన్నారు. 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పి... చట్టసభలలో నేటికీ అవి పూర్తిగా అమలు కావడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నెల్లూరు జిల్లా నాయకులు సోఫియా, సాయి లత, జ్యోతి, శిరీష, ధనమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి బుక్ ఫెస్టివల్

విద్యార్థులకు ఉచిత ప్రవేశం

విశాలాంధ్ర-హైదరాబాద్: బుక్ ఫెస్టివల్‌ను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని సొసైటీ అధ్యక్షుడు కవి యాకూబ్, ప్రధాన కార్యదర్శి ఆర్. వాసు, ఉపాధ్యక్షులు బాల్‌రెడ్డి, బి.శోభన్ బాబు, కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులు కె. సూరిబాబు, పి. నారాయణ రెడ్డి, కోశాధికారి నారాయణరెడ్డి కోరారు. ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం మీడియాతో వారు మాట్లాడుతూ... ఈనెల 19 నుంచి 29 వరకు 38వ హైదరాబాద్ బుక్‌ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పుస్తక ప్రదర్శనను సుమారు 15 లక్షల మంది పుస్తక ప్రియులు సందర్శిస్తారని అంచనా వేస్తున్నట్టు పేర్కొన్నారు. ఎనిమిది అడుగుల 'పుస్తక స్ఫూర్తి పైలాన్' ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పుస్తక పఠనాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సింబాలిక్‌గా ఈ పైలాన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పైలాన్‌ను జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆవిష్కరిస్తారన్నారు. గౌరవ అతిథులుగా ఎమ్మెల్సీ కోదండరామ, కె. రామచంద్రమూర్తి, రమా మేల్కోటె హాజరవుతారన్నారు. ప్రజా కవి అందెశ్రీ ప్రాంగణంగా నామకరణం చేసినట్టు చెప్పారు. బుక్ ఫెయిర్ 367 స్టాల్స్‌తో ప్రారంభమౌతుందన్నారు. తొమ్మిది రోజుల పాటు 54 పుస్తకాలను ఆవిష్కరిస్తారన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు బాలోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల వరకు భాషా సాంస్కృతిక శాఖ వారిచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారన్నారు. సాయంత్రం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు 'పుస్తక స్ఫూర్తి' కార్యక్రమాలు జరుగుతాయన్నారు. విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు చెప్పారు. సొసైటీ కార్యదర్శి వాసు, ఉపాధ్యక్షుడు బాలరెడ్డి మాట్లాడుతూ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఈ పుస్తక ప్రదర్శనను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 24న బుక్ వాక్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ లో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌కు 116 నుంచి 119 వరకు స్టాల్స్, విశాలాంధ్ర బుక్ హౌస్‌కు 184 నుంచి 187 స్టాల్ వరకు కేటాయించినట్టు చెప్పారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

గంజాయి కేసులో నిందితుడికి 10 సంవత్సరాల శిక్ష

విశాలాంధ్ర -ఖమ్మం లీగల్: ఖమ్మం పట్టణం నకు చెందిన నారపొంగు కళ్యాణ్ కు గంజాయి కేసులో 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు 50,వేల రూపాయల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ది 27-10 -2023 న ఖమ్మం పట్టణములోని ఆటోనగర్ ఆర్చి వద్ద ఖమ్మం రూరల్ పోలీసులు వాహనాలు ను తనిఖీలు నిర్వహించగా, నిందితుడు ఆటోనగర్ ఆర్చి వద్ద ఆటో దిగి అనుమానస్పదంగా తిరుగుచుండగా అతనిని పట్టుకొని అతని చేతిలో ఉన్న బ్యాగును తనిఖీ చేయగా ఆ బ్యాగులోఅక్రమంగా (10) కేజీల ఎండు గంజాయి ఉంది.ఆ గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, కోర్టులో చార్జీషీట ధాఖలు చేయగా, అట్టి కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో పై పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డి వాదనలు వినిపించగా, కోర్టు కానిస్టేబుల్ ఎం. వెంకయ్య, హెూంగార్డు యం.డి ఆయుబ్ లు సహకరించారు.

ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్ర

పేరు మార్పుతో పథకానికి ఎసరు

విశాలాంధ్ర -ఖమ్మం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి పేరు మార్చడం వెనక ఈ పథకాన్ని రద్దు చేసే కుట్ర దాగి ఉందని వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్‌లు ఆరోపించారు. గతంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఇప్పుడు వీక్షిత్ భారత్ రోజఘర్ అజీవికా గ్రామీణ్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి బిజెపి సరికొత్త కుట్రకు తెర లేపిందని వారు -ఆరోపించారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని సాధించుకోవడం జరిగిందని బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం అమలుకు నానా కొర్రీలు పెడుతూ వచ్చిందని పని దినాలను తగ్గించడంతో పాటు రకరకాల యాప్లతో గ్రామీణ ప్రాంత పేదలను ఇబ్బందులు పెట్టిందని వారు తెలిపారు. ఇప్పుడు ఏకంగా పథకాన్ని రద్దు చేసే ఆలోచనతోనే పేరు మార్పు చేశారన్నారు. మారిన పరిస్థితుల్లో పని దినాలను పెంచడంతో పాటు దినసరి వేతనాన్ని గణనీయంగా పెంచాల్సిన సమయంలో గతేడాది కేవలం 50 నుంచి 60 రోజులు మాత్రమే సగటు పని దినాలు నమోదయ్యాయని రోజు వారి వేతనం కూడా గణనీయంగా తగ్గిందని తాటి, కర్ణ కుమార్ తెలిపారు. ఈ చట్టంలో కేంద్ర ప్రభుత్వం తన వాటాను తగ్గించి రాష్ట్రాలపై రుద్దడం ద్వారా ఈ పథకానికి తిలోదకాలు ఇచ్చే ప్రయత్నంలో ఉందన్నారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతున్న వేళ పని దినాలను పెంచి గ్రామీణ ప్రాంత ప్రజలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రస్తుతం వీక్షిత్ భారత్ రోజ్ ఘర్ అజీవిక గ్రామీణ్ పథకం పేరును రద్దు చేసి పాత పేరును కొనసాగించడంతో పాటు పని దినాలను పెంచాలని దినసరి కూలీ రూ. 600 గిట్టుబాటు అయ్యేవిధంగా చూడాలని లేని పక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర?కుమార్ లు హెచ్చరించారు.

రఘునాథపాలెం కేజీబీవీ ఎస్ఓను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

టిఆర్‌టియు ఖమ్మం జిల్లా శాఖ

విశాలాంధ్ర -ఖమ్మం : ఖమ్మం : 15 సంవత్సరాలుగా ఎస్ ఓ గా విధిని నిర్వహిస్తున్న రఘునాథపాలెం కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ వైలతాను విధుల నుండి తొలగించడానికి నిరసిస్తూ గురువారం ఖమ్మం జిల్లాలోని అన్ని కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లు మరియు పిఆర్టి నాయకత్వం డి ఈ ఓ కు వినతి పత్రం అందజేయడం జరిగింది . వినతి పత్రంలో చిన్న చిన్న కారణాలకు శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించడం సరికాదని వెంటనే ఉద్యోగంలో తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు , కేజీబీవీ పి ఆర్ టి యు నాయకురాలు ఝాన్సీ, సౌజన్య, పేద మండలాల కేజీబీవీఎస్ ఓ లు రమ, స్వాతి, ముదిగొండ ఎస్ ఓ ఇందిరా లావణ్య, ఖమ్మం రూరల్ ఎస్ ఓ అసి యబ్బిగం, జ్యోతి, వెంకటరమణ, కంత కుమారి, చింతకాని యస్ ఓ అదేవిధంగా సి ఆర్ టి లు సుజాత, లత, మమత, జ్యోతి, పి ఆర్ టి యు నాయకులు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణా పూర్ ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన సీఎంఓ కిరణ్ రాజ్

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా : సింగరేణి కాలరీస్ సీఎంఓ కిరణ్ రాజ్ గురువారం రోజు రామకృష్ణాపూర్‌లోని ఏరియా హాస్పిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు వసతులను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల వారి కుటుంబాల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. నాణ్యమైన వైద్య సేవలను అందించడమే మా ప్రాధాన్యత అని అన్నారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులను సందర్శించి, చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. హాస్పిటల్ స్టోర్‌ను సందర్శించి, మందుల లభ్యత, నిల్వ సామర్థ్యాన్ని పరిశీలించారు. రోగులకు మందుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. విధుల్లో ఉన్న డాక్టర్లతో సమావేశమై, చికిత్సా విధానాలు, ఆసుపత్రి నిర్వహణపై చర్చించారు. ఆసుపత్రి పనితీరు, నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, డిప్యూటీ సూపరింటెండెంట్ మధు కుమార్, వైద్యులు, స్టాఫ్ నర్సులు,వార్డ్ అసిస్టెంట్లను ప్రత్యేకంగా అభినందించారు.

కప్పెర పద్మకు సిపిఐ నేతల నివాళులు

విశాలాంధ్ర -కారేపల్లి : సింగరేణి మండల పరిధిలోని మాదారం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు స్వర్గీయ కప్పెన వేలాద్రి కుమారుడు కేవీ విద్యానికేతన్ కరస్పాండెంట్ కప్పెర రంగారావు సతీమణి కప్పెర పద్మ చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సిపిఐ జాతీయ నాయకులు భాగం హేమంతరావు,పద్మ భౌతిక కాయాన్ని సందర్శించి, పూల మాలలు వేసి నివాళులర్పించి,కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్,సిపిఐ వైరా నియోజవర్గ ఇన్చార్జి ఎర్రబాబు,సిపిఐ మండల కార్యదర్శి పాపినేని సత్యనారాయణ స్థానిక నాయకులు ఉన్నారు.

రాహుల్ ,సోనియా గాంధీల పై బీజేపీది కక్ష సాధింపు చర్య

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

విశాలాంధ్ర -ఖమ్మం : కేంద్ర ప్రభుత్వం ఈడిని అడ్డుపెట్టుకొని సోనియాగాంధీ రాహుల్ గాంధీ పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడు తుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోనియా రాహుల్ గాంధీలపై వేధింపులకు పాల్పడడానికి నిరసిస్తూ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు టిపిసిసి ఆదేశానుసారం జిల్లా కాంగ్రెస్ కమిటీ, నగర కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో గురువారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరిల ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివచ్చి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ కేసుల పేరుతో కొన్ని సంవత్సరాల నుండి ఈడిని అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ రాహుల్ గాంధీ పై వేధింపులకు పాల్పడి బీజేపీ రాక్ష సానందం పొందిందని అన్నారు. డిల్లీ హైకోర్టు తీర్పు బీజేపీ కి చెంప పెట్టు వంటిదని అన్నారు. కాంగ్రెస్ అగ్ర నేతలను రాజకీయంగా దెబ్బతీయ లనే దురుద్దేశంతో బిజెపి అక్రమ కేసులు బనాయించి డిల్లీ హైకోర్టు సైతం దీన్ని రాజకీయ ప్రేరేపిత కేసులుగా పరిగణించి ఈడి చార్జిషీట్ ను తిరస్కరించిందని అన్నారు. దేశం కోసం ప్రాణాలు కోల్పోయిన కుటుంబం వారిది అని అలాంటి నాయకులపై బీజేపీ కుట్రకు పాల్పడం హేయమైన చర్య అని అన్నారు. యావత్తు దేశ ప్రజలు బిజెపి అరాచకాలను గమనిస్తున్నారని త్వరలోనే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రాజ్యాంగ బద్ధ సంస్థలను బీజేపీ తన స్వంత ప్రయోజనాలకు వాడుకుంటూ పబ్బం గడుపుతుందని ఆరోపించారు. రెండు దఫాలుగా అధికారంలో ఉన్న బీజేపీ వల్ల దేశంలో జరిగిన అభివృద్ధి సంక్షేమం శూన్యమని అన్నారు. తమ ఆప్తుల ఆస్తులు కాపాడాలనే తపనలో ప్రజా సంక్షేమం గాలికి వదిలేసింది అని విమర్శించారు.

అనంతరం శ్రేణులను 2టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించి, స్వంత పూచీకత్తుపై విడుదల చేయనైనది. ఈ కార్యక్రమం లో వీరితో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పులిపాటి వెంకయ్య,రాష్ట్ర ఓబిసి సెల్ ఉపాధ్యక్షులు వడ్డేబోయిన నరసింహారావు, జిల్లా అను బంధ సంఘ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్ మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, కార్పొరేటర్లు రాపర్తి శరత్, మాజి కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు, కాపా ఆది నారాయణ, శెట్టి రంగారావు, వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, నరాల నరేష్ నాయుడు, గజ్జి సూర్యనారాయణ,బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, జెర్రిపోతుల అంజనీ కుమార్,కిలారి అనిల్, ఏలూరి రవికుమార్,ఫజల్, విప్లవ కుమార్, గడ్డం వెంకటయ్య, బీరెడ్డి రమేష్, జి వి వి ఎల్ నరసింహారావు,ఎదునూసీతారాములు, ముళ్ళపూడి సీతారాములు, కోసూరి శ్రీనివాస్, బాలాజి నాయక్, లక్ష్మయ్య, లింగాల రవికుమార్, వేల్పుల మురళి, రత్నరాజు, రత్నాకర్,సంపటం నరసింహారావు, జాకీర్ హుస్సేన్,దామా స్వరూప, అన్నపూర?, లక్ష్మీ,సుకన్య, పమ్మి అశోక్,మెన్నపూస సీతా రాములు, వసీం,మహమూద్, రాజీవ్ గాంధీ, అన్వేష్ గౌడ్,రాకేష్, దొడ్డా ప్రవీణ్,పత్తికొండ శ్రీనివాస్, పర్వత శ్రీనివాస్,కొంగర సంగయ్య, ఫరీద్ ఖాద్రి సందీప్,నాగేశ్వరరావు,యశ్వంత్, కే నారాయణ, పుల్లారావు, మంగ, కుమారి నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల గుండెల్లో గులాబీ జెండా పదిలం

పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయాలు అధికార పార్టీకి చెంపపెట్టు : మాజీ ఎంపీ నామలి

విశాలాంధ్ర -ఖమ్మం : తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్, గులాబీ జెండా పదిలంగా ఉందన్న విషయం ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలతో స్పష్టమైందని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ మద్దతుతో గెలుపొందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు నామ అభినందనలు తెలిపారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా ఇదే ఐక్యత, ఇదే ఉత్సాహంతో పని చేస్తే ఘన విజయం సాధ్యమని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామ ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనను మరోసారి చూడాలనే ఆకాంక్ష బలంగా ఉందన్నారు. అధికార పార్టీ ఆగడాలకు తట్టుకొని కూడా బిఆర్ఎస్ మద్దతుతో పోటీ చేసి గెలుపొందిన ప్రజాప్రతినిధుల విజయం అధికార పార్టీకి చెంపపెట్టులాంటిదని అన్నారు. ఒత్తిళ్లు, బెదిరింపులు, అడ్డంకులు ఎదురైనా ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు గ్రామీణ స్థాయిలో బిఆర్ఎస్ శ్రేణులు చేసిన పోరాటం ప్రశంసనీయమన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, గెలిచినా ఓడినా గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. గ్రామ పాలనలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పాత్ర కీలకమని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని గెలిచిన ప్రజాప్రతినిధులు ఆ నమ్మకాన్ని మరింత బలపర్చే విధంగా పనిచేయాలన్నారు. బిఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని, అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలై గ్రామాల రూపురేఖలు మారాయని అన్నారు. అదే అభివృద్ధి దిశను కొనసాగించాల్సిన బాధ్యత ఇప్పుడెన్నికైన ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.

ఖమ్మంలో రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ

సర్దార్ పటేల్ స్టేడియంలో 27, 28 లలో డే అండ్ నైట్ మ్యాచులు

బాల్ బ్యాడ్మింటన్ ప్లేయర్స్ అసోసియేషన్ అండ్ టోర్నమెంట్ కన్వీనర్ డాక్టర్ రాధాకృష?మూర్తి

విశాలాంధ్ర -ఖమ్మం : డిసెంబర్ 18 : తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల స్థాయిలో డిసెంబర్ 27, 28 తేదీలలో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే బాల్ బ్యాడ్మింటన్ పోటీలను విజయవంతం చేయాలని సర్దార్ పటేల్ స్టేడియం బాల్ బ్యాడ్మింటన్ ప్లేయర్స్ అసోసియేషన్, టోర్నమెంట్ కన్వీనర్ డాక్టర్ రాధాకృష్ణ మూర్తి అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... బాల్ బాడ్మింటన్ లెజెండర్ ప్లేయర్ అండ్ కోచ్ పులి రామస్వామి మెమోరియల్ ఆధ్వర్యంలో, ఖమ్మం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు బిబిఎఫ్ఐ అండ్ రెగ్యులేషన్స్ ప్రకారం డిసెంబర్ 27, 28 (శని, ఆదివారం)లలో స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో డే అండ్ నైట్ మ్యాచ్ లను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెండు రోజులు పాటు జరిగే బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత భోజన వసతి సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడాకారులకు డ్రెస్ కోడ్ తప్పనిసరి అన్నారు. మ్యాచ్ లు లీగ్ అండ్ సూపర్ లీగ్ తరహాలో నిర్వహించడం జరుగుతుందన్నారు. టీముల నమోదుకు డిసెంబర్ 20 చివరి తేదీ అన్నారు. ప్రతి మ్యాచ్ కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ. 30 వేలు, 2వ బహుమతి రూ.25వేలు, 3వ బహుమతి రూ. 20వేలు, 4వ బహుమతి రూ. 15వేలు, 5వ బహుమతి రూ. 10వేలతో పాటు మెమోంటోలు ఇవ్వడం జరుగుతుందన్నారు. బాల్ బ్యాడ్మింటన్ అభిమానులు, క్రీడాకారులు టోర్నమెంట్ ను విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో కో-కన్వీనర్ టి రామచంద్రరాజు, కో-ఆర్డినేటర్ విజయ్ కలాం, ఇంచార్జ్ డాక్టర్ పులి మధు, ట్రెజరర్ మణిభూషణ చారి, అడ్వైజర్లు శంకరమూర్తి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ తిరుపతిరెడ్డి, ఆర్గనైజింగ్ మెంబర్స్ బద్రి శ్రీకాంత్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యం కేటాయించే నిధులను తగ్గించడం అమానుషం

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా : సింగరేణి కార్మికులు మరియు వారి కుటుంబ సభ్యులు అందరూ కలిసి అత్యంత వైభవంగా పండుగ వాతావరణంగా నిర్వహించుకునే సింగరేణి దినోత్సవాన్ని సింగరేణి యాజమాన్యం ప్రతి ఏడాది ఉత్సవాలకు కేటాయించే నిధులను 25 శాతానికి తగ్గించి కేటాయించడాన్ని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయుసిగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయుసి శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ కే బాజీ సైదా అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికులు వారి కుటుంబ సభ్యులు సింగరేణి దినోత్సవాన్ని పండుగల నిర్వహించుకునేవారని దీనికి యాజమాన్యం శ్రీరాంపూర్ డివిజన్లో 3,30,000 వేల రూపాయలు నిధులను విడుదల చేసేదని దీనితో యాజమాన్యం సింగరేణి కార్మికుల కుటుంబాలకు ముగ్గుల పోటీలు, ఆటలు, కార్మికుల పిల్లలకు వెల్ బేబీ షోలు నిర్వహించి పండుగ వాతావరణం సృష్టించి వారికి బహుమతులు ప్రధానం చేసేవారని కానీ దీనికి విరుద్ధంగా యాజమాన్యం ఇటీవలే శ్రీరాంపూర్ డివిజన్‌కి సింగరేణి ఆవిరావ్ దినోత్సవ వేడు కలకు కేవలం 60,000 రూపాయలను మంజూరు చేయాలని నిర్ణయించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికులు ప్రకృతికి విరుద్ధంగా ప్రాణాలను పణంగా పెట్టి బొగ్గు ఉత్పత్తి చేసి సంస్థను లాభాల బాటలో తీసుకువచ్చి ప్రతి ఏటా కార్మికులు వారి కుటుంబాలు సింగరేణి దినోత్సవాన్ని పండగల చేసుకునే తరుణంలో యాజమాన్యం ఏకపక్షంగా సింగరేణి ఆవిర్భావ దినోత్సవం వేడుకలకు నిధులను తగ్గించడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సింగరేణి సంస్థ యొక్క వేలకోట్ల రూపాయలను సంబంధంలేని ఇతర జిల్లాలకు కేటాయిస్తున్నారని సింగరేణి సంస్థ ఆవిరావ్ దినోత్సవాలకు నిధులను తగ్గించడం సరికాదన్నారు. వెంటనే యాజమాన్యం గతంలో సింగరేణి ఆవిరావ్ దినోత్సవం విడుదల చేసిన నిధుల కంటే అదనంగా నిధులను మంజూరు చేసి సింగరేణి కార్మికులు వారి కుటుంబ సభ్యులు ఆనందోత్సవాల మధ్య సింగరేణి దినోత్సవ వేడుకలు జరుపుకునేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరు కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో క్వాంటమ్ ఏఎంసీ కార్యాలయం ప్రారంభం



విశాలాంధ్ర/హైదరాబాద్: క్వాంటమ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ (క్వాంటమ్ ఏఎంసీ) హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని ప్రారంభించింది. ఇది దక్షిణ భారతంలో తమ ఉనికిని బలోపేతం చేసే కీలక అడుగని క్వాంటమ్ ఏఎంసీ సీఈఓ సీమంత్ శుక్లా తెలిపారు. వేగంగా ఎదుగుతున్న తెలంగాణ ఆర్థిక మార్కెట్‌కు మరింత సమీపంగా, పెట్టుబడిదారులకు నాణ్యమైన, విశ్వసనీయ పెట్టుబడి పరిష్కారాలు అందించడమే లక్ష్యమన్నారు. గత మూడు నెలల్లో ఇది కంపెనీ ప్రారంభించిన రెండో కార్యాలయం కాగా, త్వరలో దక్షిణ భారతంలో మరో కార్యాలయం ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా క్వాంటమ్ అడ్వైజర్స్ ఎండీ & గ్రూప్ హెడ్ (ఈక్విటీస్) ఐవీ సుబ్రమణ్యం మాట్లాడుతూ హైదరాబాద్ టెక్నాలజీ, ఆవిష్కరణలు, ఆర్థిక క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచిన నగరమన్నారు. ఇక్కడి పెట్టుబడిదారుల అవసరాలకు అనుగుణంగా సరళమైన, పరిశోధన ఆధారిత, దీర్ఘకాలిక పెట్టుబడి అవకాశాలను అందించేందుకు క్వాంటమ్ కట్టుబడి ఉందన్నారు.

షైన్ హై స్కూల్ లో చిన్నారులతో ముచ్చట్లు కార్యక్రమం నిర్వహించిన ఖమ్మం శిశు సంక్షేమ శాఖ

విశాలాంధ్ర- బోనకల్: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన 'చిన్నారులతో ముచ్చట్లు'అనే కార్యక్రమాన్ని ఈరోజు షైన్ హై స్కూల్ లో నిర్వహించారు.. ఈ మోటివేషన్ కార్యక్రమాన్ని శ్రీమతి స్రవంతి నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో స్రవంతి బాల్య వివాహాలు, మంచి స్పర్శ,చెడు స్పర్శ, మాదక ద్రవ్యాలు, ఆన్లైన్ వేధింపులు, లైంగిక వేధింపులు, అక్రమ రవాణా వంటి విషయాల గురించి, వాటివల్ల నష్టాల గురించి, ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాల గురించి చక్కగా వివరించడం జరిగింది. ఇలాంటి వాటికి బానిస అవ్వకూడదు అని,ప్రమాదం వచ్చినప్పుడు చురుగ్గా ఎలా వ్యవహరించాలి అనే విషయాల గురించి మాట్లా డారు ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ అన్సర్ పాషా మాట్లాడుతూ, ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి, ఖమ్మం జిల్లా శిశు సంక్షేమ శాఖ కి, స్రవంతి గారికి ధన్యవాదములు తెలిపారు... ఈ కార్య క్రమం లో డైరెక్టర్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపాల్ అయిటిపాముల శ్వేత, అడ్మిని స్ట్రేషన్ పుచ్చకాయల నాగేశ్వరావు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్లో చేరిన టిఆర్ఎస్ సర్పంచ్

విశాలాంధ్ర -ఖమ్మం : రఘునాథపాలెం మండలం కేవీ బంజర గ్రామ పంచాయతీ కి ఇటీవల నూతనంగా ఎన్నికైన సర్పంచ్ శ్రీమతి భూక్య సరిత , మాజీ సర్పంచ్ గుండు మనోహర్ రెడ్డి , టిఆర్ఎస్ పార్టీ నుండి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో అధ్యక్షుడు నూతి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో జాయిన్ కావడం జరిగినది. తుమ్మల గతంలో చేసినటువంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు , ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం లో జరుగుతున్నటువంటి సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాల కు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీరన్న , రెండో వార్డు సభ్యురాలు అజ్మీర పుష్పావతి , మూడో వార్డు సభ్యురాలు జొన్నలగడ్డ శ్రీదేవి, నాలుగో వార్డు సభ్యుడు అజ్మీర రవి , ఐదో వార్డు సభ్యుడు భూక్య హుస్సేన్ , బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు గుజ్జర్లపూడి నాగేశ్వరరావు, జొన్నలగడ్డ రామాచారి, అల్లూరి శ్రీనివాస్ రెడ్డి, అజ్మీర మంగీలాల్ ,అయినబోయిన రవి ,కృష? అలవాల సాయి , ఉప్పలయ్య సూర నరసింహారావు, బానోత్ హర్ష బుక్కి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ,మరియు వి వెంకటాయ పాలెం సొసైటీ చైర్మన్ రాపూరి సైదుబాబు , చంద్ర రాంబాబు ,నల్లమల ఆనంద్ ఆత్మ మాజీ చైర్మన్ లక్ష్మణ్ గౌడ్ , పాల్గొన్నారు. అంతరం వీరందరు క్యాంపు కార్యాలయం లో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావుని కలిసి వారి గ్రామానికి సంబంధించిన సమస్యలు పలు అభివృద్ధి కార్యక్రమాలు గురించి వివరించారు .మంత్రి ఆ గ్రామానికి సంబంధించిన అన్ని సౌకర్యాలు ,అభివృద్ధి పనులను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.

ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు

సింగరేణి మండల ఉపసర్పంచ్‌లు ఎంపిక పూర్తి

విశాలాంధ్ర కారేపల్లి : సింగరేణి మండలంలో ఉపసర్పంచ్‌ల ఎన్నికను గురువారం అధికారులు నిర్వహించారు.ఎన్నికల జరిగిన 35 పంచాయతీలకు సంబంధించి ఉపసర్పంచ్‌లు అధికారులు ప్రకటించారు. అప్పాయిగూడెం ఉప సర్పంచ్‌గా ఎట్టి సంధ్యారాణి, భాగ్యనగర్‌తండా గుగులోత్ బిక్కులా, బాజు మల్లాయిగూడెం పోతురాజు ఉపేంద్ర, భజ్యాతండా భూక్యా మోహన్‌రావు, చీమలపాడు గుజ్జర్లపూడి స్వాతి, చిన్నమదెంపల్లి ఎజ్జు స్వర?లత, దుబ్బతండా భూక్యా బాబి, గాదెపాడు నన్నెబోయిన ఉపేందర్,గంగారంతండా తేజావత్ శ్కైలజా,గేటుకారేపల్లి కందుల శ్రీనివాసరావు, గేటురేలకాయలపల్లి ధర్మసోత్ కోటేష్,గుంపెళ్లగూడెం భూక్యా శంకర్,గుట్టకిందిగుంపు మహమ్మద్ ప్రవీణ్, జైత్రాంతండా పోలెబోయిన నర్సింహారావు, కోమట్లగూడెం జాగటి మౌనిక, కొమ్ముగూడెం పూనెం రమ, మాధారం బానోత్ మంగ, మంగళితండా బానోత్ మల్సూర్,మాణిక్యారం భూక్యా సునిత,మొట్లగూడెం తాటి రామారావు, నానునగర్ తండా దారావత్ లాలు,పాత కమలాపురం బానోత్ స్వాతి, పాటిమీదిగుంపు తాటి మంజుల,పేరుపల్లి మల్లెల పావని,పోలంపల్లి గుగులోత్ సర్వన్,రావోజితండా పొదెం సావిత్రి,రేగులగూడెం ఆవుల సత్యనారాయణ, రేలకాయలపల్లి జర్పుల కస్నా, సీతారాంపురం మర్సకట్ల నాగేశ్వరరావు,సింగరేణి పెద్దమ్మ భాగ్యలక్ష్మి, సూర్య తండా దారావత్ సునిత, తొడితలగూడెం దొనకొండ సుస్మిత, ఉసిరికా యలపల్లి పొదుగు విజయ, విశ్వనాథపల్లి బొమ్మల ధనమ్మ,ఎర్రబోడు కడియాల రమాదేవిలను ఎన్నికైనారు. వీరికి అధికారులు ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ ఉపసర్పంచ్ ఎన్నికలలో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

మేయర్ ను పరామర్శించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు

విశాలాంధ్ర- ఖమ్మం : నగర మేయర్ పునుకొల్లు నీరజను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్య కారణాల వల్ల ఇటీవల ఆమెకు సర్జరీ జరుగగా ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు రంగా జనార్దన్, ముళ్ళపాటి సీతారాములు, గజ్జి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అయితగోని సొల్యూషన్ కంపెనీ ద్వారా యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - చంద్రుగొండ : చంద్రుగొండ పంచాయతీ ఉపసర్పంచ్ అంతటి రామక ృష? తన మేనల్లుడి కంపెనీ ద్వారా స్థానిక యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్లను పంపిణీ చేయించారు. చంద్రుగొండ మండలంలోని అయ్యన్న పాలెం గ్రామ ఎస్సీ కాలనీ (పెట్రోల్ బంక్ ఏరియా) లో గురువారం ఈ పంపిణీ చేశారు. రామక ృష? మేనల్లుడు అయితగోని శ్రీకాంత్ తన కంపెనీ అయితగోని సొల్యూషన్ ను హైదరాబాద్ లో నిర్వహిస్తున్నాడు. తనకున్న దాంట్లో సేవా కార్యక్రమాలు చేస్తూ వస్తున్నాడు. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో తన మామ రామక ృష? గెలుపొంది చంద్రుగొండ ఉప సర్పంచ్ గా బాధ్యతలు తీసుకున్నాడు. ఈ క్రమంలో ఎస్సీ కాలనీ 14వ వార్డు యువకులకు వాలీబాల్, క్రికెట్ కిట్లను శ్రీకాంత్ వితరణగా ఇచ్చాడు. చంద్రుగొండకు చెందిన జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి అంకిరెడ్డి క ృష?రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మలపల్లి సురేష్, జిల్లా నాయకులు సారేపల్లి శేఖర్, చంద్రుగొండ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చిన్నం శెట్టి మహేష్, నున్నా వెంకటేశ్వర్లు చేతులమీదుగా ఈ కిట్లను యువకులకు అందించారు.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు కొండ్రు రాంబాయమ్మ, నిమ్మగడ్డ శ్రీనివాసరావు, ఎస్ కె. నాగుల్ మీరా, మాజీ ఎంపీటీసీ చాపలమడుగు లక్ష్మణ్, చాపలమడుగు ప్రసాద్, చాపల మడుగు మనోహర్, కోండ్రు వెంకటేశ్వర్లు, మధు, సత్యం, రాంబాబు, కోండ్రు రవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మంత్రి పొంగులేటి పరామర్శ

విశాలాంధ్ర -ఖమ్మం : ఖమ్మం : తెలంగాణ రెవెన్యూ, గ ృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రోడ్డు ప్రమాదంలో మ ృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యడవల్లి రామిరెడ్డి మ ృతదేహాన్ని ఖమ్మం నగరంలోని మమత హాస్పిటల్‌లో గురువారం సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం పాలేరు నియోజకవర్గంలోని వారి స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్పు తెలిపారు. అదేవిధంగా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కరుణగిరి ప్రాంతంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు ఏనుగు మహేష్ తండ్రి ఏనుగు రాములు ఇటీవల మ ృతి చెందడంతో వారి కుటుంబాన్ని మంత్రి పొంగులేటి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

పొంగులేటిని కలిసిన దమ్మపేట సర్పంచ్, ఉప సర్పంచ్

విశాలాంధ్ర, దమ్మపేట : దమ్మ పేటలో ఇటీవలే జరిగిన పంచాయతీ ఎన్నికల ఉత్కంఠ పోరులో సర్పంచ్ గా విజయం సాధించిన పగడాల రమాదేవి, ఉపసర్పంచ్ ఆంగోత్ శ్రీనివాసరావు లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జరిగిన పరిణామా లను మంత్రికి వివరించారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి దీవెనలు తీసుకున్నారు. దమ్మపేట ఎన్నికల సందర్భంగా జరిగిన పరిణామాలు విన్న మంత్రి వీరి విజయంపై ప్రశంసించారు. ఈ ఎన్నికల్లో సర్పంచ్ గా రమాదేవి 470 ఓట్లకు పైగా భారీ మెజార్టీ సాధించడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో అన్ని పక్షాలను ఎదుర్కొని ఒంటరిగా విజయం సాధించటం పట్ల మంత్రి అభినందించారు. విజయాన్ని అందించిన అభ్యర్థులను, వారికి అండగా నిలిచిన మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలను మంత్రి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చాలా బాధ్యతగా పదవులను నిర్వహించాలని అన్ని వర్గాల ప్రజలను కలుపుకుపోతూ, సంక్షేమ, అభివ ృద్ధి ఫలాలు అర్హులైన అందరికీ అందించాలని మంత్రి ఈ సందర్భంగా కోరారు. ?రాబోయే ఐదేళ్ల కాలం ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని కోరారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తూ, పారదర్శకమైన పరిపాలన అందించాలని మంత్రి కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. భారీ మెజార్టీతో గెలిచిన తమకు మంత్రి ఆశీస్సులు లభించడంపై సర్పంచ్, ఉప సర్పంచ్ సంతోషం వ్యక్తం చేశారు.

విజయాన్ని హుందాగా స్వీకరించాలి

రాజకీయాలకతీతంగా సేవలు అందించాలి : ఫజల్ బక్ష్



విశాలాంధ్ర - చంద్రుగొండ : ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఎన్నో ఆశలతో నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజా ప్రతినిధులు రాగద్వేషాలు, రాజకీయాలకతీతంగా సేవలు అందించాలని నియోజకవర్గ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ మండల అధ్యక్షుడు ఫజల్ బక్షు కోరారు. శ్వారావుపేట నియోజక వర్గంలో విజయం సాధించిన సర్పంచులు, వార్డు సభ్యులందరికీ ఆయన గురువారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. తమ నియోజకవర్గంలో మూడు విడత ల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు అధిక స్థానాల్లో కాంగ్రెస్ మిత్ర పక్షాలు బలపరిచిన అభ్యర్థులను గెలిపించారని ప్రజలకు ఆయన క ృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రెండేళ్లలోనే అనేక సంక్షేమ అభివ ృద్ధి కార్యక్రమాలు చేయడం తోపాటు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నిరంతరం శ్రమిస్తూ నియోజకవర్గాన్ని అన్ని విధాల ముందుకు తీసుకెళ్తున్నారని ఈ ఫలితాలు ఎన్నికల్లో కనిపించాయన్నారు. గెలుపొందిన ప్రజా ప్రతినిధులు తమ విజయాలను గర్వంగా కాకుండా వినయంతో, హుందాగా స్వీకరించి ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించినప్పుడే మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఎలాంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా పారదర్శక పాలన అందించాలని కోరారు. అలాగే ఓటమిపాలైన అభ్యర్థులు కొంగిపోకుండా తమ పంచాయతీల్లో సక్రమమైన పాలన జరిగేలా తోడ్పాటు అందించాలని, అవసరమున్న చోట ప్రశ్నించాలని కోరారు.

బొగ్గు బ్లాక్ లను సింగరేణి సంస్థకే ఇవ్వాలి..

ప్రైవేట్ కాంట్రాక్టర్లకు ఇస్తే ఉద్యమిస్తాం : జాతీయ అఖిలపక్షాల నాయకులు హెచ్చరిక

విశాలాంధ్ర - కొత్తగూడెం : తెలంగాణలోని బొగ్గు బ్లాక్ లను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు ఇస్తే సహించేది లేదని జాతీయ సంఘాల అఖిలపక్షం నాయకులు హెచ్చరించారు. బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం శేషగిరిభవన్ సింగరేణి పరిరక్షణ పేర జాతీయ సంఘాల అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒక వేల ప్రైవేటు బొగ్గు బ్లాక్ టెండర్ వచ్చినా అడ్డుకుంటామన్నారు.యాజమాన్యం గుర్తించిన బొగ్గు బ్లాక్ లను సింగరేణి కి ఇవ్వకుండా టెండర్ ప్రక్రియ ద్వారా ప్రైవేటు సంస్థలకు ఇస్తే బొగ్గు తవ్వకాలను అడ్డు కుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వ కంగానే బొగ్గు బ్లాక్ లను సింగరేణికి కాకుండా టెండర్ ప్రక్రియ ద్వారా గుజరాతి వ్యాపారి ఆదాని గ్రూప్, ఏ.ఎం.ఆర్, ఆంధ్ర వ్యాపారి మెగా క్రిషా రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వంకు చెందిన జెన్ కో, సంస్థలు టెండర్ లో పాల్గొనేందుకు ప్రయత్నం చేస్తే సహించబోమన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దుష్ట ప్రమాదాలను ప్రజా, కార్మిక సంఘాలను, రాజకీయ పార్టీలను, కోల్ బెల్ట్ శాసనసభ్యులతో కలిసి పోరాటాలు, ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. మణుగూరు లోని పికే ఓసి డీప్ సైడ్ ఎక్స్టెన్షన్ బొగ్గు బ్లాకును ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే బొగ్గును బంద్ చేపిస్తామని స్పష్టం చేశారు, దాన్ని సింగరేణికే కేటాయించాలి డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు బ్లాక్స్ ప్రైవేటు కు వెళితే మణుగూరు, సింగరేణి మనుగడ కుంటుపడుతుందన్నారు. కార్మికులు, అధికారులు భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుందన్నారు. సింగరేణికి చెందిన బొగ్గు గనులు దక్కా లంటే కోల్ బెల్ట్ ఎమ్మెల్యే లు కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల పై ఒత్తిడి చేయాలని కోరారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలు, యూనియన్ లు చేసిన పోరాటాలను స్ఫూర్తితో సింగరేణిని కాపాడుకునేందుకు తెలంగాణ రాజకీయ పార్టీలు వివిధ సంఘాలు ఏకమై పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి పరిరక్షణకై అన్ని రాజకీయ పార్టీలను, ప్రజా, కార్మిక సంఘాలను కలుపుకొని సకలజనుల సమ్మెకు పిలుపునిస్తామని చెప్పారు. డిసెంబర్ 19న గోదావరిఖని భాస్కర్ భవన్ లో అన్ని రాజకీయ, ప్రజా, జాతీయ, కార్మికసంఘాలతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజకుమార్, వంగ వెంకట్, రాంగోపాల్, రమణమూర్తి, వీరస్వామి, లక్ష్మీనారాయణ, సందబోయిన శ్రీనివాస్, బండారి మల్లయ్య, మండల రాజేశ్వరరావు, నితిన్ కుమార్ ఐఎన్టీ యుసి నాయకులు త్యాగరాజన్, ఆల్బర్ట్, పితంబరం, శ్రీనివాస్, టి బి జి కే ఎస్ నాయకులు కాపు కృష?, కుసాన వీరభద్రం, నాగెల్లి వెంకటే శ్వర్లు, తుమ్మ శ్రీను, వశికర్ల కిరణ్, సి ఐ టి యు నాయకులు, మంద నర్సింహారావు పాల్గొన్నారు .

రైతులకు ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా యూరియా



విశాలాంధ్ర- పినపాక : ఈ నెల 20 నుంచి రైతులు ఇంటి నుంచే ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకొనేలా ప్రభుత్వం ప్రయోగాత్మక కార్యక్రమం చేపడుతుందని వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పినపాక రైతు వేదికలో పెర్టిలైజర్ షాపులు, డీలర్లు, రైతులకు ప్రొజెక్టర్ ద్వారా అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. యూరియా కోసం ఎరువుల షాపులకు, సహకార సంఘాలకు వెళ్లి క్యూలో నిల్చోవడం వంటి సమస్యలకు చెక్ పెట్టాలని ప్రభుత్వం నిర?యించిందన్నారు. ఈనెల 20 తర్వాత రాష్ట్ర మంతటికీ విస్తరించనుందన్నారు. యూరియా పంపిణీ ఏటేటా సమస్యాత్మకమవుతోందని ఈ ఏడాది ఆరంభంలో యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ అంశం పై అధ్యయనం చేసిన వ్యవసాయశాఖ ప్రత్యేక మొబైల్ యాప్ ను రూపొందించిందన్నారు. ఇందులో యూరియా సమాచారం ఉంటుందని చెప్పారు. రైతు తన పంటలకు అవసరమైన పరిమాణాన్ని తనకు అనుకూలమైన ఏడీలరు వద్ద నుంచైనా ముందుగా ఆన్లైన్లో బుక్ చేసుకుని తీసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రమేష్, లలిత కుమారి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

వార్డ్ మెంబర్లుగా విజయం సాధించిన భార్యాభర్తలు

సర్పంచిని ఘనంగా సన్మానించిన గ్రామస్తులు

విశాలాంధ్ర- సత్తుపల్లి: మండలంలోని బేతుపల్లి గ్రామపంచాయతీలో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన మూడో విడత స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి కొప్పుల శ్రీనివాసరావు పై స్వతంత్ర అభ్యర్థి దొడ్డ రాజేంద్రప్రసాద్ ఘన విజయాన్ని సాధించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల కోసం పోరాటం చేసే రాజేంద్రప్రసాద్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజల విశ్వాసాన్ని పొంది అత్యధిక మెజారిటీతో తన ప్రత్యర్థి పై ఘన విజయం సాధించారు. ప్రజల పక్షాన ఉండే వ్యక్తికి ప్రజలు విశ్వాసాన్ని ప్రకటిస్తారు అనటానికి మండలంలో రాజేంద్రప్రసాద్ గెలుపు ఒక ఉదాహరణ. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి పై స్వతంత్ర అభ్యర్థి అయిన దొడ్డ రాజేంద్రప్రసాద్ 1166 ఓట్లు మెజారిటీతో గెలుపొందడంప్రజల్లో ఆయనకున్నవిశ్వాసాన్ని స్పష్టం చేస్తోంది.

భార్య భర్తలు ఇద్దరూ వార్డు మెంబర్లుగా విజయం

మూడో విడత స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఈనెల 17వ తారీకు జరిగిన ఎన్నికల్లో మండలంలోని బేతుపల్లి గ్రామంలో స్వతంత్ర అభ్యర్థి దొడ్డ ప్రసాద్ ప్యానల్ 12 వార్డులు గాను 12 వార్డులు విజయం సాధించి చరిత్ర స ృష్టించగా, ప్యానెల్‌లో పదోవార్డు గుడిపూడి రమేష్ విజయం సాధించగా, రమేష్ భార్య యశో ద 11వార్డ్‌లో విజయం సాధించారు. భార్యా భర్తలిద్దరూ స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి వార్డు మెంబర్లుగా విజయంసాధించిచరిత్రసృష్టించారు.

పదవులను బాధ్యతగా నిర్వర్తించాలి : మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - ఆళ్లపల్లి : పంచాయతీలో విజయం సాధించడం ఒక ఎత్తు అయితే ప్రజలందరికీ అందుబాటులో ఉండి సేవలందిస్తూ మంచి పేరు తెచ్చుకోవడం చాలా ముఖ్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పిలపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆళ్లపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీని ఆదరించి, పార్టీ బలచిన అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిపించినందుకు ప్రజలకు వారు కృ తజ్ఞతలు తెలిపారు. గురువారం మండలంలో గెలి చిన సర్పంచులు, వార్డ్ మెంబర్స్ లకు శాలువాలు కప్పి పూల గుచ్చాలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పంచాయతీ ఎన్నికల విజయం దానికి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. ఎన్నికల సందర్భంగా ఆళ్లపల్లిలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రభుత్వ లక్ష్యాలను అనుసరిస్తూ పనిచేయాలని మండలం నుంచి గెలిచిన 9 మంది సర్పంచ్‌లను ఆయన కోరారు. కాగా రాయపాడు సర్పంచ్ ఊకె చిన్న పాపయ్య, రామాంజగూడెం నుంచి మోకాల శేఖర్, నడిమి గూడెం సర్పంచ్ గా తెల్లం సంధ్య రాణి, బడాయికుంట సర్పంచ్ గా ఏడుళ్ల శ్రావణి, అడివిరామారం పంచాయతీ నుంచి పాయం సురేకాంత, రాఘవపురం నుంచి పాయం రామ నరసయ్య, మేజర్ గ్రామపంచాయతీ మార్కోడు నుంచి సుతారి రమాదేవి, అనంతోగు గ్రామపంచాయతీ నుంచి కల్తివెంకటేశ్వర్లు, ఆళ్లపల్లి మేజర్ పంచాయతీ నుంచి వాసం సుస్మిత లు ఈ సందర్భంగా మంత్రి ఎమ్మెల్యేలను కలిసిన వాళ్లలో ఉన్నారు. వీరందరిని ఆత్మీయంగా సన్మానించి దిశా నిర్దేశం చేశారు.

ఎలాంటి అసౌకర్యాలు లేకుండా..

సింగరేణి డే ను ఘనంగా నిర్వహించాలి : జియం కిరణ్ కుమార్

విశాలాంధ్ర - కొత్తగూడెం : ఈనెల 23న జరగనున్న సింగరేణి ఆవిరాపే దినోత్సవం ఎలాంటి లోటుపాట్లు లేకుండా సౌకర్యాలు కల్పించి ఘనంగా నిర్వహించాలని వెలారే అండ్ సిఎస్ ఆర్ జియం జి వి కిరణ్ కుమార్ సూచించారు. సింగరేణి ఆవితపే దినోత్సవ వేడుకల నిర్వహణపై ఆయన గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సింగరేణి ప్రధాన కార్యాలయ లోని జనరల్ మేనేజర్ వెలారే అండ్ సిఎస్ఆర్ కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. సింగరేణి దినోత్సవ సంధర్భముగా హెడ్ ఆఫీసు లో నిర్వహించే వేడుకల ఏర్పాటు తోపాటు ఇతర కార్యక్రమాల గురించి డిపార్ట్మెంట్ల వారీగా చర్చించారు. అంతేకాకుండా సింగరేణి దినోత్సవ కార్యక్రమానికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. అదే విధముగా హెడ్ ఆఫీస్ ను ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించాలని అందుకు అవసరమయిన అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జి.వి.కిరణ్ కుమార్ తోపాటు డిజిఎం(పర్సనల్) లు కేసా నారాయణ రావు, ముకుంద సత్యనారాయణ, వై.వి.ఎల్. వరప్రసాద్, ఏ. నదేశ్ బాబు, డిజిఎం లు బి. సీతారాం, ఎం.రాజ శేఖర్, డివై సిఎంఓ కే. నాగరాజు, Dy ఎఫ్ యం లు సిహెచ్ రమేశ్, రమేశ్, సివిల్ డిపార్ట్మెంట్ ఎస్ఈ పి. రాజేంద్రప్రసాద్, సెక్యూరిటీ జూనియర్ ఇన్స్పెక్టర్ డి. నారాయణ రెడ్డి, వెలారే పిఏ. ఎస్. వర ప్రసాద రావు సంబంధిత డిపార్ట్మెంట్ల అధికారులు పాల్గొన్నారు.

బీ రౌండ్‌లో రూ.85 కోట్లు సమీకరించిన ఒబెన్ ఎలక్ట్రిక్

బెంగళూరు: భారతదేశంలో ఆర్ అండ్ డీ ఆధారిత ప్రముఖ స్వదేశీ ఎలక్ట్రిక్ మోటర్ సైకిల్ తయారీదారు ఒబెన్ ఎలక్ట్రిక్ తనప్రీ-సిరీస్ %దీ%-రౌండ్‌లో రూ.85 కోట్లుసమీకరించినట్టు నేడు ప్రకటించింది. ఇందులో ప్రస్తుత పెట్టుబడిదారులతో పాటు రాజ్ కె.సోయిన్, ముసాడ్రీ, రమేష్ భూతాడ సహ వంటి ప్రముఖ భారత అమెరికన్ కుటుంబ కార్యాలయాలు పాల్గొన్నాయి. ఈ నిధుల సమీకరణ ఒబెన్ ఎలక్ట్రిక్ దార్శనికత, ఇంజినీరింగ్ నైపుణ్యం, మార్కెట్ పోకడలపై పెట్టుబడిదారుల బలమైన నమ్మకాన్ని ప్రతిబింబిస్తాయి. గడిచిన 12 నెలల్లో 10ఎక్స్ ఆదాయ వ ృద్ధి ద్వారా ఇది నిరూపితమైంది. ఆర్థిక సంవత్సరం 2026లో రూ.100 కోట్లఆదాయం, మార్చి 2026 నాటికి సీఓజీఎస్ (కాగ్స్) బ్రేక్-ఈవెన్‌ను సాధించే దిశగా కంపెనీ అడుగులువేస్తున్న కీలక సమయంలో బలమైన కార్యాచరణ క్రమశిక్షణ సూచికగా ఈ పెట్టుబడి వస్తోంది. కస్టమర్ల ఆమోదం, బలమైన డీలర్షిప్ ఆసక్తితో మార్చి 2026 నాటికి 150 ప్రత్యేక షోరూములు, సర్వీసు కేంద్రాలు, మరో 2 ఏళ్లలో 500 షోరూముల లక్ష్యంతో 2027 నాటికి ఈబీఐటీడీఏ బ్రేక్-ఈవెన్ సాధించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. అధిక నాణ్యతతో కూడిన డీలర్‌షిప్ దరఖాస్తులు, లాభదాయకంగా ఉండటంతో ప్రస్తుత భాగస్వాముల నుంచి పునరావ ృత ఆసక్తిని కంపెనీ చూస్తోంది.

మెడ్‌టెక్‌లో ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ భారీ ముందడుగు

హైదరాబాద్: ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ ఇంటర్నేషనల్.ఇంక్ అనేది భారతదేశానికి చెందిన స్వదేశీ సర్జికల్ రోబోటిక్ రంగంలో అగ్రగామి సంస్థ, నేడు ఒక చారిత్రక మైలురాయిని ప్రకటించింది. సంస్థ తన నెక్స్ట్-జెనరేషన్ ఎస్ఎస్ఐ మంత్ర సర్జికల్ రోబోటిక్ సిస్టమ్ కోసం అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ)లో 510(కే) ప్రీ-మార్కెట్ నోటిఫికేషన్ దాఖలు చేసింది. ఈ దరఖాస్తు 5 డిసెంబర్ 2025న పూర్తయింది. ఇందులో జనరల్ సర్జరీ, యూరాలజీ, కొలోరెక్టల్, గైనకాలజీ, కార్డియాక్ వంటి అధిక డిమాండ్ ఉన్నసర్జికల్ స్పెషాలిటీలు ఉన్నాయి. ఇది భారతదేశంలో అభివ ృద్ధి చేసిన సర్జికల్ రోబోటిక్ ప్లాట్‌ఫామ్ ఒకటి ఇప్పటివరకు చేపట్టిన అత్యంత ముఖ్యమైన అంతర్జాతీయ నియంత్రణ చర్యలలో ఒకటిగా నిలుస్తోంది. దీని ద్వారా ఇప్పటివరకు అంతర్జాతీయ సంస్థల ఆధిపత్యంలో ఉన్నఈ రంగంలో భారత్‌కు ప్రముఖ స్థానం లభిస్తోంది. ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ వ్యవస్థాపకుడు, చైర్మన్, సీఈఓ డాక్టర్ సుధీర్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, “ఎఫ్‌డీఏకి 510(కే) నోటిఫికేషన్ సమర్పించడం ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ కే కాదు, అధునాతన వైద్య సాంకేతికతల రంగంలో భారత్ గ్లోబల్ నాయకత్వంగా ఎదుగుతున్న దిశలో కూడా ఒక నిరాయక ఘట్టం. ఎస్ఎస్ఐ మంత్రను చవకగా, అందుబాటులోఉండేలా, సాంకేతికంగా ప్రత్యేకతతో రూపకల్పన చేశామని అన్నారు.

ప్రపంచ మూలధన మార్కెట్లలో అగ్రగామిగా భారత్

ముంబై: గత దశాబ్దంలో భారతదేశ మూలధన మార్కెట్లు ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మొత్తం వాటాదారుల రాబడిని (టీఎస్ఆర్) అందించాయి, అన్ని ప్రధాన అభివ ృద్ధి చెందిన మరియు వర్ధమాన మార్కెట్లను అధిగమించాయి. 1999 నుండి ప్రచురిస్తున్న బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) ప్రతిష్టాత్మక ప్రపంచ “వాల్యూ క్రియేటర్స్” పరిశోధన శ్రేణిలో భాగమైన దాని ఇండియా వాల్యూ క్రియేటర్స్ రిపోర్ట్ 2025 నుండి ఇది ప్రధాన ముఖ్యాంశం. నివేదిక ప్రకారం, 2015, 2025 మధ్య భారతీయ కంపెనీలు సగటున 15.2% వార్షిక టీఎస్ఆర్‌ను అందించాయి, ఇది ఎస్ అండ్ పీ 500 (13.6%), ఈయూ350 (7.0%), జపాన్, చైనా, సింగపూర్ వంటి ప్రధాన ఆసియా-పసిఫిక్ మార్కెట్లను అధిగమించింది. మరింత ముఖ్యంగా, భారతదేశం టీఎస్ఆర్ పనితీరు నిర్మాణాత్మకంగా ఆరోగ్యకరమైనదిగా ఉంది. ఇది కేవలం ఆదాయ వ ృద్ధి ద్వారా మాత్రమే కాకుండా, మార్జిన్ మెరుగుదల, వాల్యుయేషన్ మల్టిపుల్ విస్తరణ ద్వారా కూడా నడపబడింది. “భారతదేశ మూలధన మార్కెట్లు ఇకపై కేవలం స్థూల ఆర్థిక వేగాన్ని అనుసరించడం లేదు. అవి పదునైన రంగాల మార్పులు, బలమైన మూలధన నిర్వహణ, కార్పొరేట్ నాయకత్వ చర్యలు, పెట్టుబడిదారుల అంచనాల మధ్య బలమైన సమన్వయంతో వేగంగా అభివ ృద్ధి చెందుతున్నాయని ఆసియా-పసిఫిక్ ప్రాంతానికి బీసీజీ బాధ్యులు కంచన్ సంత్వానీ అన్నారు.

ఆర్థిక సమ్మిళితత్వాన్ని ప్రోత్సహిస్తున్న మాక్స్‌పే

హైదరాబాద్: వేగంగా అభివ ృద్ధి చెందుతున్న ఫిన్‌టెక్ వెంచర్ అయిన మాక్స్‌పే ఫిన్‌టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆర్థిక సేవలు తక్కువగా అందే వర్గాలకు తన టెక్నాలజీ-ఫస్ట్ విధానం ద్వారా ఆయా సేవలను అందించడాన్ని పునర్ని ర్వచిస్తోంది. హైదరాబాద్‌కు చెందిన ఈ కంపెనీని 2020లో శివ ప్రసాద్ స్థాపించారు. ప్రత్యేకంగా బ్యాంకులు, రుణగ్రహీతల మధ్య అంతరాన్ని తగ్గించడానికి, ఆర్థిక ఉత్పత్తు లకు సజావైన, పారదర్శక, సమ్మిళిత ప్రాప్యతను అందించడానికి ఈ కంపెనీ ప్రయత్నిస్తోంది. వ్యక్తులు, చిన్న వ్యాపారాల వారిని శక్తివంతం చేసే ద ృష్టితో నిర్మించబడిన మాక్స్‌పే, వారి నగదు ప్రవాహాల ఆధారంగా రుణగ్రహీత కేంద్రీక ృత రుణ తిరిగి చెల్లింపుల ద్వారా, రుణం పొందగలగడాన్ని (క్రెడిట్ యాక్సెస్) ను సరళీక ృతం చేయడానికి, ఆర్థిక లావాదేవీలను క్రమబద్ధీకరించడానికి అధునాతన డిజిటల్ మౌలిక సదు పాయాలను ఉపయోగిస్తుంది. దీని ప్లాట్‌ఫామ్ బీ2బీ, బీ2సీ విభాగాలకు సేవలు అందిస్తుంది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, రుణ సంస్థలకు డిజిటల్ సాధనాలను అందిస్తుంది. ఇది వాటి కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచుతుంది. తుది వినియోగదారులు వేగవంతమైన, మరింత పారదర్శక ఆర్థిక సేవలను అనుభవించడానికి వీలు కల్పిస్తుంది.

2035 నాటికి తలసేమియా రహిత దేశంగా భారత్

న్యూఢిల్లీ: ఆసియా తలసేమియా కాన్‌క్లేవ్ (ఏటిసి)ని జనవరి 10, 11, 2026 తేదీలలో హైదరాబాద్ లో నిర్వహించబోతున్నట్లు తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్) వెల్లడించింది. భారతదేశంతో పాటుగా ఆసియా దేశాల నుంచి ప్రముఖ వైద్యులు, విధాన నిరే?తలు, పరిశోధకులు, ప్రభుత్వేతర సంస్థలు, రోగి సమూహాలు ఈ సదస్సులో పాల్గొననున్నాయి . దేశంలో అత్యంత తీవ్రమైన పుటికీ నివారించగల జన్యు రక్త రుగ్మతలలో ఒకటైన తలసేమియాకు సమన్వయ ప్రతిస్పందనపై చర్చించనున్నట్లు తెలిపింది. గత రెండు దశాబ్దాలుగా తలసేమియా సంరక్షణ, నివారణ, ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోన్న తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ, హైదరాబాద్ ఈ రెండు రోజుల కాన్‌క్లేవ్ నిర్వహిస్తోంది. తలసేమియా రోగుల కోసం ప్రత్యేకంగా పనిచేస్తున్న, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వేతర సంస్థలలో టీఎస్‌సీఎస్ ఒకటి. ప్రస్తుతం 4,350 మందికి పైగా రోగులకు సమగ్ర చికిత్స , మద్దతును ఉచితంగా అందిస్తోంది, వీరిలో చాలామంది జీవితాంతం రక్త మార్పిడి, సంబంధిత వైద్య సేవల కోసం సంస్థపై ఆధారపడి ఉన్నారు. ఈ రెండు రోజుల సదస్సులో కొత్త తలసేమియా జననాలను తగ్గించడం లక్ష్యంగా నివారణ-మొదటి వ్యూహాలపై ఈ సమావేశం చర్చించనుంది.

భారత్‌లో ఏఐ ఎడ్జ్ నిర్మాణంపై బీసీజీఎక్స్-ఫిక్కీ నివేదిక

న్యూఢిల్లీ : భారతదేశం తన ఏఐ ప్రయాణంలో కీలకమైన మలుపులో ఉంది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివ ృద్ధి చెందుతున్న ఏఐ మార్కెట్లలో ఒకటి, శక్తివంతమైన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థతో, దేశం ప్రపంచ ఏఐ లీడర్‌గా మారే సామర్థ్యాన్ని కలిగి ఉంది. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీఎక్స్), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) కొత్త నివేదిక బలమైన స్వీకరణ ఉన్నప్పటికీ, భారతదేశం విలువ సాక్షాత్కారం, ఆవిష్కరణ లోతులో అంతరాలను ఎదుర్కొంటుందని కనుగొంది. ఇండియాస్ ట్రిపుల్ ఏఐ ఇంపెరేటివ్: సక్సీడింగ్ విత్ ఏఐ ఇన్ ఇండియా అనే నివేదిక, ఏఐ నుండి గణనీయమైన ఆర్థిక విలువను ప్రారంభించడానికి కార్పొరేట్‌లు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, విధాన రూపకర్తల నుండి ఉమ్మడి ప్రయత్నాలకు పిలుపునిచ్చింది. యాజమాన్య బీసీజీఎక్స్ పరిశోధన, విధాన విశ్లేషణ ఆధారంగా, ఇది మూడు వ్యూహాత్మక ప్రాధాన్యతలను గుర్తిస్తుంది: ఏఐని ఉపయోగించి వ్యాపారాలను మార్చడం, ఏఐ ఆవిష్కరణలో పెట్టు బడి పెట్టడం మరియు చివరి మైలు వరకు ఏఐ యాక్సెస్‌ను ప్రజాస్వామ్యీకరించడం.

సాల్వ్ ఫర్ టుమారో 2025 : ఏఐతో ఆరోగ్యం, పరిశుభ్రత, శ్రేయస్సు

న్యూఢిల్లీ : ఆరోగ్య సంరక్షణలో సాంకేతికత పాత్ర ఇకపై భవిష్యత్తుకు మాత్రమే పరిమితం కాదు, అది నేడు రోగులు ఎలా నిర్ధారణ పొందుతున్నారు, ఎలా సంరక్షణ అందుతోంది, ఎలా గౌరవంగా చికిత్స పొందుతున్నారు అన్నదాన్ని పూర్తిగా మార్చుతోంది. ఈ మార్పును ప్రతిబింబిస్తూ, శామ్‌సంగ్ ప్రధాన విద్యా కార్యక్రమమైన శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో (ఎస్ఎఫ్‌టీ) 2025, ఐఐటీ ఢిల్లీ భాగస్వామ్యంతో, “ఆరోగ్యం, పరిశుభ్రత, శ్రేయస్సు భవిష్యత్తు” అనే థీమ్ కింద దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులను ఏఐ-ఆధారిత, మానవ కేంద్రిత పరిష్కారాల రూపకల్పనకు ప్రోత్సహించింది. నిజజీవిత వాస్తవాల ఆధారంగా పరిశుభ్రత, పారిశుధ్యం, పోషణ, మానసిక శ్రేయస్సు, నివారణ ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై దృష్టి పెట్టే ఆరోగ్య సాంకేతిక పరిష్కారాలను రూపొందించేందుకు విద్యార్థులను ప్రోత్సహించారు.